శుక్రవారం 14-6-2019

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 83

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



**మార్కెట్ అక్కడక్కడే**

భారీగా ఒడిదుడుకులు. 15 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ - బిజినెస్‌లో



**మనకూ తగిలింది వాన దెబ్బ**

వర్షంతో రద్దయిన భారత్, న్యూజిలాండ్ ప్రపంచకప్ మ్యాచ్ - స్పోర్ట్స్‌లో

# తెలంగాణ ప్రయోజనాలే పరమావధి





నామా



కేకే

**టీఆర్ఎస్ ఎంపీలకు కేసీఆర్ ఉపదేశం** 2లో

విభజన హామీలపై కేంద్రాన్ని కోరాలి

టీఆర్ఎస్‌పీపీ నేతగా కేకే, లోక్‌సభాపక్ష నేతగా నామా

ఉభయసభలకు ఉప నేతలు, విప్‌ల ఏకగ్రీవ ఎన్నిక

## నేడు ముంబైకి సీఎం కేసీఆర్

- కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఆహ్వానించనున్న ముఖ్యమంత్రి

- వివరాలు 2లో

## 17న సీఎంల చర్చలు

- వచ్చే సోమవారం విజయవాడకు సీఎం కేసీఆర్.. 'కాళేశ్వరం' ప్రారంభోత్స వానికి రావాల్సిందిగా జగన్‌కు ఆహ్వానం

- వివరాలు 2లో

## నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు, ర్యాంకులను శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసేందుకు ఐఐటీ రూర్కీ చర్యలు చేపట్టింది. ఆ వెంటనే ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీలలో ఉమ్మడి ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించేందుకు జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ నోటిఫికేషన్ జారీ చేయనుంది. 16 నుంచి విద్యార్థులకు చాయిస్ ఫిల్లింగ్‌కు అవకాశం కల్పించనుంది. మే27న జరిగిన ఈ పరీక్షకు 1.74 లక్షల మంది హాజరయ్యారు.







# కాంగ్రెస్ టు కమలం

## బలమైన సామాజికవర్గం నేతలపై భారతీయ జనతా పార్టీ దృష్టి

- వీలైనంత ఎక్కువ మందిని ఆకర్షించేలా వ్యూహాలు
- నెలాఖరులోగా అరడజను మంది ప్రముఖులను చేర్చుకునే అవకాశం
- టీడీపీలో మిగిలిపోయిన సీనియర్లతోనూ చర్చలు
- వచ్చే ఎన్నికలనాటికి టీఆర్ఎస్‌కు దీటుగా ఎదగాలని కసరత్తు
- రాష్ట్రంలో పార్టీ పటిష్టత బాధ్యతలు రాంమాధవ్, మురళీధర్‌రావులకు అప్పగింత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బలోపేతమయ్యే దిశగా భారతీయ జనతాపార్టీ పావులు కదుపుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార టీఆర్ఎస్‌కు దీటుగా నిలవాలనే లక్ష్యంతో చక్రం తిప్పుతోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌తో దక్షిణ భారతదేశంలో తెలంగాణను గేట్‌వేగా మార్చుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి ఇప్పటివరకు అండగా నిలిచిన సామాజిక వర్గానికి చెందిన నేతలకు గాలం వేసే పనిని ముమ్మరం చేసింది. కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం పార్టీలో మిగిలిపోయిన సీనియర్లను బీజేపీలో చేర్చుకోవాలనే యోచనతో కమలనాథులు చర్చలు జరుపుతున్నారు. ఈ నెలాఖరులోగా తెలంగాణలోని అరడజను మంది ప్రముఖ నేతలను పార్టీలో చేర్చుకుని తమ సత్తా చూపించాలని ఉవ్విళ్లూరుతున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసే బాధ్యతలను జాతీయ ప్రధాన కార్యదర్శులు రాంమాధవ్, మురళీధర్‌రావులకు అప్పగించిన అధిష్టానం.. రాష్ట్రంలో స్థానిక నేతలను సమన్వయం చేసే బాధ్యతలను మిగతా 2వ పేజీలో ▶




# మనకూ ఓ అంతరిక్ష కేంద్రం



- సిద్ధమవుతున్న ఇస్రో
- 2030 కల్లా ఏర్పాటు చేస్తాం
- మైక్రోగ్రావిటీ ప్రయోగాలకు ప్రాధాన్యం
- గగన్‌యాన్ తరువాత పూర్తిస్థాయి నివేదిక
- ఇస్రో ఛైర్మన్ డాక్టర్.కె.శివన్ వెల్లడి

- వివరాలు 13లో




## ఎమ్మెల్సీల అనర్హతపై తీర్పు వాయిదా

- హైకోర్టులో ముగిసిన వాద ప్రతివాదనలు
- తమపై అక్రమంగా వేటు వేశారన్న పిటిషనర్లు
- అనర్హత సబబేనని సర్కారు వాదన -4లో

## మరికొంతకాలం అమిత్ షాయే!

- బీజేపీ అధ్యక్షుడిగా అమిత్ షా మరికొంతకాలం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో ఆరు నెలలపాటు ఆయన పాత బాధ్యతలను కూడా కొనసాగించనున్నారని విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. -13లో

## అడ్డగోలుగా ఆధార్ కేంద్రాలు

- 'ప్రభుత్వ కార్యాలయ ఆవరణ'లో ఏర్పాటు నిబంధనకు నీళ్లు
- రాష్ట్రంలో మెజారిటీ సెంటర్లు ప్రైవేటు స్థలాల్లోనే
- నిఘా లేక వసూళ్లకు పాల్పడుతున్న వైనం

- 5లో

## ఒమన్ వైపు 'వాయు' గమనం

- గుజరాత్‌ను భయపెట్టిన 'వాయు' తుపాను దిశ మార్చుకుంది. అరేబియా సముద్రంలో అల్లకల్లోలం రేపుతున్న ఈ తుపాను ఒమన్ వైపు పయనిస్తోంది. -13లో



# నేడు ముంబైకి సీఎం కేసీఆర్

## కాళేశ్వరం ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర సీఎంకు ఆహ్వానం

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ముంబై వెళ్లనున్నారు. ఉదయం 10.20కి హైదరాబాద్ నుంచి బయల్దేరి నేరుగా ముంబై రాజ్‌భవన్ చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు ఫడ్నవిస్ అధికారిక నివాసమైన 'వర్ష'కు చేరుకుంటారు. ఈ నెల 21న జరిగే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ఫడ్నవిస్‌ను ఆహ్వానించనున్నారు.

# నేటి నుంచి బడిబాట



**సాక్షి, హైదరాబాద్:** పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట'కార్యక్రమాన్ని ఈనెల 14 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా కమిషనర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈనెల 14న మన ఊరి బడి, 15న బాలికావిద్య, 17న సామూహిక అక్షరాభ్యాసం, 18న స్వచ్ఛ పాఠశాల–హరితహారం, 19న పాఠశాల యాజమాన్య కమిటీ– బాల కార్మిక విముక్తిపై కార్యక్రమాలు చేపట్టాలని వివరించారు.

**హేతుబద్ధీకరణకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు**

రాష్ట్రంలో పాఠశాలల హేతుబద్ధీకరణకు, సర్దుబాటుకు ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. దీనిపై కొన్ని వార్తలు వచ్చాయని, ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని పేర్కొన్నారు.

# వైద్య విద్య అధ్యాపకుల అర్హతల్లో మార్పులు

## మూడేళ్ల అనుభవం ఉంటే బోధకులు



**సాక్షి, హైదరాబాద్:** సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య అధ్యాపకుల అర్హతల్లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) మార్పులు చేసింది. ఇప్పటివరకు డీఎం, ఎంసీహెచ్ వంటి సూపర్ స్పెషాలిటీ కోర్సులు చేసినవారికి మాత్రమే సూపర్ స్పెషాలిటీ ప్రొఫెసర్లుగా పనిచేసేందుకు అవకాశం ఉండేది. ఈ నిబంధనను సడలిస్తూ తాజాగా ఎంసీఐ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పీజీ పూర్తి చేసి సంబంధిత విభాగంలో మూడేళ్ల అనుభవం ఉంటే సూపర్ స్పెషాలిటీ ప్రొఫెసర్లుగా పని చేయవచ్చని నూతన నిబంధనల్లో పేర్కొంది. పదేళ్ల పాటు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది. సూపర్ స్పెషాలిటీ ప్రొఫెసర్ల కొరత ఉండటంతో ఎంసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిని సూపర్ స్పెషాలిటీ వైద్యులు వ్యతిరేకిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ చదవకుండా కేవలం మూడేళ్ల అనుభవంతో బోధకులుగా ఎలా పనికొస్తారని ప్రశ్నిస్తున్నారు. పైగా సూపర్ స్పెషాలిటీ చేసిన వారి ఉద్యోగావకాశాలను ఇది దెబ్బతీస్తుందని అంటున్నారు.

# ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలు విడుదల

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల అయ్యాయి. గురువారం సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఏప్రిల్ 24 నుంచి మే 20 వరకు జరిగిన ఈ పరీక్షల్లో ఎస్సెస్సీకి 47,986 మంది విద్యార్థులు హాజరు కాగా, అందులో 16,595 మంది (34.58 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 35,462 మంది విద్యార్థులు హాజరు కాగా, అందులో 13,755 మంది (38.79 శాతం) ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులు ఫలితాలను వెబ్‌సైట్ ( telanganaopenschool.org) నుంచి పొందవచ్చు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిషనర్ విజయ్‌కుమార్, ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ వెంకటేశ్వర శర్మ, జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూలై 13 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

**హైదరాబాద్:** ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ కోటా కింద ఏఓసీ సెంటర్‌లో జూలై 13 నుంచి 18 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్మీ పీఆర్‌ఓ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ర్యాలీ ద్వారా సోల్జర్ టెక్, సోల్జర్ జనరల్ డ్యూటీ, అవుట్ స్టాండింగ్ స్పోర్ట్స్‌మెన్ (ఓపెన్ కేటగిరీ) విభాగాల్లో ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. స్పోర్ట్స్ కేటగిరీలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జూలై 13న ఉదయం 6 కల్లా సికింద్రాబాద్ ఏఓసీ సెంటర్‌లోని థాపర్ స్టేడియంలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, స్విమ్మింగ్, రెజ్లింగ్ క్రీడల్లో ప్రావీణ్యంతో పాటు సర్టిఫికెట్ కలిగిన వారు స్పోర్ట్స్ కోటాలో రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ఈస్ట్‌మారేడ్‌పల్లిలోని ఏఓసీ సెంటర్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

## తెలంగాణ ప్రయోజనాలే

# పరమావధి

- విభజన హామీలపై కేంద్రాన్ని కోరాలి
- టీఆర్‌ఎస్ ఎంపీలకు కేసీఆర్ ఉపదేశం
- టీఆర్‌ఎస్‌పీపీ నేతగా కేకే, లోక్‌సభాపక్ష నేతగా నామా
- ఉభయసభలకు ఉప నేతలు, విప్‌ల ఏకగ్రీవ ఎన్నిక



గురువారం ప్రగతి భవన్‌లో టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో మాలోతు కవిత, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్, కేకే, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా కేంద్ర ప్రభుత్వంతో వ్యవహరించాలని టీఆర్‌ఎస్ ఎంపీలకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఉద్బోధించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎంపీలు పని చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు నెరవేరే వరకు కేంద్రంతో సంప్రదింపులు కొనసాగించాలని, అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వంతో వ్యవహరించాలని సూచించారు. ఈ నెల 17 నుంచి పార్లమెంటు సమావేశాలు మొదలవుతున్న నేపథ్యంలో గురువారం ప్రగతి భవన్‌లో టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు పాల్గొన్నారు. పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వంతో సామరస్య ధోరణితో వ్యవహరించాలని కేసీఆర్ ఈ సందర్భంగా ఎంపీలకు సూచించారు. నిరంతర సంప్రదింపుల ప్రక్రియతో రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వపరంగా రాష్ట్రానికి వచ్చే నిధులు, నిర్ణయాల విషయంలో ఆయా మంత్రిత్వశాఖలతో నిత్యం సంప్రదింపులు జరపాలని సూచించారు.

**ఏకగ్రీవంగా ఎన్నిక...**

లోక్‌సభ కొత్తగా కొలువుదీరుతున్న నేపథ్యంలో టీఆర్‌ఎస్ పార్లమెంటరీపక్ష ఎన్నికల ప్రక్రియను ఈ సమావేశంలో పూర్తి చేశారు. టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా కె. కేశవరావును తిరిగి ఎన్నుకున్నారు. రాజ్యసభలోనూ టీఆర్‌ఎస్‌పక్ష నేతగా కేశవరావు వ్యవహరిస్తారు. లోక్‌సభలో టీఆర్‌ఎస్‌పక్ష నేతగా ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. అలాగే లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఉప నేతగా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, విప్‌గా జహీరాబాద్ ఎంపీ బి.బి.పాటిల్‌ను ఎన్నుకున్నారు. రాజ్యసభలో టీఆర్‌ఎస్‌పక్ష ఉప నేతగా బండ ప్రకాశ్, విప్‌గా జోగినిపల్లి సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుల ఎన్నిక సమాచారంతో టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీకి లేఖ రాశారు.

# గురుకుల ప్రవేశాలు అయోమయం!

- బడులు ప్రారంభమైనా పూర్తిగాని అడ్మిషన్లు
- సకాలంలో ఫలితాలు వెల్లడించకపోవడంతో అడ్మిషన్లలో తీవ్ర జాప్యం

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ తీవ్ర జాప్యమవుతోంది. వాస్తవానికి పాఠశాలలు తెరిచే నాటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి అడ్మిషన్లకు సంబంధించి నిర్వహించిన టీజీసెట్–2019 సకాలంలో ముగిసినప్పటికీ.. వాటి ఫలితాల విడుదల ఈసారి ఆలస్యమైంది. ఆ ప్రభావం అడ్మిషన్లపై పడింది. దీంతో ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటివరకు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పూర్తి కాలేదు. వాస్తవానికి విద్యా సంవత్సరాన్ని జూన్ 1 నుంచే ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ 12 రోజులపాటు సెలవులను పొడిగించినప్పటికీ గురుకుల ప్రవేశాలు పూర్తికాలేదు.

**6,778 సీట్ల మిగులు...**

రాష్ట్రంలో అన్ని సొసైటీల పరిధిలో 821 గురుకుల పాఠశాలలున్నాయి. ఒక్కో గురుకుల పాఠశాలలో 80 సీట్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా ఐదో తరగతిలో 65,680 సీట్లు ఉండాలి. కొన్ని పాఠశాలల్లో భవనాలు, మౌలిక వసతుల సమస్య నెలకొనడంతో ఒక సెక్షన్ మాత్రమే నిర్వహించేలా గురుకుల సొసైటీలు నిర్ణయించాయి. ఈక్రమంలో ఐదో తరగతిలో 60,832 సీట్లు భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసిన సొసైటీలు ఈమేరకు కౌన్సెలింగ్ నిర్వహించి టీజీసెట్–2019 మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించారు. ఈ క్రమంలో విద్యాశాఖ గురుకుల పాఠశాలలు మినహాయిస్తే మిగతా నాలుగు సొసైటీల పరిధిలో 51,242 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. ఇంకా 6,778 మిగిలిపోయాయి. వీటిని రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేయాలని సొసైటీలు నిర్ణయించినప్పటికీ... ఇప్పటివరకు రెండో లిస్ట్‌ను విడుదల చేయలేదు.

**పాఠశాల మార్పు ఉంటుందా?**

గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ అంతా ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహించారు. మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించారు. ఈక్రమంలో వేలాది విద్యార్థులకు తమ నివాస ప్రాంతాలకు వందల కిలోమీటర్ల దూరంలోని పాఠశాలను కేటాయించడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. దీంతో సమీపంలోని పాఠశాలకు మార్చాలని తల్లిదండ్రులు గురుకుల సొసైటీలను కోరుతున్నప్పటికీ... ముందుగా పాఠశాలలో అడ్మిషన్ తీసుకుని రిపోర్టు చేయాలని సూచిస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటివరకు అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు సీటు మార్పు కోసం వేచి చూస్తున్నారు.

# 17న తెలంగాణ, ఏపీ సీఎంల చర్చలు!

- వచ్చే సోమవారం విజయవాడకు సీఎం కేసీఆర్
- 'కాళేశ్వరం' ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా వైఎస్ జగన్‌కు ఆహ్వానం
- విభజన సమస్యలపై చర్చించనున్న ఇరువురు సీఎంలు

**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా మిగిలిపోయిన విభజన సమస్యలపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మరో దఫా చర్చలకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 21న నిర్వహించనున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 17న విజయవాడకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఇరువురు ముఖ్యమంత్రులు రాష్ట్ర విభజన వివాదాలపై మరోసారి చర్చలు జరపనున్నారు. ఈ సమావేశం దృష్ట్యా తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశం మేరకు శాఖలవారీగా విభజన వివాదాల స్థితిగతులపై నివేదికలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర విభజన జరిగి ఐదేళ్లు పూర్తయినా ఇరు రాష్ట్రాల మధ్య కీలక విషయాల్లో వివాదాలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. గత ఐదేళ్లలో కొన్ని విషయాల్లో తీవ్ర వైరం కొనసాగింది. ఏపీ సీఎంగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టాక ఉభయ రాష్ట్రాల మధ్య సంబంధాలు మెరుగయ్యాయి. ఏపీ, తెలంగాణల మధ్య సత్సంబంధాలు నెలకొల్పే దిశగా ఇప్పటికే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రెండు పర్యాయాలు చర్చలు జరిపారు. ఇచ్చిపుచ్చుకొనే పద్ధతిలో సమస్యలను పరిష్కరించుకోవాలనే ధోరణితో ఇరువురు సీఎంలు ఉండటంతో అత్యంత సుహృద్భావ వాతావరణంలో ఈ చర్చలు సాగాయి. హైదరాబాద్‌లో ఏపీ కార్యాలయాల నిర్వహణ కోసం కేటాయించిన భవనాలు గత నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో వాటిని తెలంగాణకు అప్పగిస్తూ ఇరు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రెండు రాష్ట్రాల సీఎంల మధ్య ఇప్పటివరకు జరిగిన చర్చల ఫలితంగానే ఈ మేరకు ముందడుగు పడింది. ప్రధానంగా షెడ్యూల్ 9, 10లోని ప్రభుత్వ రంగ సంస్థల విభజన, విద్యుత్ ఉద్యోగుల పంపకాలు, విద్యుత్ బిల్లుల బకాయిలు తదితర సమస్యలను రెండు రాష్ట్రాలు పరిష్కరించుకోవాల్సింది. ఈ నెల 17న మళ్లీ రెండు రాష్ట్రాల సీఎంలు సమావేశం కానుండటంతో మరికొన్ని సమస్యలకు పరిష్కారం లభించే అవకాశాలున్నాయి.

## 17న నూతన ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రారంభోత్సవం...

హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో కొత్తగా నిర్మించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస గృహాల సముదాయాన్ని సీఎం కేసీఆర్ ఈ నెల 17న ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రారంభించనున్నారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డితో కలసి ఉదయం 11 గంటలకు సీఎం కేసీఆర్ నివాస గృహాల సముదాయాన్ని ప్రారంభిస్తారు. అంతకుముందు ఉదయం 6 గంటల నుంచి ఆర్ అండ్ బీ శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గృహవాస్తు పూజలు నిర్వహిస్తారు. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌ను ప్రారంభించిన అనంతరం కేసీఆర్ నేరుగా విజయవాడకు బయలుదేరి ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను కలవనున్నారు.

# కాంగ్రెస్ టు కమలం

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు అప్పగించారనే చర్చ జరుగుతోంది.

**'ముందస్తు'కు ముందు నుంచే...**

తెలంగాణలో ఆపరేషన్ ఆకర్ష్ కార్యక్రమాన్ని బీజేపీ 2018లో జరిగిన ముందస్తు ఎన్నికలకు ముందే ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన డి.కె. అరుణ, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, టీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, బాబూమోహన్, బొడిగె శోభ, ఆదిలాబాద్ నుంచి ఎంపీగా గెలిచిన సోయం బాపూరావు తదితరులను పార్టీలోకి చేర్చుకుంది. వీరిలో కొందరికి టికెట్లు ఇచ్చి పోటీ చేయించింది. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీలోని బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతలను తీసుకుంటే పార్టీని రాష్ట్రంలో పటిష్టం చేయొచ్చని భావిస్తోంది. ఈ నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలతో పాటు పలువురు అదే సామాజిక వర్గానికి చెందిన నేతలతో రాంమాధవ్ చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. వీరితో పాటు మరికొందరు కాంగ్రెస్ ప్రముఖులు కూడా బీజేపీ ఢిల్లీ పెద్దలకు టచ్‌లో ఉన్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో జరగనున్న పరిణామాలను బట్టి ఈ నెలాఖరులోగా కొందరు కీలక కాంగ్రెస్ నేతలను బీజేపీలో చేర్చుకునే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత వచ్చే స్పందనను బట్టి పార్టీలో కూడా వారికి తగిన ప్రాధాన్యమివ్వాలని, బీజేపీలోకి వస్తే అటు పార్టీపరంగా, ఇటు తమ భవిష్యత్తు పరంగా గ్యారంటీ ఉంటుందనే భావనను కలిగించాలనే ఆలోచనతో బీజేపీ అధిష్టానం ఉన్నట్టు సమాచారం.

**టీడీపీలో మిగిలేది ఆ ఇద్దరేనా?**

తెలుగుదేశం పార్టీలో మిగిలిపోయిన సీనియర్లపై కూడా బీజేపీ దృష్టి సారించింది. ఇప్పటికే మాజీ మంత్రి పెద్దిరెడ్డి, చాడా సురేశ్‌రెడ్డి వంటి నేతలు బీజేపీ పెద్దలను కలిసి చర్చలు జరిపారు. పెద్దిరెడ్డి టీటీడీ పాలకమండలి సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. వీరితో పాటు టీడీపీలో మిగిలిపోయిన నేతలను గుర్తించి వారందరినీ బీజేపీలో చేర్చుకునేందుకు చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. తెలుగు యువతలో కీలకంగా పనిచేసిన లెంకల దీపక్ రెడ్డి, మహబూబ్‌నగర్‌కు చెందిన కొత్తకోట దయాకర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి వంటి నేతలు ఈ జాబితాలో ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలో పార్టీకి బలం లేకపోవడంతో, ఆంధ్రప్రదేశ్‌లోనూ అధికారం కోల్పోవడంతో ఇదే అదనుగా టీడీపీని ఖాళీ చేసే పనిలో కాషాయపార్టీ నేతలు ఉన్నట్టు తెలుస్తోంది. 'టీడీపీలో ఉన్న నేతలకు కనుచూపు మేరలో రాజకీయ భవిష్యత్తు కనిపించడం లేదు. వారు ఆ పార్టీలో ఎన్ని రోజులున్నా అదే పరిస్థితి. రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, చంద్రబాబుకు దగ్గరగా ఉండే రావుల చంద్రశేఖర్‌రెడ్డి మినహా ఆ పార్టీలో ఇంకెవరూ ఉండరేమో' అని ఓ బీజేపీ ముఖ్య నేత వ్యాఖ్యానించడం చూస్తే టీడీపీని ఖాళీ చేయడమే కమలనాథుల లక్ష్యమని అర్థమవుతోంది.

**టార్గెట్.. 2023**

దేశంలోని చాలా రాష్ట్రాల్లో అధికారం దక్కుతున్నప్పటికీ దక్షిణ భారతదేశంలో బీజేపీ పుంజుకోలేకపోతోంది. కర్ణాటకలో కూడా అధికారం దోబూచులాటగానే మారింది. ఈ నేపథ్యంలో మిగిలిన రాష్ట్రాల్లోని సామాజిక, రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో ఆ పార్టీకి ప్రజలు పట్టం కట్టడంతో కమలనాథులకు రాష్ట్రంపై నమ్మకం పెరిగింది. అందులో భాగంగానే గురువారం ఢిల్లీలో జరిగిన పార్టీ పదాధికారుల సమావేశంలో బీజేపీ చీఫ్ అమిత్‌షా తెలంగాణ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్టు తెలుస్తోంది. అటు కాంగ్రెస్‌తో పాటు ఇటు మిగిలిన పార్టీల్లోని కీలక నేతలను పార్టీలో చేర్చుకుని ఎన్నికలకు రెండు మూడేళ్ల నుంచే తమ కార్యాచరణ ప్రారంభించాలని, ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ప్రభావం చూపడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఊపు వచ్చేలా చేయాలనే వ్యూహంతో ఢిల్లీ పెద్దలు పావులు కదుపుతున్నారు. మొత్తంమీద రాష్ట్రంలో 2023 ఎన్నికల నాటికి బలీయ శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న కమలనాథులు.. ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి కలిగిస్తోంది.



## కొండంత కెరటం..

కొన్ని చూడ్డానికి మామూలుగానే కనిపిస్తాయి.. కెరటాలు కూడా అంతే.. అయితే.. అంతెత్తున లేచిన కెరటం తిరిగి కింద పడేలోగా.. చటుక్కున ఫొటో తీసి చూస్తే మాత్రం ఇదిగో ఇలా అబ్బురంగా కనిపిస్తుంది. అందుకే 2019 నేషనల్ జియోగ్రాఫిక్ ట్రావెల్ ఫొటో పోటీలకు వేలాది ఎంట్రీలు వచ్చినా.. నేచర్ విభాగంలో ఈ చిత్రం రెండో బహుమతిని గెలుచుకుంది. హవాయి తీరంలో డానీ అనే ఫొటోగ్రాఫర్ ఈ చిత్రాన్ని తీశారు.

# ఆర్టీసీ బస్సుకు ఐటీఐ విద్యార్థులే గతి!

- అప్రెంటిస్ షిప్ స్టూడెంట్స్‌పై ఆధారపడుతున్న రవాణా సంస్థ
- రెండేళ్ల శిక్షణకు వస్తున్నవారితో నెట్టుకొస్తున్న తీరు
- ఏడేళ్లుగా నియామకాలు లేక భారీగా పోస్టులు ఖాళీ
- వాటిని భర్తీ చేయకుండా... ఈ విద్యార్థులతో కాలయాపన

**సాక్షి, హైదరాబాద్:** కండిషన్‌లో ఉంటేనే ఆర్టీసీ బస్సు రోడ్డుపై సరిగ్గా పరుగుపెడుతుంది, క్షేమంగా ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తుంది. కీలకమైన ఆర్టీసీ బస్సుల భద్రతా ప్రమాణాలు ఇప్పుడు ఐటీఐ విద్యార్థులపై ఆధారపడి ఉన్నాయి. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, ఆర్టీసీలో పరిస్థితి ఇలాగే ఉంది. బస్సు ఎక్కి కూర్చుంటే మనకు అంతా డ్రైవర్ చేతిలోనే ఉన్నట్టు అనిపిస్తుంది. కానీ బస్సు డ్రైవర్ చేతికి వచ్చేముందు దాన్ని సిద్ధం చేసేది డిపో గ్యారేజీ కార్మికులే. బస్సు ఇంజన్ మొదలు, బ్రేకులు, బాడీ, సీట్లు.. ఇలా అన్నింటిని పరీక్షించేది ఈ కార్మికులే. వీరు పచ్చజెండా ఊపిన తర్వాతనే బస్సు డిపో నుంచి బయటకు వస్తుంది. వీరు లేకుంటే బస్సు డిపోకు పరిమితం కావాల్సిందే. కానీ చాలా డిపోల్లో ఈ కేటగిరీ కార్మికుల సంఖ్య తక్కువగా ఉంది. దాదాపు ఏడేళ్లుగా ఆర్టీసీలో నియామకాలు లేకపోవటంతో ఖాళీలు ఏర్పడి క్రమంగా వాటి సంఖ్య భారీగా పెరుగుతూ వస్తోంది. ఇప్పుడు ఆర్టీసీలో దాదాపు వేయికి పైగా ఇలాంటి కార్మికుల కొరత ఉంది. వీరి సంఖ్య తక్కువగా ఉంటే బస్సులు కండిషన్‌లో ఎలా ఉంటున్నాయన్న సందేహం వస్తుంది. కానీ బస్సులు కండిషన్ తప్పకుండా చూడటంలో ఐటీఐ విద్యార్థులు కీలక భూమిక పోషిస్తున్నారు.

**అప్రెంటిస్ షిప్‌తో ఆదుకుంటున్నారు**

ఐటీఐలో చేరుతున్న విద్యార్థుల్లో డీజిల్ మెకానిక్ ట్రేడ్‌పై ఆసక్తి చూపే వారు ఎక్కువ. దీంతోపాటు మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మేన్, వెల్డర్ లాంటి ట్రేడ్స్‌లోనూ చాలామంది చేరతారు. ఇవన్నీ ఆర్టీసీ డిపో గ్యారేజీల్లో అవసరమైనవే. ఆ కోర్సుల్లో భాగంగా చివరలో రెండేళ్ల పాటు విద్యార్థులు ఏదైనా నిర్ధారిత సంస్థలో అప్రెంటిస్ షిప్ చేయాల్సి ఉంటుంది. బీహెచ్‌ఈఎల్, హెచ్‌ఏఎల్ లాంటి సంస్థలతోపాటు ఆర్టీసీ కూడా ఆ జాబితాలో ఉంది. కోర్సులో భాగంగా అప్రెంటిస్‌షిప్ ఎక్కడ చేయాలనుకుంటున్నారో విద్యార్థులు ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. ఇందులో భాగంగా ఇంజన్ మెకానిక్‌కు సంబంధించి చాలామంది ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం అలా ఆర్టీసీలో మూడున్నరవేల మంది ఐటీఐ విద్యార్థులు అప్రెంటిస్‌షిప్ చేస్తున్నారు. వీరికి విడతలవారీగా పరీక్షలు నిర్వహిస్తే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సర్టిఫికెట్లు అందజేస్తుంది.

ఇలా అప్రెంటిస్‌షిప్ కోసం రెండేళ్ల కాలపరిమితితో ఆర్టీసీలో పనిచేసేవారు బస్సులు కండిషన్‌లో ఉంచటంలో కీలకంగా మారారు. కొన్ని డిపోల్లో బస్సులను సకాలంలో సిద్ధం చేయటం కుదరనంత ఇబ్బంది ఉంది. ఈ సమస్యకు ఐటీఐ విద్యార్థులు చెక్ పెడుతున్నారు. ఆర్టీసీ కార్మికులకు వీరు ప్రధాన సహాయకులుగా మారి కొన్ని నెలల్లోనే మెకానిక్‌ల స్థాయిలో పనిచేస్తున్నారు. రెండేళ్లపాటు పనిచేయాల్సి ఉన్నందున ఈలోపు పూర్తి పని నేర్చుకుంటున్నారు. సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్న ఆర్టీసీని వీరు ఆదుకుంటున్నారు. వీరు లేకుంటే బస్సులు కదిలే పరిస్థితి లేదు. కేవలం ఏడు వేల స్టైఫండ్‌తో వారు పని చేస్తుండటం ఆర్టీసీకి కూడా భారంగా లేకపోవటంతో సిబ్బంది నియామకం లేకుండానే వీరి పుణ్యంతో ఆర్టీసీ నెట్టుకొస్తోంది.

## ఇంతా చేస్తే ఉద్యోగం రాదు....

ఆర్టీసీలో ఉద్యోగం దక్కుతుందన్న ఆశతో ఇక్కడ అప్రెంటిస్ షిప్ చేసేందుకు వచ్చే ఐటీఐ విద్యార్థులకు చివరకు నిరాశే మిగులుతోంది. ఇక్కడ ఖాళీలు ఉన్నా... సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఆమోదం లేకపోవటంతో భర్తీ ప్రక్రియ ఉండటం లేదు. అప్రెంటిస్‌షిప్ పూర్తయ్యాక సర్టిఫికెట్ తీసుకుని వెళ్లిపోవటం తప్ప వారికి ప్రయోజనం ఉండటం లేదు. భవిష్యత్తులో భర్తీ ప్రక్రియ ఉంటే వీరికి పది శాతం వెయిటేజీ మాత్రం ఉంటుంది. కానీ ఏడేళ్లుగా నియామకాలు లేనందున ఆ అవకాశం ఎప్పుడొస్తుందో తెలియక వారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం వీరికి స్టైఫండ్‌గా చెల్లిస్తున్న ఏడు వేలను రెట్టింపు చేస్తే వారి జీతాలు చెల్లించొచ్చు. ఆ మొత్తాన్ని ప్రభుత్వం సమకూర్చగలిగితే సరిపోతుంది. వీరి బదులు దాదాపు అంతే మొత్తం చెల్లించి ఔట్‌సోర్సింగ్ కింద సిబ్బందిని తీసుకుంటున్నారు. కానీ సంబంధిత కాంట్రాక్టర్ సిబ్బందికి కేవలం 9 వేలే చెల్లిస్తున్నాడు. ఆ డబ్బులు సరిపోక ఆ సిబ్బంది సరిగా పనిచేయటం లేదు. దీనివల్ల కాంట్రాక్టర్ లబ్ధి పొందటం తప్ప ఇటు ఆర్టీసీ, అటు ఉద్యోగులకు ఉపయోగం ఉండటం లేదు.

## ఇదం జగత్



## సవరణ



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



జస్టిస్ ఎం వెంకటరమణ

13వ తేదీ సంచిక 2వ పేజీలో ప్రచురితమైన ఏపీ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు వార్తలో ఫొటోలు తారుమారయ్యాయి. గమనించగలరు.

# ప్రతి శుక్రవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల:** గతంలో తీసుకున్న నిర్ణయం మేరకు తిరుమల శ్రీవారికి నిర్వహించే అభిషేకం ఇతర సేవల కారణాల వల్ల సంవత్సరం పొడవునా ప్రతి శుక్రవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకే టీటీడీ అధికారులు పరిమితం చేశారు. ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే గతంలో నిర్ణయించిన మేరకు వేసవి రద్దీ దృష్ట్యా ఏప్రిల్ 15 నుంచి జూలై 15వ తేదీ వరకు శని, ఆదివారాల్లో కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ పరిధిలోని వీఐపీలకు మాత్రమే పరిమితం చేశారు. వీఐపీలు, భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# బ్యాగు బరువు తగ్గించేందుకు కసరత్తు

- త్వరలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో విద్యాశాఖ సమావేశం
- పుస్తకాలను స్కూళ్లలోనే పెట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచన
- ఇందుకు పాఠశాలలకు కొంత సమయం ఇవ్వాలని ఆలోచనలు
- 5వ తరగతి వరకు ప్రభుత్వ పుస్తకాలే వినియోగించేందుకు ట్రస్మా హామీ
- ప్రత్యేక దృష్టి సారించిన పాఠశాల విద్య కమిషనర్ విజయ్‌కుమార్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థుల బ్యాగు బరువు తగ్గింపుపై విద్యా శాఖ ఆలోచనలు మొదలు పెట్టింది. గతంలోనే బ్యాగు బరువు తగ్గించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై కసరత్తు ప్రారంభించింది. గతంలోనే ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థుల బ్యాగు బరువుపై అధ్యయనం చేసిన విద్యా శాఖ బ్యాగు బరువు కారణంగా విద్యార్థులు అనారోగ్యం పాలు అవుతున్నారని గుర్తించింది. వారు మోస్తున్న బ్యాగు బరువు అంచనా వేసి, తరగతుల వారీగా ఎన్ని పాఠ్య పుస్తకాలు ఉండాలి.. ఎన్ని నోటు పుస్తకాలు ఉండాలి.. బ్యాగు బరువెంత ఉండాలన్న అంశాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో ప్రభుత్వం కూడా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వాటి అమలు పక్కాగా జరగలేదు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో మళ్లీ బ్యాగు బరువు తగ్గించే అంశం తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో బ్యాగు బరువు తగ్గింపుపై పాఠశాల విద్య కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాలల యాజమాన్యాలకు నచ్చజెప్పే ధోరణితో ముందుకు సాగాలన్న ఆలోచనకు వచ్చారు. ఇందులో భాగంగానే పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం కావాలని భావిస్తున్నారు. వీలైతే అంతకంటే ముందే విద్యా శాఖ అధికారుల నేతృత్వంలో కమిటీలు వేసి పలు స్కూళ్లలో ఉన్న ఏర్పాట్లు, బ్యాగు బరువుపై మరోసారి పరిశీలన జరపాలని యోచిస్తున్నారు. బ్యాగు బరువు తగ్గించేందుకు ఒక్కొక్కటిగా నిబంధనలు అమల్లోకి తేనున్నారు. విద్యార్థులు ఇంటికి తీసుకెళ్లేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు మినహా ఇతర పుస్తకాలను పాఠశాలల్లోనే ఉంచేలా యాజమాన్యాలు ఏర్పాట్లు చేయాలని సూచించనున్నారు. తద్వారా విద్యార్థులపై బ్యాగు బరువు సగం వరకు తగ్గించొచ్చని విద్యా శాఖ భావిస్తోంది.



**ఆర్థిక భారం లేని చర్యలపై దృష్టి..**

బ్యాగు బరువు తగ్గింపులో భాగంగా ముందుగా ఆర్థిక భారం లేని అంశాలపై చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో ఏ రోజు ఏ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు తీసుకురావాలో ముందే చెప్పడం, బ్యాగు బరువును సమానంగా పంచేలా వెడల్పాటి పట్టీలు కలిగిన బ్యాగులను ఎంపిక చేసుకునేలా విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించడం వంటి చర్యలు చేపట్టే ఆలోచనలు చేస్తోంది. పుస్తకాలను పాఠశాలల్లోనే ఉంచేలా ర్యాక్‌లు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై పాఠశాలల యాజమాన్యాలను ఒప్పించాలని భావిస్తోంది.

**స్టేట్ సిలబస్ అమలుపైనా దృష్టి**

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో స్టేట్ సిలబస్ పుస్తకాలే వినియోగించేలా చర్యలు చేపట్టేందుకు విద్యా శాఖ సిద్ధం అవుతోంది. విద్యా శాఖ నిర్దేశిత సిలబస్ ఉన్న సేల్ పుస్తకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉండట్లేదని, అందుకే తాము ప్రైవేటు సిలబస్ పుస్తకాలను వినియోగిస్తున్నామని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యా శాఖకు తెలియజేశాయి. దీంతో ముందుగా మార్కెట్‌లో విక్రయించే పాఠ్య పుస్తకాల ముద్రణను పక్కాగా చేపట్టేలా చర్యలు చేపట్టాలని భావిస్తోంది. ప్రైవేటు పబ్లిషర్లు నిర్ణీత పాఠ్య పుస్తకాల ముద్రణ కోసం అనుమతి తీసుకొని, వాటికి విద్యా శాఖకు రాయల్టీ చెల్లిస్తున్నా, నిర్ణీత పుస్తకాలు ముద్రించడం లేదన్న ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు సేల్ పుస్తకాల ముద్రణను పక్కాగా చేసేలా, ఆయా పుస్తకాలకు సీరియల్ నంబర్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని భావిస్తోంది. తద్వారా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలను మార్కెట్‌లో అందుబాటులో ఉంచి పాఠశాలలు వాటిని అమలు చేసేలా చూసేందుకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పాఠశాల విద్య కమిషనర్ విజయ్‌కుమార్ గుర్తింపు పొందిన ప్రైవేటు యాజమాన్య సంఘంతో (ట్రస్మా) చర్చించారు. వారు కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 1 నుంచి 5వ తరగతి వరకు కచ్చితంగా పాఠశాల విద్యా శాఖ నిర్దేశిత పుస్తకాలనే వినియోగిస్తామని రాత పూర్వకంగా హామీ ఇచ్చారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అదే విధానం కొనసాగించడం ద్వారా ప్రైవేటు పబ్లిషర్ల పుస్తకాలను వినియోగం తగ్గించి, విద్యార్థుల బ్యాగు బరువును నియంత్రించొచ్చని భావిస్తోంది.

## ధాన్యం కొనుగోళ్ల తీరు బాగుంది

### యునైటెడ్ నేషన్స్ ఆహార, వ్యవసాయ సంస్థ ప్రతినిధి టోని సంగనిరా

**సాక్షి, హైదరాబాద్:** ధాన్యం కొనుగోళ్లు, కొనుగోలు కేంద్రాల సమాచారాన్ని రైతులకు సెల్‌ఫోన్ ద్వారా ముందుగానే అందించడం, ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్) సాఫ్ట్‌వేర్ ద్వారా ధాన్య సేకరణ, చెల్లింపుల విధానం అద్భుతంగా ఉందని యునైటెడ్ నేషన్స్ ఆహార, వ్యవసాయ సంస్థ ప్రతినిధి టోని సంగనిరా ప్రశంసించారు. గురువారం పౌరసరఫరాల భవన్‌లో కమిషనర్ అకున్ సబర్వాల్‌తో టోని సంగనిరా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపిఎంఎస్), గోదాముల్లో సీసీ కెమెరాలు, టీ–రేషన్ యాప్, వేలిముద్రలతో రేషన్ పంపిణీ (ఈ–పాస్ విధానం), ఐరిస్, వినియోగదారుల ఫోరం టోల్‌ఫ్రీ నంబర్ పనితీరును సంగనిరా పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించే విధానాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు కొనుగోళ్లు, చెల్లింపులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల రైతులకు వందకు వంద శాతం కచ్చితంగా గిట్టుబాటు ధర లభించేలా తీసుకున్న చర్యలు బాగున్నాయన్నారు. ఏడాదిలోనే కనీస మద్దతు ధర చెల్లించి దాదాపు 14 లక్షల మంది రైతుల నుంచి రూ.13.5 వేల కోట్ల విలువ చేసే 76 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం ప్రశంసనీయమని కొనియాడారు.

## సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇవ్వాలి

### మంత్రి ఎర్రబెల్లిని కలసి విజ్ఞప్తి చేసిన బీసీ సంఘం ప్రతినిధులు

**సాక్షి, హైదరాబాద్:** గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. చెక్ పవర్ లేకపోవడంతో గ్రామ పంచాయతీలో పలు వ్యవహారాలు పూర్తిగా స్తంభించిపోయాయని ఆందోళన వ్యక్తం చేసింది. కనీసం పారిశుద్య కార్మికులకు వేతనాలివ్వలేని పరిస్థితి నెలకొందని తెలిపింది. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని సంఘం ప్రతినిధులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గురువారం కలసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి నిధులను వినియోగించాలంటే సర్పంచ్‌లకు చెక్ పవర్ తప్పనిసరని, అందువల్ల వారికి వెంటనే చెక్‌పవర్ ఇవ్వాలని కోరారు.

## ఐరాస కన్సల్టెంట్‌గా షేక్ మీరా

**సాక్షి, హైదరాబాద్:** ఐక్యరాజ్య సమితి అనుబంధ 'ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్'కు కన్సల్టెంట్‌గా భారతీయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ షేక్ ఎన్ మీరా ఎంపికయ్యారు. డిజిటల్ అగ్రికల్చర్ ప్రాజెక్టుల నిర్వహణలో విశేష అనుభవం ఉన్న షేక్ మీరా 2012–13లో ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థలో పరిశోధకుడిగా పనిచేశారు. వ్యవసాయ రంగంలో సృజనాత్మక ఆలోచనలకు జాతీయ స్థాయిలో స్వర్ణ పతకాలతో పాటు 12 జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు. షేక్ మీరా త్వరలో ఈజిప్టులో పర్యటించి అక్కడి రైతులకు ఆదాయం పెంపుతోపాటు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.

## రుతుపవనాలు మరింత ఆలస్యం

### 18న రాష్ట్రంలో ప్రవేశించే అవకాశం



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలోకి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. తొలుత ఈనెల 8న రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని ప్రకటించారు. అనంతరం 11న అని ఓసారి, 13న అని మరోసారి, చివరకు 16న వస్తాయని ఇంకోసారి పేర్కొన్నారు. తాజాగా అవి 18న వచ్చే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అరేబియా సముద్రంలో తుపాన్ ఏర్పడటంతో రుతుపవనాలు వెనక్కి వెళ్లిపోయాయని అధికారులు చెబుతున్నారు. తుపాన్ వెళ్లిపోయినా, వాతావరణంలో ఇంకా అనుకూలమైన పరిస్థితులు లేకపోవడంతో రుతుపవనాలు ఆలస్యం అవుతున్నాయని పేర్కొన్నారు.

**తగ్గని వడగాడ్పులు...**

రాష్ట్రంలో వాతావరణ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఏప్రిల్‌లో మొదలైన వడగాడ్పులు జూన్ రెండో వారంలోకి వచ్చినా తగ్గడంలేదు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించేంత వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ వేసవిలో ఇప్పటివరకు 36 వడగాడ్పుల రోజులు నమోదయ్యాయి. గత దశాబ్దంలో ఇంతటి పరిస్థితి లేనే లేదు. మరో నాలుగు వడగాడ్పుల రోజులు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# విద్యార్థులు తక్కువున్న స్కూళ్ల తరలింపు!

- టీచర్లను అవసరమున్న చోట సర్దుబాటుకు ఏర్పాట్లు
- విద్యార్థులందరికీ రవాణా సదుపాయం
- చర్యలు చేపట్టిన విద్యాశాఖ
- ఎంఈవోలకు ఆదేశాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఒక్క విద్యార్థి లేని స్కూళ్లు 793 ఉండగా, ఒకటి నుంచి పదిమంది లోపే విద్యార్థులున్న స్కూళ్లు 1,544 ఉన్నాయి. ఇపుడు ఆ స్కూళ్లన్నీ సమీపంలోని మరో పాఠశాలల పరిధిలోకి వెళ్లనున్నాయి. అవేకాదు 20 మందిలోపు విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలు, 30 మందిలోపు ఉన్న ఉన్నత పాఠశాలలది కూడా అదే పరిస్థితి. మరోవైపు ఒక్క విద్యార్థి లేని స్కూళ్లలో 715 మంది టీచర్లు ఉండగా, వారిని గతేడాదే అవసరం ఉన్న స్కూళ్లలో సర్దుబాటు చేశారు. ఇక 1 నుంచి 10 మందిలోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లలో 1,900 మంది టీచర్లు ఉన్నారు. ఇప్పుడు వారితో పాటు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 20 మందిలోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లలోని టీచర్లు, 30 మందిలో విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లోని టీచర్లను అవసరం ఉన్న స్కూళ్లకు పంపించనున్నారు. గతేడాది అన్ని వివరాలను సేకరించిన విద్యా శాఖ, తాజాగా అలాంటి పాఠశాలలను సమీప పాఠశాలల్లో రీలొకేట్ చేసేందుకు చర్యలు చేపట్టింది. వాటిల్లోని టీచర్లను అవసరం ఉన్న పాఠశాలల్లోకి తరలించేందుకు చర్యలు చేపట్టింది. విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఈ నెల 11న నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లాల్లో డీఈవోలు పాఠశాల రీలొకేషన్‌కు చర్యలు చేపట్టారు. అక్కడి విద్యార్థులను సమీప స్కూళ్లకు పంపించేందుకు రవాణా సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అయితే తాజాగా మండలాల వారీగా అలాంటి స్కూళ్లను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని మండల విద్యాధికారులకు (ఎంఈవో) డీఈవోలు ఆదేశాలు జారీ చేశారు.

**విద్యార్థులకు రవాణా సదుపాయం..**

విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలలను రీలొకేట్ చేయడం, టీచర్లను అవసరం ఉన్న స్కూళ్లకు పంపించడం ద్వారా అక్కడి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విద్యాశాఖ ఆదేశించింది. విద్యా హక్కు చట్టం ప్రకారం ఆవాస ప్రాంతంలో పాఠశాల లేకపోతే అక్కడి విద్యార్థులకు ట్రాన్స్‌పోర్టు సదుపాయం కల్పించాల్సి ఉంది. ఆ నిబంధనను పక్కాగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రీలొకేట్ చేసే స్కూళ్లలోని విద్యార్థులందరికి ట్రాన్స్‌పోర్టు సదుపాయం కల్పించేందుకు సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపించాలని డీఈవోలు ఆదేశాలు జారీ చేశారు.

**ఇవీ కేటగిరీల వారీగా పాఠశాలల వివరాలు..**

| | ప్రాథమిక పాఠశాలలు | ప్రాథమికోన్నత పాఠశాలలు | ఉన్నత పాఠశాలలు | మొత్తం స్కూళ్లు |
|---|---|---|---|---|
| సున్నా విద్యార్థులున్నవి | 779 | 11 | 3 | 2,489 |
| 1 నుంచి 10 మంది లోపున్నవి | 1510 | 20 | 4 | |
| 11 నుంచి 20 మంది లోపున్నవి | 0 | 96 | 22 | |
| 21 నుంచి 30 మందిలోపున్నవి | 0 | 0 | 44 | |

**ఆయా పాఠశాలల్లోని టీచర్ల వివరాలు...**

| | ప్రాథమిక పాఠశాలలు | ప్రాథమికోన్నత పాఠశాలలు | ఉన్నత పాఠశాలలు | మొత్తం |
|---|---|---|---|---|
| సున్నా విద్యార్థులున్న వాటిల్లో | 674 | 27 | 14 | 3,365 |
| 1 నుంచి 10 మంది లోపున్న వాటిల్లో | 1781 | 89 | 30 | |
| 11 నుంచి 20 మంది లోపున్న వాటిల్లో | 0 | 321 | 138 | |
| 21 నుంచి 30 మంది లోపున్న వాటిల్లో | 0 | 0 | 291 | |



## సింగరేణిలో 10,446 కొలువుల భర్తీ!

- డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 3,025 నియామకాలు
- 7,421 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు
- సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ హర్షం



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు సింగరేణి బొగ్గు గనుల సంస్థ 10,446 కొలువులను భర్తీ చేసింది. 2014 నుంచి 2019 మే వరకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో 3,025 మంది, డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ పథకం కింద మరో 7,421 మందిని నియమించింది. మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, పర్సనల్, అకౌంట్స్, తదితర విభాగాల్లో కొత్త నియామకాలు జరిగాయి. గడిచిన మూడు దశాబ్దాల్లో ఇంత పెద్ద మొత్తంలో నియామకాలు జరపడం ఇదే తొలిసారని సంస్థ యాజమాన్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ఖాళీల భర్తీలో ప్రత్యేక చొరవ చూపారని తెలిపింది. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా రాత పరీక్ష ద్వారానే నియామక ప్రక్రియ జరిపామని పేర్కొంది. కొత్తగా ఉద్యోగాలు పొందిన నాన్ కేడర్ వర్కర్ కేటగిరీలో క్లర్కులు, ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, వెల్డర్లు, సర్వేయర్లు తదితర టెక్నీషియన్ల నియామకం జరపగా, అధికారుల విభాగంలో మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఇంజనీర్లు, సివిల్, ఫైనాన్స్, అకౌంట్స్, పర్సనల్, ఫారెస్ట్, సెక్యూరిటీ అధికారులు, స్పెషలిస్టు డాక్టర్లు తదితరులను నియమించినట్లు వెల్లడించింది. చనిపోయిన, అన్‌ఫిట్ అయిన కార్మికుల స్థానంలో వారి వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలిచ్చే ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపింది. గతంలో నెలకు 20 లేదా 30 మందికి మాత్రమే డిపెండెంట్ ఉద్యోగాలు కల్పిస్తుండేవారని, ప్రస్తుతం నెలకు 150 నుంచి 200 మందికి ఉద్యోగాలిస్తున్నామని పేర్కొంది. 2014లో 674 మందికి ఉద్యోగాలు ఇవ్వగా 2015లో 1,989 మందికి, 2018లో 1,663 మందికి, 2019లో మే వరకు 1,378 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు వెల్లడించింది.

**4,728 మందికి కారుణ్య నియామకాలు**

కారుణ్య నియామక ప్రక్రియ 2018 ఏప్రిల్ నుంచి ముమ్మరంగా సాగుతోందని సింగరేణి యాజమాన్యం తెలిపింది. సీఎం కేసీఆర్ సూచనల మేరకు నిమ్స్, గాంధీ ఆసుపత్రి తదితర ప్రభుత్వ వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పరీక్షించి అన్‌ఫిట్ అయిన కార్మికుల స్థానంలో వారు సూచించిన వారసులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 38 మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించగా 4,728 మంది కార్మికులు కారుణ్య నియామక ప్రక్రియలో తమ వారసులకు ఉద్యోగం లభించే అవకాశం పొందారని వెల్లడించింది. ఇంతమంది సింగరేణిలో ఉద్యోగాలు పొందడంపై సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆనందం వ్యక్తం చేశారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

FACULTY WANTED
For a Leading Educational services firm in Vellore and Chennai.
NEET, JEE MAINS & ADVANCED
Physics, Chemistry, Botany, Zoology and Mathematics PGTs, Coordinators and Counsellors. Sr, Jr and Freshers
Pay upto 30 lacs p.a + Perks
Apply to
director@thelearningpoint.org

DUBAI
company : SARAM INTERNATIONAL FZE
CV Selecton in Vijayawada
Employment Visa in 7 Days

| S.No. | Post | Salary DH |
|---|---|---|
| 1. | Drivers - 4 Wheeler | 2500-4500/- |
| 2. | Bike Drivers (Food Delivery Boys) | 2100-3500/- |

*Age Limt : 22- 40 *ECR - ECNR Passport Eligible
Indian Driving Licence Accepted
Accommodation + Medical + Transportation + Tips + Duty 08 Hours + OT
Licence : AP-06-084-18-0511673
Email : infodhisa@gmail.com
DHISA CAREERS
Cell : 7995 396 778, 9010 592 898, 9030 133 133, 7386 490 496
#31-23-1/1, 2nd Floor, Beside BSNL Office, Opp. Bharath Petrol Bunk, Eluru Road, Vijayawada

VIDYA NIKETAN HIGH SCHOOL & JUNIOR COLLEGE
(English Medium) RESIDENTIAL & DAY SCHOOL
Patha Rajampet, Kamareddy Dist, 6300722544 - 9010023500
WALK-IN-INTERVIEW FOR RESIDENT TEACHERS
PGTs to teach Mathematics, Physics, Chemistry, Botany, Zoology, History, Economics, Commerce, Civics & English for class VIII to Inter-II year. SALARY : Upto 35,000/-
TGTs to teach English, Science, Social & Maths for classes I to VII. SALARY : Upto 25,000/-
Montessori Trained Teachers to teach Kindergarten children SALARY : Upto 25,000/-
Free food and accommodation provided. All teachers will have boarding responsibilities.
Candidates must be fluent in English. B.Tech & M.Tech candidates can also apply.
Walk in Interview to the above given address on 16-06-2019 ( Sunday ) between 11am and 5pm

SHRIRAM City ఉద్యోగ అవకాశాలు
SCUF, Hyderabad, Talangana లో ఉన్నటువంటి శాఖలలో క్రింద తెలుపబడిన ఉద్యోగాలలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది.
1. Management Trainees : విద్యార్హత MBA
2. Marketing Executives : విద్యార్హత Any Degree
3. Collection Executives : విద్యార్హత Intermediate
శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లి. Zonal Office : 3rd Floor, Himayath Nagar, Bhupal Reddy Complex, Opp. Petrol Pump.
Cont : 8347222114, 9000884134

NATIONAL CENTRE FOR SUSTAINABLE AQUACULTURE (NaCSA)
(MPEDA, Ministry of Commerce & Industry, Govt. of India)
D.No.: 70-1A-6/1, Vasireddy Vaari Street, Near Muncipal High School, Ramanayya Peta, KAKINADA-533005. A.P., Ph.:0884-2350655. ISO 9001:2015
REQUIRES FOR ANDHRA PRADESH STATE
Name of the Post : Project co-ordinator: 01 No.s
Qualification : M.F.Sc or M.Sc (Aquaculture, Marine Fisheries, Biological Science) with 8 years experience in aquaculture including shrimp hatchery / shrimp farming
Name of the post : Field Managers :19 No.s :
Qualification : B.F.Sc. or B.Sc in Biological Science / Zoology preferably in Aquaculture with 2 years experience.
Last date for receiving applications through online is 30th, June, 2019
Appointment is purely on contract basis.
Eligible candidates may apply online
For further details, please visit our website : www.nacsampeda.org.in




పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము
పరిపాలన భవనం, రాజేంద్రనగర్, హైదరాబాదు-500 030
పశుసంవర్ధక, మరియు మత్స్య శాస్త్ర పాలిటెక్నిక్ ప్రవేశ ప్రకటన
నెం. 2/Exam/2019 తేది : 13.06.2019
పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము నందు గల పశుసంవర్ధక మరియు మత్స్య శాస్త్రము నందు రెండు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సులకు 2019-20 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించబడును. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు, దరఖాస్తు, మార్గదర్శకాలు మరియు ఇతర వివరముల కొరకు విశ్వవిద్యాలయం యొక్క వెబ్ సైట్ http://tsvu.nic.in ను సందర్శించగలరు. పూర్తి చేసిన దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేది 10.07.2019.
రిజిస్ట్రారు యస్.టి. విరోజ రావు



# ఎమ్మెల్సీల అనర్హతపై తీర్పు వాయిదా

**హైకోర్టులో ముగిసిన వాద ప్రతివాదనలు**

- తమపై అక్రమంగా వేటు వేశారన్న పిటిషనర్లు
- అనర్హత సబబేనని సర్కారు వాదన
- లిఖితపూర్వక వాదనలు స్వీకరించిన ధర్మాసనం
- తీర్పు తర్వాత వెల్లడిస్తామని ప్రకటన



**సాక్షి, హైదరాబాద్:** ముగ్గురు ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటిస్తూ తెలంగాణ శాసన మండలి చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రకటించాలని కోరుతూ వేర్వేరుగా దాఖలైన మూడు పిటిషన్లపై గురువారం వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల నుంచి లిఖితపూర్వక వాదనలు స్వీకరించిన హైకోర్టు.. తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కె.యాదవరెడ్డి, ఎస్.రాములు నాయక్, ఆర్.భూపతిరెడ్డి అధికార టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారనే ఫిర్యాదుపై శాసనమండలి చైర్మన్ ఆ ముగ్గురినీ ఎమ్మెల్సీలుగా అనర్హులని ప్రకటించారు. అయితే.. రాజ్యాంగ, చట్ట నిబంధనలకు విరుద్ధంగా చైర్మన్ వ్యవహరించారంటూ ఆ ముగ్గురూ వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు.

**పదో షెడ్యూల్ 8వ పేరాను సమీక్షించాలి: భూపతిరెడ్డి**

భూపతిరెడ్డి తరపు న్యాయవాది ఆనంద్ కపూర్ వాదనలు వినిపిస్తూ.. 10వ షెడ్యూల్‌లోని 8వ పేరా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. 10వ షెడ్యూల్ కింద అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌లకు ఏకపక్ష అధికారాలు ఉన్నాయని, దీంతో వారు ఇష్టం వచ్చిన రీతిలో నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే పిటిషనర్‌ను మండలి చైర్మన్ అనర్హుడిగా ప్రకటించారని, ఈ చర్యను రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రకటించాలని కోరారు. ట్రిబ్యునల్ హోదాలో మండలి చైర్మన్ తీసుకున్న నిర్ణయం చెల్లదని, ఆయన రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని వాదించారు.

**అది చట్ట వ్యతిరేకం: యాదవరెడ్డి**

యాదవరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ కాంగ్రెస్ పార్టీలో చేరారనేందుకు నిర్దిష్టమైన ఆధారాలు లేవన్నారు. ఈ విషయాన్ని పట్టించుకోకుండానే మండలి చైర్మన్ అనర్హత వేటు వేశారని, మేడ్చల్ సభలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీని కలిసినందుకే అనర్హత వేటు వేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందుకు కృతజ్ఞతలు చెప్పడానికే సోనియా, రాహుల్ గాంధీలను పిటిషనర్ కలిశారని వివరించారు. పార్టీ ఫిరాయించినట్టుగా ఆధారాలు చూపడంలేదని, పత్రికల్లో వచ్చిన ఫొటోలనే ఆధారాలుగా భావించడం చెల్లదన్నారు. ఫిరాయింపు వేరు ఒక జాతీయ నేతను కలవడం వేరు అని, ఈ తేడాను గుర్తించకుండానే రాజ్యాంగ విరుద్ధంగా అనర్హత వేటు వేశారని, ఇది చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు.

**నామినేటెడ్ ఎమ్మెల్సీకి పార్టీతో పనిలేదు: రాములు నాయక్**

రాములు నాయక్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ వాదిస్తూ.. సామాజిక సేవకు గుర్తింపుగా పిటిషనర్‌ను గవర్నర్ తన కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేశారని నివేదించారు. దీనికి పార్టీలతో సంబంధం లేదని పేర్కొన్నారు. ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలను కలిస్తేనే పార్టీ ఫిరాయించారనే అభియోగంతో వేటు వేశారన్నారు. నామినేట్ చేసిన పత్రాల్లో ఏ పార్టీకి చెందని వ్యక్తి అని ఉందని.. ఆ పత్రాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద కోరితే ఇవ్వలేదని వివరించారు. నాలుగు వారాల సమయం ఇస్తే తనపై ఆరోపణలు అవాస్తవమని నిరూపిస్తామని చెప్పినా మండలి చైర్మన్ ఖాతరు చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కోర్టుకు చెప్పారు.

**బహిరంగసభలో పార్టీ ఫిరాయించారు: అదనపు ఏజీ**

మండలి చైర్మన్ తరపున అదనపు ఏజీ జె.రామచంద్రరావు వాదిస్తూ.. పిటిషనర్లు బహిరంగంగానే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకుని పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. టీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురూ ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని చెప్పారు. మేడ్చల్‌లో కాంగ్రెస్ నిర్వహించిన సభలో ఇద్దరు టీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని.. ఓ నేత ఢిల్లీ వెళ్లి సోనియా, రాహుల్‌గాంధీలను కలిసినట్లు పత్రిక, టీవీల్లో వార్తలు వచ్చాయని, వాటిని పిటిషనర్లు ఖండించలేదని తెలిపారు. ఒక పార్టీ తరపు ఎమ్మెల్సీగా ఉంటూ మరో పార్టీకి కొమ్ము కాయడం క్యారెక్టర్‌కు సంబంధించిన వ్యవహారమన్నారు. ఆ క్యారెక్టర్ కోల్పోయిన నేపథ్యంలో చర్యలు తీసుకోవచ్చునని సుప్రీంకోర్టు సైతం చెప్పిందని, అందువల్ల వారిని అనర్హులుగా ప్రకటించడం రాజ్యాంగబద్ధమేనని స్పష్టంచేశారు.

**రాములు నాయక్‌కు ఎప్పటి నుంచో పార్టీ సభ్యత్వం..**

ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని ఫిర్యాదు చేసిన ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తరపున న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. టీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం ఉండి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకుని ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓటమి కోసం పనిచేశారని వివరించారు. రాములు నాయక్‌కు పార్టీ సభ్యత్వం ఉండగానే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ అయ్యారని, మండలి చైర్మన్ ఎదుట వాదనల్లో పార్టీ సభ్యత్వం ఉందని కూడా నాయక్ అంగీకరించారని పేర్కొన్నారు. నామినేట్ అయిన ఆరు నెలల్లోగా ఏదో ఒక పార్టీలో చేరితో ఫిరాయింపు అవ్వదని, అయితే ఎప్పటి నుంచో రాములు నాయక్‌కు టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉందని తెలిపారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే అనర్హత వేటు వేయవచ్చునని సుప్రీంకోర్టు తీర్పులు కూడా వెలువరించిందని నివేదించారు. కాగా, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ 8వ పేరాకు రాజ్యాంగబద్ధత ఉందని కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన ఎన్.హరినాథ్‌రెడ్డి స్పష్టంచేశారు.

### ధర్మాసనం లేవనెత్తిన సందేహాలివీ..

''ప్రత్యేకాధికారాలున్న రాష్ట్రపతి సైతం అనేక నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని కూడా తప్పుపట్టవచ్చా? పత్రికల్లో వార్తలు వచ్చాయని చెబుతున్నారు. ఇవన్నీ నిజమే కావచ్చు. కానీ కోర్టు సాక్ష్యాలు ముఖ్యం. నిజానికి కూడా సాక్ష్యం కావాలి. ఆరోపణలకు వాస్తవిక ఆధారాలు ఉండాలి. సేవా రంగంలోని వ్యక్తిని గుర్తించి గవర్నర్ ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తే దానికి పార్టీ ఫిరాయింపు ఎలా వర్తిస్తుంది. క్రాస్ ఎగ్జామ్ చేసేందుకు ఇరు పక్షాలకు అవకాశం ఇచ్చారా''అని విచారణ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. మండలి చైర్మన్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ క్వాసీ జ్యుడీషియల్ సంస్థ కాదని, ఆ ట్రిబ్యునల్‌కు సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లు వర్తించకపోయినా సహజ న్యాయసూత్రాలకు కట్టుబడి ఉండాలని స్పష్టంచేసింది. మండలి చైర్మన్ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులు, వీడియోలు ఇవ్వాలని ఆదేశించింది.

## భట్టి దీక్ష అంతర్గత పోరులో భాగం: బాల్క సుమన్



**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య అంతర్గత పోరులో భాగంగానే సీఎల్పీ నేత భట్టి విక్రమార్క దీక్ష చేశారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసిన కాంగ్రెస్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, టీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌లతో కలసి బాల్క సుమన్ తెలంగాణ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన, ఎన్నికైన ప్రజా ప్రభుత్వాలను రద్దు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని, ప్రజాస్వామ్యం గురించి ఆ పార్టీ నేతలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. టీఆర్ఎస్ పార్టీని కూడా విచ్ఛిన్నం చేయాలని కాంగ్రెస్ ప్రయత్నించలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి కొంతమంది నేతలు వేరే పార్టీలకు వెళ్లిపోతారని వార్తలు వస్తున్న నేపథ్యంలో... ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ప్రవచనాలు వల్లిస్తోన్న భట్టి ముందుగా ఆ సంగతి చూసుకోవాలన్నారు. పరిషత్ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పిచ్చినా కాంగ్రెస్ నేతల తీరు మాత్రం మారడం లేదని విమర్శించారు. కొనుగోలు చేయడానికి తాము గొర్రెలం, బర్రెలం కాదని ఎమ్మెల్యేలు స్పష్టంగా చెప్పినా కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు.

## మా ఆందోళన.. మీకు అలజడిలా అనిపిస్తోందా?: రామచంద్రరావు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో అదృశ్యం అవుతున్న వారి గురించి మేం ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. బీజేపీ అలజడి సృష్టిస్తోందని ప్రభుత్వం ఆరోపిస్తున్నదని బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై ఎన్నో అత్యాచారాలు జరిగాయని, యాసిడ్ దాడులు, హత్యలు లాంటి సంఘటనలపై ప్రతిపక్షంగా తమ బాధ్యతను నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడొద్దని టిఆర్ఎస్ భావిస్తోందన్నారు. రాష్ట్రాన్ని బెంగాల్‌లాగా మార్చితే ఉరుకోమంటూనే, టీఆర్ఎస్ పార్టీ తెలంగాణను బెంగాల్‌లాగా మార్చుతోందన్నారు. బీజేపీ కార్యకర్తలను టీఆర్ఎస్ వారు చంపుతున్నారన్నారు. జై శ్రీరామ్ అంటే జైళ్లలో వేస్తారా.. హిందూ గాళ్ళు బొందుగాళ్ళు అంటే మేం పడుతూ ఉండాలా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ అణచివేతపై కచ్చితంగా పోరాడతామన్నారు. టీఆర్ఎస్‌కు మిత్రపక్షంగా ఉన్న ఎంఐఎంకు ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ బలపడటాన్ని తట్టుకోలేక టీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా విమర్శలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

## వాళ్లను సంతలో పశువుల్ని చేశారు

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి**



**సాక్షి, హైదరాబాద్:** కొనుగోలు చేసేందుకు తామేమైనా గొర్రెలమా, బర్రెలమా? అని 12 మంది ఎమ్మెల్యేలు ప్రశ్నించడం వింతగా ఉందని, ముఖ్యమంత్రి కేసీఆరే వాళ్లను సంతలో పశువుల్ని చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఎద్దేవా చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఎంతో విలువ ఉండేదని, ఇప్పుడు ఆ విలువ లేకుండా పోయిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ 12 మంది ఎమ్మెల్యేలను ప్రజలు ఛీ కొడుతున్నారని, వారికి నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి పోటీకి దిగాలని ఆయన డిమాండ్ చేశారు.

## 'మేలుకోకపోతే గ్రేటర్‌లో కష్టమే'



**సాక్షి, హైదరాబాద్:** పరిషత్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ముందుగా మేలుకోకపోతే గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నష్టపోతుందని మాజీ మంత్రి ముకేశ్‌గౌడ్ కుమారుడు టీపీసీసీ కార్యదర్శి ఎం.విక్రమ్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు షెడ్యూల్ కన్నా ముందుగానే నిర్వహించాలని టీఆర్ఎస్ యోచిస్తోందని, కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలపై దృష్టి పెట్టకపోతే బీజేపీ పుంజుకునే అవకాశం ఉందన్నారు. అదే జరిగితే సిటీలో కాంగ్రెస్ శాశ్వతంగా నష్టపోతుందని హెచ్చరించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో యువతకు అవకాశం ఇచ్చి కొత్త వారిని బరిలోకి దింపితే కొత్త ఓటర్లు బీజేపీ వైపు కాకుండా కాంగ్రెస్ వైపు మొగ్గుచూపు తారని, ఈ మేరకు ఇప్పటినుంచే కాంగ్రెస్ కార్యాచరణ ప్రారంభించాలని చెప్పారు. గతంలో పీజేఆర్, ఆ తర్వాత దానం నాగేందర్, ముకేశ్ లాంటి నేతలు కాంగ్రెస్‌కు అండగా ఉండేవారని, ఇప్పుడు సిటీ కాంగ్రెస్‌లో బలమైన నేతలు లేకుండా పోవడం దురదృష్ట కరమని వివరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కనీసం జిల్లా కలెక్టరేట్‌ను కూడా ముట్టడించలేని స్థాయిలో సిటీ కాంగ్రెస్ ఉందన్నారు. తనకు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ట్రేడ్ యూనియన్లతో తనకున్న సంబంధాలతో తానేంటో నిరూపించుకుంటానని ఆయన అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

## మంద కృష్ణ తప్పుకోవాలి: పిడమర్తి రవి



**హైదరాబాద్:** ఎమ్మార్పీఎస్ ఉద్యమం నుంచి ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తప్పుకోవాలని మాదిగ జేఏసీ డిమాండ్ చేసింది. ఉస్మానియా వర్సిటీలో గురువారం మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతకుల భాస్కర్‌లు విలేకరులతో మాట్లాడారు. పాతికేళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మంద కృష్ణ మాదిగ సాధించిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఓడిపోతేనే కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ, వామపక్ష నేతలు సురవరం సుధాకర్‌రెడ్డి, సీతారామ్ ఏచూరి అధ్యక్ష పదవుల నుంచి తప్పుకోవాలని చూశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకి అమ్ముడు పోయే మంద కృష్ణ మాదిగ వర్గీకరణ సాధించలేరన్నారు. వెంకయ్యనాయుడు కాళ్లు మొక్కిన మంద కృష్ణ ఇప్పుడు కేంద్ర సహాయమంత్రి కిషన్ రెడ్డికి దగ్గరవుతున్నారన్నారు. పార్లమెంట్‌లో బీజేపీతో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు ఆమోదింపచేయాలని, వర్గీకరణపై హామీ ఇస్తేనే మంద కృష్ణమాదిగ నిర్వహించే ఎమ్మార్పీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు కిషన్‌రెడ్డిని ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. టీఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో జూలై 5న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మాదిగ అమర వీరుల సంస్మరణ సభకు భారీగా తరలి రావాలని కోరారు.

## వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా రామ్మోహన్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా పరిగి మాజీ ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డిని నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు అధ్యక్షుడిగా ఉన్న తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి టీఆర్ఎస్‌లో చేరడంతో ఆయన స్థానంలో రామ్మోహన్‌రెడ్డిని కొత్తగా నియమించారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రసాద్, తాండూరు మున్సిపల్ చైర్మన్ సంపత్‌ల సిఫారసు మేరకు రామ్మోహన్ నియామకం జరిగినట్టు ఉత్తమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## 'టీఆర్టీ అభ్యర్థుల అరెస్టు అప్రజాస్వామికం'



**సాక్షి, హైదరాబాద్:** టీఆర్టీ అభ్యర్థులు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వస్తే వారిని అడ్డగించి అరెస్టు చేస్తారా? అని ప్రభుత్వాన్ని సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. దీనిపై సర్కార్‌కు అనేకసార్లు చెప్పినా నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తోందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి టీఆర్టీ ఉపాధ్యాయ పోస్టుల్లో ఎంపికైన అభ్యర్థులందరికీ పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణపై అధిష్టానం ప్రత్యేక దృష్టి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్**



**సాక్షి, న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 20 శాతం ఓట్లు సాధించి నాలుగు స్థానాల్లో గెలుపొందడంతో రాష్ట్రంపై పార్టీ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. పశ్చిమబెంగాల్, తెలంగాణలో పార్టీ ఆశాజనకమైన ఫలితాలు సాధించడంపై అధిష్టానం హర్షం వ్యక్తం చేసిందన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అధ్యక్షతన పార్టీ పదాధికారుల సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ నాలుగు స్థానాల్లో విజయం సాధించడంపై అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల తరువాత మొదటిసారి జరిగిన పదాధికారుల సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై అమిత్ షా దిశానిర్దేశం చేశారని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో గెలవడంతో వాటి పరిధుల్లోని 22 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఆధిక్యత ప్రదర్శించగలిగిందని వివరించారు. ఉత్తర తెలంగాణలో పుంజుకున్న పార్టీని దక్షిణ తెలంగాణకు విస్తరిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జూలై 6 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపడతామని, దానికి ముందుగా ఈ నెల 21న రాష్ట్రస్థాయి నేతల సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గల్లంతైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కూడా కనుమరుగవుతుందని అన్నారు. కాంగ్రెస్ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు కూడా ఆ పార్టీలో కొనసాగే పరిస్థితి లేకుండా స్వార్థం కోసం, కాంట్రాక్టుల కోసం టీఆర్ఎస్ జెండా మోస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయశక్తిగా భావించి లోక్‌సభ ఎన్నికల్లో పట్టంకట్టారని అన్నారు.

## బోధనాస్పత్రుల్లో వైద్యుల వయోపరిమితి పెంపు

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని అధ్యాపకులు, అనుబంధ ఆస్పత్రిలోని వైద్యుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రస్తుతం ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వీరికి కూడా 58 ఏళ్లు మాత్రమే వయో పరిమితిగా ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వీరి వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తర్వాత దాని అమలు ఆలస్యం కావడం, ఈలోగా ఎన్నికలకు వెళ్లడంతో వయోపరిమితి పెంపు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని వైద్యులు ఒత్తిడి చేస్తున్నారు. పైగా బోధనాస్పత్రుల్లో ఏటా రిటైరయ్యే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది 57 మంది సీనియర్ అధ్యాపకులు రిటైర్ అవుతున్నారు. మరోవైపు అందుకు తగినట్టుగా భర్తీ జరగకపోవడంతో వైద్య విద్య సంకటంలో పడింది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) తనిఖీలకు వచ్చినపుడు బోధనా సిబ్బంది లేక ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో సీట్లు కోల్పోయిన పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో అధ్యాపకుల వయోపరిమితిని పెంచాలని నిర్ణయం తీసుకున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపాయి.



గురువారం అసెంబ్లీ మీడియా హాల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

## తప్పు చేయకపోతే చర్చకు సిద్ధమా?

- కేసీఆర్‌కు సీఎల్పీ నేత భట్టి సవాల్
- ప్రగతిభవన్‌లో 12 మంది ఎమ్మెల్యేలతో బేరసారాలు వాస్తవం కాదా?

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకున్న విషయంలో సీఎం కేసీఆర్ తప్పు చేయకపోతే తనతో చర్చకు సిద్ధం కావాలని, ఆ చర్చ ఎక్కడ పెట్టినా వస్తానన్నానని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సవాల్ చేశారు. పదో షెడ్యూల్‌లో ఫిరాయింపుల ఉన్న నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్న కేసీఆర్ ప్రగతిభవన్‌లో తమ పార్టీ ఎమ్మెల్యేలతో బేరసారాలు ఆడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై కేసీఆర్ ఎక్కడో దాక్కుని ఇతర నాయకులను మాట్లాడిస్తున్నారని, ఆయన్ను బయటకు ఎలా రప్పించాలో తమకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. గురువారం అసెంబ్లీ మీడియా హాల్‌లో భట్టివిక్రమార్క విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పట్టపగలే ఖూనీ అవుతోందని, ఈ పొలిటికల్ మాఫియాను ఆపకపోతే ప్రజల ఓటుకు విలువ ఉండదని చెప్పారు. భవిష్యత్తులో డబ్బున్న వాళ్లంతా ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేసి సీఎంలు, పీఎంలు అవుతారని, అందుకే తాను ఆమరణదీక్షకు కూర్చున్నానని అన్నారు. తన దీక్షకు మద్దతు ఇచ్చినవారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తన పోరాటం ఆరంభం మాత్రమేనని , రాష్ట్రంలో జరుగుతున్న ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనపై తాను, కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటామని చెప్పారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై త్వరలోనే వివిధ వర్గాల మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్‌కు నాయకత్వం లేదని పార్టీ మారిన ఎమ్మెల్యేలు చెపుతున్నారని, కాంగ్రెస్‌కు ఎన్నికల ముందు, ఆ తర్వాత వారే నాయకులుగా ఉన్నారని, అప్పుడు పార్టీ నుంచి ఎందుకు వెళ్లలేదని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి కోసమే వెళుతున్నామని చెబుతున్నారని, పార్టీ మారకపోతే ఈ ప్రభుత్వ పెద్దలు విపక్ష నేతల నియోజకవర్గాలను అభివృద్ధి చేయరా అని ప్రశ్నించారు. పార్టీ మారిన వారంతా రాజీనామా చేసి దమ్ముంటే మళ్లీ ఎన్నికల్లో గెలవాలని భట్టి సవాల్ విసిరారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి: టీటీజేఏసీ

**సాక్షి, హైదరాబాద్:** దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీటీజేఏసీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని పీఆర్‌టీయూ భవన్‌లో టీటీజేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను వెంటనే రూపొందించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి, ఉప విద్యాధికారి, డైట్ లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తీర్మానించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీలు జనార్దన్ రెడ్డి, రఘోత్తంరెడ్డి , మాజీ ఎమ్మెల్సీ రవీందర్, టీటీజేఏసీ సెక్రటరీ జనరల్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ సమస్యలన్నింటిపై ఉత్తర్వులి చ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతూ విద్యా మంత్రి జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

**టీటీజేఏసీ చైర్మన్‌గా పింగళి శ్రీపాల్‌రెడ్డి**

టీటీజేఏసీ చైర్మన్‌గా పింగళి శ్రీపాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరంగల్ రూరల్ జిల్లాకు చెందిన ఆయన ఇటీవలే పీఆర్‌టీయూ–టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

# ఇన్‌చార్జ్‌లతో ఆర్టీసీ అస్తవ్యస్తం

- పదోన్నతులు, బదిలీలు లేక అంతా గందరగోళం
- ఇరవై కీలక పోస్టులు ఖాళీ
- అసలే గాడితప్పిన ప్రగతి రథం... ఇప్పుడు మరింత అయోమయం

సాక్షి, హైదరాబాద్

**ఆర్టీసీలో ఆయన ఓ ఉన్నతాధికారి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న బస్‌భవన్‌లో ఇన్‌చార్జి ఈడీగా ఉన్నారు. ఆయన అసలు పోస్టు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్. హైదరాబాద్–ఆదిలాబాద్ మధ్య 300 కి.మీ. దూరం ఉంటుంది. ఇంతదూరంలో ఉన్న రెండు ప్రాంతాల్లో ఒకే వ్యక్తి ఎలా పని చేయగలరు. ఇది ఆర్టీసీలో ఉన్న గందరగోళానికి ఓ నిదర్శనం.**

**ఇదే అధికారి ఈనెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు. సీనియారిటీ క్రమంలో ఆయనకు ఈడీ పదోన్నతి రావాలి. కానీ, ఎన్నికల కోడ్ పేరుతో ఇంతకాలం కాలయాపన జరిగింది. కోడ్ ముగిసినా ఇప్పటివరకు పదోన్నతుల ఊసు లేదు. ఇలాగే ఉంటే ఆయన ఈడీగా కాకుండా అంతకంటే ఓ మెట్టు దిగువన ఉండే రీజినల్ మేనేజర్‌గానే పదవీ విరమణ పొందాల్సి ఉంటుంది.**

**ప్రస్తుతం దాదాపు పది ప్రాంతాల్లో పూర్తి స్థాయి ఆర్ఎంలు, డీవీఎంలు లేరు. ఎక్కడెక్కడో ఉన్న వారితో ఇన్‌చార్జులుగా నెట్టుకొస్తున్నారు. ఇంత గందరగోళంగా ఉన్న ఆర్టీసీకి అసలు పూర్తిస్థాయి ఎండీనే లేకపోవటంతో ఈ పదోన్నతులు, బదిలీల గందరగోళం తీవ్రమైంది. మూడు పోస్టులతో సతమతమవుతున్న ఇన్‌చార్జి ఎండీకి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, కీలక అంశాలకు సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేసేవారు కూడా లేకపోవటంతో అంతా అస్తవ్యస్తంగా తయారైంది. అసలే తీవ్ర నష్టాలతో దివాలా దిశలో సాగుతున్న ఆర్టీసీ... గాడిలో పడాల్సింది పోయి ఇలా గందరగోళంతో కుస్తీపడుతోంది.**

### ఆ కమిటీ ఎక్కడుంది?

రాష్ట్ర విభజన జరిగినా ఇప్పటికీ ఆర్టీసీ సాంకేతికంగా రెండు రాష్ట్రాల మధ్య విడిపోలేదు. దీంతో తెలంగాణ ఆర్టీసీకి పాలకమండలి లేదు. కీలక నిర్ణయాలు తీసుకోవాల్సింది పాలకమండలి కావటంతో చాలా పనులు తాత్కాలిక పద్ధతిలో జరుగుతున్నాయి. పదోన్నతుల విషయంలోనూ అదే జరుగుతోంది. దీంతో గత సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రభుత్వం సెలక్షన్, డిసిప్లినరీ కమిటీని నియమించింది. ఆర్టీసీ చైర్మన్, ఆర్టీసీ ఎండీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్, రవాణా శాఖ, ఫైనాన్స్ (ట్రాన్స్‌పోర్టు), కార్మిక శాఖల కార్యదర్శులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సమావేశమై కీలక నిర్ణయాలకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. తెలంగాణ ఏర్పడ్డప్పటి నుంచి ఇది అమలులో ఉంటుంది. అంటే గతేడాది సెప్టెంబర్‌లో ఈ కమిటీ ఏర్పడినందున అంతకుముందు జరిగిన వాటిని రెగ్యులరైజ్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం బస్‌భవన్‌లో పురుషోత్తమనాయక్, వినోద్‌కుమార్‌లు ఈడీలుగా పదోన్నతి పొంది పనిచేస్తున్నారు. వీరిద్దరిని కూడా ఈ కమిటీ రెగ్యులరైజ్ చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు కొత్త పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ రావటంతో గతేడాది చివరి నుంచి పదోన్నతులు ఆగిపోయాయి. పదోన్నతులు లేనందున కొత్త ఖాళీలు ఏర్పడక బదిలీలు కూడా నిలిచిపోయాయి. వాస్తవానికి ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటై ఉన్నందున, ఆ కమిటీ సమావేశమై బదిలీలు, పదోన్నతులపై నిర్ణయం తీసుకుని అత్యవసర పనిగా ఎన్నికల కమిషన్ ముందు ప్రతిపాదిస్తే ఆమోదం లభించే అవకాశం కూడా ఉండేదన్న అభిప్రాయం ఉంది. కానీ, ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు కమిటీ సమావేశమే కాలేదు. ఇప్పుడు ఎన్నికల కోడ్ ముగిసినా ఆ ఊసే లేక పాలన అంతా అస్తవ్యస్తంగా మారింది.



రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం దాదాపు 20 కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సాక్షాత్తూ బస్‌భవన్‌లోనే ముగ్గురు ఈడీలు ఇన్‌చార్జులుగా ఉన్నారు. ఇటీవల ఆర్ఎం స్థాయిలో ఉన్న అధికారులను తాత్కాలిక పద్ధతిలో ఈడీలుగా కూర్చోబెట్టారు. పదోన్నతులు లేనందున వీరు పర్యవేక్షించే రెగ్యులర్ పోస్టుల్లో ఎవరినీ నియమించలేదు. ఈ ముగ్గురు అధికారులకు ఈడీ పదోన్నతి ఇస్తే వారు చూసే రెగ్యులర్ ఆర్ఎం కేడర్ పోస్టులు ఖాళీ అవుతాయి. వాటిని డీవీఎంలతో భర్తీ చేస్తారు. అలా ఖాళీ అయ్యే డీవీఎం పోస్టులను సీనియర్ డీఎంలతో భర్తీ చేస్తారు. వాటిని అసిస్టెంట్ డీఎం పోస్టులతో.. ఇలా కిందిస్థాయి వరకు పోస్టులు భర్తీ అవుతాయి. కానీ ఈ ప్రక్రియ జరగక అధికారుల్లో అయోమయం నెలకొంది. ఇక దాదాపు పది డిపోలకు పూర్తిస్థాయి డిపో మేనేజర్లు లేరు. వాటిని తాత్కాలిక పద్ధతిలో ఇతరులు పర్యవేక్షిస్తున్నారు. ఈ వ్యవహారం ఆర్టీసీ బస్సుల నిర్వహణపై పడుతోంది.

సాధారణంగా రెండుమూడేళ్లు జిల్లాల్లో పనిచేసే పెద్ద అధికారులను ఆ తర్వాత నగరానికి బదిలీ చేస్తారు. కానీ ప్రస్తుతం నాలుగేళ్లు దాటినా తమకు హైదరాబాద్ భాగ్యం దక్కటం లేదని కొందరు అధికారులు వాపోతున్నారు. ఇక పాఠశాలలు తెరిచేలోపే బదిలీలు జరిగితే బాగుండేదని, ఇప్పుడు బడులు తెరిచినందున మధ్యలో ట్రాన్స్‌ఫర్స్ జరిగితే పిల్లల చదువులకూ ఇబ్బందులు ఏర్పడతాయని అధికారులు వాపోతున్నారు. ఈ వ్యవహారం మరోవైపు ఆర్టీసీ అధికారుల సంఘంలోనూ లుకలుకలకు కారణమైంది. బదిలీలు, పదోన్నతుల విషయంలో ఎండీపై ఒత్తిడి చేయటం లేదంటూ బాధ్యులపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంఘానికి ఎన్నికలు నిర్వహించాలంటూ కొందరు డిమాండ్ ప్రారంభించారు. ఇక సందట్లో సడేమియాగా జూనియర్ అధికారులు కొందరు పైరవీలతో పెద్ద పోస్టుల్లో తాత్కాలిక పద్ధతిలో నియామకమయ్యేలా చక్రం తిప్పుతున్నారు.

## పాత చట్టం ప్రకారమే మున్సి'పోల్స్'

### బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

**సాక్షి, హైదరాబాద్:** పాత చట్టం ప్రకారమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సచివాలయంలో జాజుల విలేకరులతో మాట్లాడుతూ.. దీనిపై ఇప్పటికే హైకోర్టులో కేసు వేశామన్నారు. కొత్త మున్సిపాలిటీలకు వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలను ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. జూలై 2న 53 మున్సిపాలిటీల గడువు ముగుస్తుందని, వెంటనే ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని కోరారు. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం జరగకుండా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో సీఎం కేసీఆర్ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## నిరంజన్‌రావు పదవీకాలం పొడిగింపు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల 3వ తేదీతో నిరంజన్‌రావు పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నిరంజన్‌రావు మరో ఏడాది పాటు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. తన పదవీకాలం పొడిగించినందుకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్. చౌహాన్, సీఎం కేసీఆర్‌లకు నిరంజన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

## 'నైపర్'లో రాష్ట్ర విద్యార్థికి ప్రథమ ర్యాంకు

**సాక్షి, హైదరాబాద్:** ఎం.ఫార్మసీలో ప్రవేశాల కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) నిర్వహించిన పరీక్షలో రాష్ట్ర విద్యార్థికి జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు లభించింది. ఈ మేరకు సెయింట్ పాల్స్ కాలేజ్ ఫార్మసీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

## పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌నారాయణ, నరసరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2018లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని, అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్డ్ ఉద్యోగులకూ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు.

## టీఆర్టీ నియామకాలపై మౌనం వీడాలి

### టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్టీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు నిరంతరం ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సరికాదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) అధ్యక్షుడు సీహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమైనా ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని వాపోయారు. కనీసం ఎప్పుడు ఇస్తారో, ఇవ్వకపోవడానికి ఉన్న ఆటంకాలు ఏమిటో అధికారికంగా చెప్పకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేస్తున్న ఉద్యోగాలను కోల్పోయి, ప్రభుత్వ ఉద్యోగం ఎప్పుడొస్తుందో తెలియక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. విద్యామంత్రిని, అధికారులను పదేపదే కలుస్తున్నా పట్టించుకోకపోవడం, అరెస్టులు చేయించడం దారుణమన్నారు.

## సివిల్ సప్లయ్ పనితీరు భేష్

### అభినందించిన బంగ్లాదేశ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ బృందం

**సాక్షి, హైదరాబాద్:** పౌరసరఫరాల శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అమలు తీరుపై అధ్యయనం చేసిన బంగ్లాదేశ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారుల బృందం, ఆ శాఖ పనితీరును అభినందించింది. 37 మందితో కూడిన ఈ అధికారుల బృందం.. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు, వేలిముద్రలతో రేషన్ పంపిణీ (ఈ పాస్ విధానం), ఐరిస్ విధానం, టీ–రేషన్ యాప్, పోర్టబిలిటీ, గోదాముల్లో సీసీ కెమెరాలు, సరుకులు తరలించే వాహనాలకు జీపీఎస్, ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పనితీరును పరిశీలించింది. అలాగే ఆ అధికారులు గురువారం పౌరసరఫరాల భవన్‌లో కమిషనర్ అకున్ సబర్వాల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17,200 రేషన్ షాపుల ద్వారా 2.83 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రతి నెలా కిలో 1 రూపాయి చొప్పున ప్రతి లబ్ధిదారుడికి 6 కిలోల బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఇందుకోసం 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. శాఖలో చేపట్టిన చర్యలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విదేశీ ప్రతినిధులకు వివరించారు.

## బడుల మూసివేతను విరమించుకోవాలి

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని సర్కారు తక్షణమే విరమించుకోవాలని ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. స్కూళ్ల మూసివేత ఆలోచనను ప్రభుత్వం వెంటనే మార్చుకోకపోతే పోరాటాలు చేస్తామని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

## త్వరలో ఏఎఫ్ఆర్సీ చైర్మన్ నియామకం!

### మూడేళ్లకాలానికి ఫీజులను ఖరారుచేసే అవకాశం

**సాక్షి హైదరాబాద్:** ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీకి (ఏఎఫ్ఆర్సీ) చైర్మన్‌ను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రెండు మూడు రోజుల్లోనే చైర్మన్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ వృత్తి సాంకేతిక విద్యా సంస్థల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి వచ్చే మూడేళ్లపాటు అమలు చేయనున్న ఫీజుల ఖరారు కోసం ఏఎఫ్ఆర్సీ తరపున ఉన్నత విద్యా మండలి దరఖాస్తులను స్వీకరించి ప్రాసెస్ చేసింది. దాదాపు 1,350 కాలేజీలు ఫీజుల ఖరారు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అందులో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ తదితర కాలేజీలు ఉన్నాయి. 2016లో నిర్ణయించిన ఫీజులు 2018–19 విద్యా సంవత్సరంతో ముగిశాయి. దీంతో 2019 నుంచి 2022 వరకు ఆయా కాలేజీలు వసూలు చేయాల్సిన ఫీజులను ఏఎఫ్ఆర్సీ ఖరారు చేయాల్సి ఉంది. ఆయా కాలేజీల ఆదాయ వ్యయాలను బట్టి ఏఎఫ్ఆర్సీ చైర్మన్ నేతృత్వంలోని కమిటీ ఫీజులను ఖరారు చేస్తుంది. దీంతో మూడు నెలల కిందటే ఏఎఫ్ఆర్సీ మెంబర్ సెక్రటరీ హోదాలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఫీజుల ఖరారు కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. కాలేజీలు సైతం దరఖాస్తు చేసుకున్నాయి. ఇప్పటికే ఎంసెట్ ర్యాంకులను ప్రకటించిన నేపథ్యంలో చైర్మన్ రాగానే ఫీజులను ఖరారు చేసే అవకాశం ఉంది.

## విత్తులకు పరుగెత్తని రైతన్న

### తొలకరి ఆలస్యంతో వేచిచూసే ధోరణి



**సాక్షి, హైదరాబాద్:** ప్రతిసారీ జూన్ నెల మొదటి వారంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అయితే ఈసారి తొలకరి ఇంకా పలకరించకపోవడంతో విత్తనాలు కొనుగోలు చేసేందుకు అన్నదాతలు ముందుకు రావడం లేదు. ఎరువుల మాట కూడా ఎత్తడం లేదు. ఈ ఖరీఫ్‌లో 7.50 లక్షల క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో జిల్లా, మండల స్థాయిలో 2.44 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచారు. అయితే ఇప్పటివరకు అన్నదాతలు కేవలం 99 వేల క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. గత ఖరీఫ్‌లో మాత్రం 4.08 లక్షల క్వింటాళ్ల విత్తనాలు విక్రయించారు. ఇక ఎరువులది కూడా అదే పరిస్థితి. ఈ ఖరీఫ్‌లో 19.40 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించింది. ఇందులో యూరియా 8.50 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, డీఏపీ 2 లక్షలు, ఎన్‌పీకే 6.60 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయి. ఈ నెల 8వ తేదీ వరకు సరఫరా చేసిన ఎరువులు 2.30 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులోనూ రైతులు రిటైల్‌లో సగం కూడా కొనుగోలు చేసి ఉండరని ఒక వ్యవసాయాధికారి పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కోటి పది లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇందులో ఈసారి పత్తి ప్రధానంగా 50 లక్షల ఎకరాలకు పైగా సాగవుతుందని అంచనా వేస్తుండగా, రెండో స్థానం వరి పంటకు దక్కనుంది. మొక్కజొన్న, కంది సాగు కూడా విపరీతంగా పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. అయితే ఇందుకు సంబంధించిన వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళిక మాత్రం ఇంకా తయారీలోనే ఉంది.

# అడ్డగోలుగా ఆధార్ కేంద్రాలు

- 'ప్రభుత్వ కార్యాలయ ఆవరణ'లో ఏర్పాటు నిబంధనకు నీళ్లు
- రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ సెంటర్లు ప్రైవేటు స్థలాల్లోనే
- జీపీఎస్ లొకేషన్లలో నిర్వహణ తేలినా సర్వీసులను రద్దు చేయని యంత్రాంగం
- ఆధార్ కేంద్రాల్లో నిర్వహణపై నిఘా లేకపోవడంతో వసూళ్లకు పాల్పడుతున్న వైనం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆధార్ నమోదు కేంద్రాలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోనే వాటిని నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఈ నిబంధన ఆచరణలోకి రావడం లేదు. వెరసి ఆధార్ నమోదు కేంద్రాల నిర్వహణ అడ్డదిడ్డంగా మారింది. ఆధార్ నమోదు, మార్పుల విషయంలో అవకతవకలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిర్వహించాలనే నిబంధనను సర్కారు తీసుకొచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలున్న చోట నిర్వహిస్తే అవకతవకలకు పాల్పడినప్పుడు అప్పటికప్పుడు ఫిర్యాదు చేసే వీలుంటుందనే భావనతో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు స్థలాల్లో ఉన్న కేంద్రాలను తక్షణమే ప్రభుత్వ ఆవరణలోకి తరలించాలని సమాచార సాంకేతికశాఖ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే ఈ నిబంధనలు అమల్లోకి తేవాలని స్పష్టం చేసింది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆవరణలోనే ఆధార్ కేంద్రాలను నిర్వహించాలనే నిబంధనను నిర్వాహకులు అటకెక్కించారు. నిర్దేశిత ప్రాంతానికి ఆధార్ కేంద్రాన్ని తరలించాలని జిల్లా కలెక్టర్ల నుంచి సూచనలు అందినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం వాటిని మార్చలేదు. పలు రకాల సాకులను చూపుతూ వాటిని ప్రైవేటు స్థలాల్లోనే నిర్వహిస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వ ఆవరణలో ఆధార్ కేంద్రాన్ని నిర్వహిస్తే నిబంధనల ప్రకారం వ్యవహరించాలనే ఆందోళనతోనే సాకులు వెతుకుతూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 973 ఆధార్ నమోదు కేంద్రాలున్నాయి. ఇందులో మీ–సేవా ఫ్రాంచైజీ (ఈఎస్‌డీ)కి చెందినవి 460 సెంటర్లున్నాయి. ప్రస్తుతమున్న వాటిలో ఈఎస్‌డీ ఎక్కువ భాగం ఉన్నప్పటికీ వాటి నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ కార్యాలయాల్లో లొకేషన్లు సైతం కేటాయించారు. సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) ద్వారా నిర్వహిస్తున్న కేంద్రాలు పూర్తిగా ప్రైవేటు ప్రాంతాల్లోనే నిర్వహిస్తున్నారు.

### లొకేషన్ చూపినా చర్యలు శూన్యం...

**ఆధార్** కేంద్రాలను ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే అంశాన్ని ఆన్‌లైన్ ద్వారా పరిశీలించవచ్చు. ఈ మేరకు సమాచార సాంకేతికశాఖ వద్ద పరిజ్ఞానం ఉంది. ఆధార్ నమోదు సిస్టంను ఆన్ చేసిన వెంటనే అందులో జీపీఎస్ ద్వారా లొకేషన్ కనిపిస్తుంది. నిర్దేశిత లొకేషన్‌లో ఉంటేనే అనుమతి ఇచ్చే అవకాశం ఉన్నతాధికారులకు ఉంది. ప్రైవేటు లొకేషన్ చూపితే వెంటనే సర్వీసును రద్దు చేయొచ్చు. కానీ స్పష్టమైన ఆదేశాలిచ్చిన అధికారులు అమలు తీరును మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ కేంద్రాల నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయిలో జిల్లా మేనేజర్లు (డీఎం) నిఘా, పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల డీఎంలు అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు ప్రాంతాల్లోనే నిర్వహిస్తామంటూ కొందరు ఆధార్ కేంద్రాల నిర్వాహకులు డీఎంల చేతులు తడుపుతున్నారు. దీంతో ఇష్టానుసారంగా కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని సెంటర్లలో ఆధార్ నమోదుకు రూ. 100 నుంచి రూ. 250 వరకు వసూలు చేస్తున్నారు. ఆధార్ వివరాల్లో తప్పుల సవరణ, చిరునామా మార్పులు తదితరాలకు సంబంధించి రూ. 500పైబడి వసూలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదులు సైతం అందుతున్నాయి. కేంద్రాలపై నిఘా లేకపోవడంతో ఈ తంతు సాగుతున్నట్లు తెలుస్తోంది.

# ఇసుక కొరతపై ముందస్తు ప్రణాళిక

**కొత్తగా మరో మూడు రీచ్‌లను తెరిచేందుకు టీఎస్ఎండీసీ సన్నాహాలు**

**సాక్షి, హైదరాబాద్:** వర్షాకాలంలో ఇసుక కొరత తలెత్తకుండా ఉండేందుకు తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆఫ్ సీజన్‌లో ఇసుక ధరలను నియంత్రించడంతోపాటు, భవన నిర్మాణ రంగం అవసరాలకు కొరత లేకుండా సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రవాణాలో ఇబ్బందులు తలెత్తకుండా స్టాక్ పాయింట్లతో పాటు, సబ్ స్టాక్ పాయింట్లలోనూ ఇసుకను నిలువ చేయాలని టీఎస్ఎండీసీ నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 30 రీచ్‌ల ద్వారా ఇసుకను వెలికితీసి, ఆన్‌లైన్ విధానంలో విక్రయిస్తున్నారు. ఇసుకను విక్రయించేందుకు రీచ్‌ల సమీపంలో 30 స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి.. ఆన్‌లైన్ విధానంలో డబ్బులు చెల్లించిన వారికి సరఫరా చేస్తున్నారు. ఇసుక డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్తగా మరో మూడు రీచ్‌లను తెరిచేందుకు టీఎస్ఎండీసీ సన్నాహాలు చేస్తోంది. గోదావరిపై ఖమ్మం జిల్లా పోలంపల్లి, మానేరు నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి, తుమ్మిళ్ల వద్ద తుంగభద్ర నుంచి ఇసుకను వెలికితీసేందుకు త్వరలో కొత్త రీచ్‌లు ఏర్పాటు చేయాలని టీఎస్ఎండీసీ నిర్ణయించింది. ప్రస్తుతం 30 రీచ్‌ల నుంచి వెలికి తీస్తున్నా.. ఇందులో 27 రీచ్‌లు జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల పరిధిలోనే ఉన్నాయి.

**పెరుగుతున్న డిమాండ్**

ప్రస్తుతం టీఎస్ఎండీసీ ద్వారా రోజుకు 53వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను వెలికి తీసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. గత ఏడాది జూన్‌లో 30వేల క్యూబిక్ మీటర్ల మేర డిమాండ్ ఉండగా, ప్రస్తుతం సుమారు రెట్టింపు ఉన్నట్లు టీఎస్ఎండీసీ వర్గాలు వెల్లడించాయి. వర్షాకాలం సమీపిస్తుండటంతో ఇసుక కొరతను దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణదారులు ముందు జాగ్రత్తగా పెద్ద మొత్తంలో నిలువ చేస్తుండటంతో డిమాండ్ పెరుగుతోంది. టన్ను ఇసుకను టీఎస్ఎండీసీ రూ.600 చొప్పున ఆన్‌లైన్ విధానంలో విక్రయిస్తోంది. అయితే రవాణా, ఇతర చార్జీలు కలుపుకుని బహిరంగ మార్కెట్‌లో రూ.1,250 నుంచి రూ.1,500 వరకు ధర పలుకుతోంది. వర్షాకాలం ఆరంభం అవుతుండటంతో రీచ్‌ల వద్ద ఇసుక వెలికితీత మొదలుకుని, స్టాక్ పాయింట్ల నుంచి రవాణా వరకు అనేక అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది. దీనిని అవకాశంగా తీసుకుని దళారీలు బహిరంగ మార్కెట్‌లో రేటు అమాంతం పెంచేస్తుండటంతో వినియోగదారులపై భారం పెరగనుంది.

**60 లక్షల క్యూబిక్ మీటర్ల నిలువ**

వర్షాకాలంలో ఎదురయ్యే ఇసుక కొరతను తీర్చేందుకు టీఎస్ఎండీసీ ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. స్టాక్ పాయింట్ల వద్ద ఇప్పటివరకు 60లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను నిలువ చేసిన టీఎస్ఎండీసీ.. మరో 40లక్షల క్యూబిక్ మీటర్లు నిలువ చేసేలా ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం జంటనగరాల పరిధిలోనే ఇసుక వినియోగం ఎక్కువగా ఉండటంతో.. సబ్ స్టాక్ పాయింట్ల వద్ద నిల్వలు పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో అబ్దుల్లాపూర్‌మెట్‌తో పాటు మరో రెండు చోట్ల సబ్ స్టాక్ పాయింట్లను నిర్వహిస్తున్నారు. తాజాగా మహబూబ్‌నగర్ నుంచి రవాణా అవుతున్న ఇసుకను కొంత మేర కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టాక్ పాయింట్ ద్వారా విక్రయిస్తున్నారు. ఇసుక డిమాండ్ పెరిగే పక్షంలో స్టాక్ పాయింట్లతో పాటు, సబ్ స్టాక్ పాయింట్లలోనూ నిల్వలు పెంచేలా టీఎస్ఎండీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.



సాక్షి

శుక్రవారం, జూన్, 14

# అట్టుడుకుతున్న హాంకాంగ్

ఒప్పందంలో ఇచ్చిన హామీలను నీరుగార్చాలని చూసిన చైనా ఎత్తుగడలకు వ్యతిరేకంగా ఇప్పుడు హాంకాంగ్ భగ్గుమంటోంది. తమ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలపై ఉక్కుపాదం మోపాలనుకుంటున్న చైనా నాయకత్వాన్ని హాంకాంగ్ పౌరులు నిలదీస్తున్నారు. వారంరోజులుగా ఆ నగరం నిరసనలతో హోరెత్తుతోంది. హాంకాంగ్‌లో నేరాలకు పాల్పడే వారిని చైనాకు అప్పగించడానికుద్దేశించిన నేరస్తుల అప్పగింత చట్టం సవరణ బిల్లు ఈ ఆగ్రహావేశాలన్నిటికీ మూలం. బ్రిటన్‌కున్న లీజు ముగిశాక 1997 జూలై 1న హాంకాంగ్ మళ్లీ చైనాకు వశమైంది. ఈ విలీనం కావడం తమకు సమ్మతం కాదని స్వతంత్ర నగర రాజ్యంగా ఉంటామని ఆనాడు అక్కడివారు పట్టుబట్టారు. అయితే హాంకాంగ్ ప్రజాస్వామ్య వ్యవస్థ యధాతథంగా ఉంటుందని చైనా నేతలు హామీ ఇచ్చారు. వారికి సార్వత్రిక ఓటు హక్కు కల్పిస్తామని చెప్పారు. తమ నాయకుడు డెంగ్ జియావో పెంగ్ అంతకు కొన్నేళ్లక్రితం హాంకాంగ్ చైనా పరిధిలోకొస్తే 'ఒక దేశం–రెండు వ్యవస్థలు' విధానాన్ని పాటిస్తామని హామీ ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. చైనా విధానాలేవీ హాంకాంగ్‌ను తాకబోవని చెప్పారు. అది పూర్తి స్థాయిలో తమ నియంత్రణలోకొచ్చేవరకూ... అంటే 2047 వరకూ నగర స్వయంపాలనే ఉంటుందని వాగ్దానం చేశారు. 1997లో నేరస్తుల అప్పగింత ఒప్పందం ఖరారైనప్పుడు చైనా, తైవాన్‌లను అందులో చేర్చలేదు. హాంకాంగ్ అనుసరిస్తున్న ప్రమాణాలకు ఆ రెండుచోట్లా అమలవుతున్న నేర న్యాయవ్యవస్థ విరుద్ధం గనుక ఆ నిర్ణయం తీసుకున్నారు. అందుకు చైనా కూడా అంగీకరించింది. కానీ హాంకాంగ్‌కు ఇచ్చిన ఇతర హామీల్లాగే దీన్ని కూడా నీరు కార్చాలని చైనా ప్రయత్నిస్తోంది. తన అభిప్రాయాలకు భిన్నంగా మాట్లాడేవారిని అది ఇప్పటికే శత్రువులుగా పరిగణిస్తోంది. రకరకాల సాకులతో అపహరించడం కూడా రివాజే. ఇప్పుడు నేరస్తుల అప్పగింత చట్టానికి తీసుకురాదల్చిన సవరణ బిల్లుకు ఆమోదం లభిస్తే అటువంటి వారందరినీ చైనాకు 'చట్టబద్ధంగా' తరలించి అక్కడి చట్టాల కింద విచారించి దశాబ్దాలపాటు ఖైదు చేయడమో, మరణశిక్ష వంటివి విధించడమో చేసే ప్రమాదం ఉన్నదని ఉద్యమకారులు ఆందోళనపడుతున్నారు. అయితే ఇవన్నీ ఉత్త అనుమానాలేనని నగర చీఫ్ ఎగ్జిక్యూటివ్ కారీ లామ్ చెబుతున్నారు. ఎవరినైనా నేరుగా చైనాకు అప్పగించడం ఉండదని, ప్రతి కేసునూ పరిశీలించి అవసరాన్నిబట్టి నిర్ణయం తీసుకుంటామని ఆమె అంటున్నారు. కానీ దీనికొక మెలిక ఉంది. తాజా సవరణలు గత కాలంనుంచి అమల్లోకొచ్చేవిధంగా రూపొందించారు. సారాంశంలో బిల్లు ఆమోదం పొందగానే పాత కేసుల్ని తవ్వి తీసి, వాటిల్లో నిందితులుగా ఉన్నవారిని చైనాకు అప్పగించే అవకాశం లేకపోలేదు.

వాస్తవానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ వ్యవస్థే పెద్ద ప్రహసనంలా నడుస్తోంది. స్వయంపాలన అమలు చేస్తామని, నగర నిర్వహణ చూసే చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ను ప్రజలే ఎన్నుకోవచ్చునని 1997లో చైనా హామీ ఇచ్చింది. అది 2017 నుంచి అమలు చేస్తామని చెప్పింది. అంతవరకూ పాలనా వ్యవహారాలు సాఫీగా సాగడానికి భిన్న రంగాలనుంచి కొందరు వ్యక్తుల్ని తానే ఎంపిక చేసి ఒక కమిటీని ఏర్పరిచింది. ఆ కమిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ను ఎన్నుకునే విధానాన్ని ఏర్పరిచింది. కానీ 2017 నుంచి అమల్లోకి రావాల్సిన ఎన్నికల విధానాన్ని చైనా నీరుగార్చింది. ఇప్పటికీ చైనా అనుకూలురదే నగర నిర్వహణ వ్యవస్థలో మెజారిటీ. వారిద్వారా ఎన్నికైన కారీ లామ్ ఆచరణలో చైనా ప్రతినిధిగానే వ్యవహరిస్తున్నారు. 2017లో చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు స్వీకరించాక పాలనావ్యవస్థలోని చైనా వ్యతిరేకుల్ని అనర్హులుగా ప్రకటించారు. ఉద్యమకారులు ఎన్నికల్లో పాల్గొనడాన్ని నిషేధించారు. వారిని అరెస్టు చేయించారు. ఇవన్నీ చైనా మెప్పు పొందడానికి ఆమె తీసుకున్న చర్యలే. మరోపక్క చైనా వ్యతిరేకులుగా ముద్రపడినవారిని ఆ దేశం అపహరిస్తుంటే ఆమె నోరు మెదపలేదు. ఉద్యమకారుల ఒత్తిళ్లకు తలొగ్గి ఇప్పటికైతే సవరణ బిల్లుపై జరిగే చర్చను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ ఉద్యమం మరికొన్నాళ్లకు చల్లారక తప్పదన్న అభిప్రాయంతో చైనా ఉంది. సరిగ్గా ఆ కారణం వల్లే ఉద్యమాన్ని దీర్ఘకాలం కొనసాగించాలని ఉద్యమకారులు నిర్ణయించుకున్నారు.

తాజా సవరణలు అమల్లోకొస్తే అక్కడుండే తమ పౌరుల పరిస్థితి ఏమిటన్న ఆందోళన అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఉంది. అమెరికాకు చెందిన 1,300 సంస్థలు అక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆ దేశ పౌరులు 85,000మంది వ్యాపారం, ఇతర రంగాల్లో పని చేస్తున్నారు. అలాగే ఆస్ట్రేలియా పౌరులు లక్షమంది, బ్రిటన్‌కు చెందిన 50,000మంది అక్కడుంటున్నారు. కొత్త చట్టం అమలైతే వీరందరూ చైనా ప్రభుత్వం నుంచి వేధింపులు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదని ఆ దేశాల భావన. బ్రిటన్ వలసగా ఉన్నప్పుడు హాంకాంగ్‌లో ఉదారవాద ప్రజాస్వామ్యం అమలయ్యేది. భావప్రకటనా స్వేచ్ఛ ఉండేది. కానీ ఆ నగరం చైనా ఛత్రఛాయలోకి వచ్చాక భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే మీడియా సంస్థలపై నిఘా మొదలైంది. అప్రకటిత సెన్సార్‌షిప్ అమలు ప్రారంభమైంది. కొన్ని చానెళ్ల లైసెన్స్‌ల గడువు తీరాక వాటిని పునరుద్ధరించడాన్ని నిలిపేశారు. గతంతో పోలిస్తే హాంకాంగ్ ఆర్థిక వ్యవస్థ కూడా అంతంతమాత్రమే. 1997నాటికి చైనా స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో హాంకాంగ్ వాటా 16 శాతం. ఇప్పుడది కేవలం 2 శాతం మాత్రమే. అయితే చైనా ఆర్థిక వ్యవస్థ పటిష్టతకూ, ఎదుగుదలకూ హాంకాంగ్ ఇప్పటికీ తోడ్పడుతోంది. దాన్ని పరిగణనలోకి తీసుకుని కనీసం హామీ ఇచ్చినవిధంగా హాంకాంగ్‌లో యథాతథ స్థితిని కొనసాగించాలని కూడా చైనా భావించడం లేదు. హాంకాంగ్ పౌరుల నిరసనోద్యమ ఉధృతిని గమనించి ఇప్పటికైనా అది తన వైఖరిని మార్చుకోవాలి. తియనాన్మెన్ స్క్వేర్‌లో 1989లో వందల మందిని ఊచకోత కోసి ప్రజాస్వామ్య ఉద్యమాన్ని అణిచిన తీరులోనే ఇప్పుడూ వ్యవహరిద్దామనుకుంటే ప్రపంచం ముందు దోషిగా నిలబడవలసి వస్తుందని అది గుర్తించాలి.

# హక్కులు దక్కితేనే రైతుకు రక్ష!


దిలీప్ రెడ్డి

**ఎంత చేసినా వ్యవసాయం వాణిజ్య వ్యాపకంగా మనలేని గడ్డు స్థితులు నేడు దేశవ్యాప్తంగా నెలకొన్నాయి. వ్యవసాయాన్ని గౌరవప్రదమైన వృత్తిగా బతకనీయాలంటే రైతుకు పనికొచ్చే సహాయక చర్యలు ఇంకా పెంచాలి. వాటికో చట్టబద్ధత తీసుకురావాలి. కేంద్రంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు రైతుకు పెట్టుబడి ఆర్థిక సహాయం చేస్తున్నాయి. ఇది ఇటీవలి కాలంలో వ్యవసాయ రంగంలో వచ్చిన ఆహ్వానించదగ్గ పరిణామం! అయితే, ఇది మాత్రమే సరిపోదు. సమాచార హక్కు కమిషన్ తరహాలో కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో 'వ్యవసాయ కమిషన్లు' ఏర్పాటు కావాలి. స్వతంత్ర ప్రతిపత్తితో, చట్టబద్ధమైన అధికారాలతో పనిచేసే ఈ కమిషన్లకు గట్టి అధినేతలు రావాలి. అలాగే రైతుకు సాంప్రదాయికంగా ఉంటున్న విత్తన హక్కును కాపాడటం, ఎమ్మెన్సీల దాష్టీకం నుంచి వారిని బయటపడేయటం కూడా చాలా ముఖ్యం.**

## సమకాలీనం

ఇప్పుడు సాయం అవసరమైన స్థితిలో వ్యవసాయం ఉంది. ఒకేరకమైన సహాయంతో తీరేది కాదు. అనేక రకాల సహాయాలు అందితేనే వ్యవసాయం బతికి బట్టకడుతుంది. 'అజాత శత్రువే అలిగిన నాడు...' అన్నట్టు, రైతన్నకు కోపమొచ్చి 'నా తిండికి సరిపడా నే పండించుకు తింటాను, మిగతా భూమి పడావ్ (పంట విరామం) వేస్తా, ఏం చేసుకుంటారో చేసుకోండి..!' అని ఆగ్రహిస్తే దేశం మలమల మాడాల్సి వస్తుంది. ఆ చేదు అనుభవాన్నీ తెలుగునేల ఎప్పుడో చవి చూపింది. ఎంత చేసినా వ్యవసాయం వాణిజ్య వ్యాపకంగా మనలేని గడ్డు స్థితులు నేడు దేశవ్యాప్తంగా నెలకొన్నాయి. మనది, కార్పొరేట్ వ్యవసాయం సాధ్యపడని చిన్న కమతాల దేశం. అందుకే, ఉన్నంతలో... పెట్టుబడి నుంచి గిట్టుబాటు ధర వరకు అన్ని దశల్లో రైతు బాగోగులు చూసి ఆదుకుంటేనే వ్యవసాయం. ఈ ఎరుకతోనే ప్రభుత్వాలు రైతుకు అంతో ఇంతో సహాయం చేయడానికి, చేసినట్టు కనబడటానికి ప్రయత్నిస్తాయి. కానీ, నిజంగా ఆదుకొని వ్యవసాయాన్ని గౌరవప్రదమైన వృత్తిగా బతకనీయాలంటే రైతుకు పనికొచ్చే సహాయక చర్యలు ఇంకా పెంచాలి. వాటికో చట్టబద్ధత తీసుకురావాలి. వ్యవసాయ విధానాలు, చట్టాలు, నిబంధనలు, విధివిధానాల అమలుపై సరైన నిఘా, నియంత్రణ ఉండాలి. ఇందుకు ప్రభుత్వాలు మరింత చొరవ చూపాలి. వృత్తికి భరోసా ఇవ్వాలి. బతుక్కి భద్రత కల్పించాలి. కష్టాల్లో రైతాంగాన్ని ఆదుకోవాలి. కేంద్రంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు రైతుకు పెట్టుబడి ఆర్థిక సహాయం చేస్తున్నాయి. ఇది ఇటీవలి కాలంలో వ్యవసాయ రంగంలో వచ్చిన ఆహ్వానించదగ్గ పరిణామం! అయితే, ఇది మాత్రమే సరిపోదు. నిన్నటికి నిన్న గుజరాత్‌లో బంగాళదుంప రైతాంగానికి, పెప్సీ కంపెనీకి మధ్య జరిగిన న్యాయపోరాటం, రైతుకు కావాల్సిన ఇతరేతర భద్రతాచర్యల అవసరాన్ని నొక్కి చెప్పింది. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో 'వ్యవసాయ కమిషన్లు' ఏర్పాటు కావాలి. స్వతంత్ర ప్రతిపత్తితో, చట్టబద్ధమైన అధికారాలతో పనిచేసే ఈ కమిషన్లకు గట్టి అధినేతలు రావాలి. ప్రభుత్వాల తాబేదారులుగా ఉండే 'జీ హుజూర్'లు కాకుండా కాసింత వెన్నెముక ఉన్న అధిపతులు వస్తేనే, దేశపు వెన్నెముక అయిన రైతుకు రక్ష. ఈ విషయంలో 'మేం వ్యవసాయ కమిషన్' ఏర్పాటు చేయబోతున్నాం అని ప్రకటించి ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక అడుగు ముందుకు వేశారు. వివిధ రాష్ట్రాల నుంచి ఆ దిశలో సాగే మరిన్ని అడుగులు ఢిల్లీ పీఠం వరకూ సాగాలి.

### పెట్టుబడి చేయూత గొప్ప సాయమే!

రెండు తెలుగు రాష్ట్రాల నేతలు తెగువతో రైతుకు పెట్టుబడి నగదు సహాయం ప్రకటించి, అమలు పరచి అఖిల భారత నాయకత్వానికి దారి చూపుతున్నారు. తెలంగాణలో కే. చంద్రశేఖరరావు ముఖ్యమంత్రిగా వరంగల్ సభలో, ఏపీలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాక ముందే గుంటూరు పార్టీ ప్లీనరీలో ఈ పెట్టుబడి సహాయం గురించి తొలుత ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం 'రైతు బంధు' పేరిట ఏటా ఎకరాకి ఎనిమిది వేల రూపాయలు రెండు విడతల్లో (నాలుగేసి వేలుగా) గత సంవత్సరమే ఇచ్చింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని పదివేల రూపాయలకు పెంచి ఇస్తున్నారు. ఏపీలోనూ 'రైతు భరోసా'కింద కుటుంబానికి ఏటా రూ. 12,500 చొప్పున నాలుగేళ్ల పాటు ఇవ్వాలన్నది పథకం. వచ్చే ఖరీఫ్ నుంచి ప్రారంభమౌతుందని ముందు ప్రకటించినా, రైతులకు వీలయినంత తొందరగా మేలు కల్పించాలని ప్రస్తుత రబీ నుంచే, అంటే అక్టోబర్ 15 నుంచి ఇవ్వనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణలో 54.50 లక్షలు, ఏపీలో ఉజ్జాయింపుగా 56 లక్షలు, మొత్తంగా కోటి కుటుంబాలకు పైగా ఈ ప్రత్యక్ష ప్రయోజనం పొందుతున్నాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలకు ముందరి బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైతు కుటుంబాలకు ఏటా ఆరేసి వేల రూపాయల చొప్పున నగదు సహాయాన్ని ప్రకటించింది. అయిదెకరాల లోపు భూమి ఉన్న రైతులకే అని ముందు ప్రకటించినప్పటికీ, సదరు పరిమితి లేకుండా ఇవ్వడానికి సిద్ధపడింది. ఊబిలో పీకల్లోతుకు కూరుకొనిపోయి ఉన్న రైతాంగాన్ని, పెట్టుబడి సాయమొక్కటే గట్టెక్కించకపోవచ్చు! కానీ, వ్యవసాయ సీజన్ మొదలయ్యేటప్పుడు ఖాళీ చేతులతో ఉండే సగటు రైతుకు ఈ నగదు సహాయం ఓ వరం, ఎంతో భరోసా! కౌలు రైతులకు ఈ సహాయం అందటం లేదన్నదే, వ్యవసాయ రంగం శ్రేయోభిలాషుల మనసును కలచివేసే బాధ!

### రైతు హక్కులకు రక్షణ ఏది?

తగిన చట్టాలు లేక కొంత, ఉన్నపుడు కూడా వాటి అమలు సవ్యంగా లేక మరికొంత... వ్యవసాయ రంగం, తద్వారా దేశమే స్థూలంగా నష్టపోతోంది. ఫలితంగా రాజ్యాంగ, చట్ట బద్ధమైన హక్కులు రైతుకు దక్కని పరిస్థితి. బాధ్యతగా ఉండే ప్రభుత్వాలకు కొంత చొరవ ఉన్నచోట సరే! కానీ, అటువంటి చొరవ కొరవడిన చోట రైతుకు ఏ సహాయమూ లభించటం లేదు. భూ యాజమాన్య హక్కుల నుంచి రైతుకు అన్నీ సమస్యలే! పట్టాదారు పాసు పుస్తకాలు పొందడమూ గగనమే! రైతుకు దన్నుగా ఉండే సహజవనరుల్ని కార్పొరేట్లు, పలుకుబడి కల్గిన వారు స్వార్థంతో కొల్లగొడుతున్నారు. నాణ్యమైన విత్తనం లభించదు. బ్యాంకు రుణాలు, ఎరువులు, సరైన క్రిమిసంహారకాలు... ఏది పొందడమైనా రైతాంగానికి ఓ పోరాటమే. అతివృష్టి–అనావృష్టి వంటి ప్రకృతి వైపరిత్యాల నష్టపరిహారాల నుంచి పంట బీమా వర్తించి లబ్ధి దొరకటం వరకు... ప్రతిదీ జీవన్మరణ సమస్య. పంట పండి చేతికి అందడం ఒక ఎత్తయితే, చేతికందిన పంటకు ధర, మార్కెట్, నిలువ వసతి లభించడం అంతే సవాల్‌గా పరిణమిస్తోంది. ప్రభుత్వ పరంగా కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) ప్రకటిస్తారు తప్ప అది ఖచ్చితంగా రైతుకు లభించేలా చూడరు. ఒకోసారి, ఉత్పత్తి అంతా రైతు చెయ్యిదాటి దళారుల వశమయ్యాక ఎమ్మెస్పీతో కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వాలు అప్రమత్తమవుతాయి. ప్రత్యేక చర్యలు తీసుకుంటాయి. అది ఎవరి ప్రయోజనాల కోసమో ఇట్టే అర్థమవుతుంది. పంటకు ఆశించిన ధర లభించనపుడు, నేరుగానో, ఇతరేతరంగానో నిలువ చేద్దామన్నా తగినన్ని గిడ్డంగులుండవు. వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఉత్పత్తి కేంద్రాలు కూడా ఉండవు. ప్రయివేటు, ప్రభుత్వ రంగంలో సదరు పరిశ్రమల్ని ప్రోత్సహించకపోవడం రైతుకు శాపంగా తయారవుతోంది. వీటన్నిటినీ అధిగమించడానికి కేంద్ర, రాష్ట్రాల స్థాయిల్లో చట్టబద్ధమైన 'వ్యవసాయ కమిషన్లు' ఏర్పడవలసిన అవసరం ఉంది.

### విత్తనంపై ఎమ్మెన్సీల పెత్తనం

వేల సంవత్సరాల నుంచి మన దేశంలో ఓ గొప్ప సంప్రదాయంగా వస్తున్న రైతాంగం విత్తన హక్కు క్రమంగా హరించుకుపోతోంది. ఇప్పుడది తీవ్ర ప్రమాదంలో పడింది. పాతిక, ఇరవై సంవత్సరాల కిందటి దాకా కూడా, వీసమెత్తు భంగం లేకుండా రైతు అనుభవించిన అప్రతిహతమైన హక్కు ఇది. గత దశాబ్ద కాలంలో పరిస్థితులు చాలా మారాయి. విత్తన స్వేచ్ఛ, హక్కు నుంచి రైతును మెలమెల్లగా దూరం చేసే అంతర్జాతీయ కుట్ర యధేచ్ఛగా సాగుతోంది. ఇది పరోక్షంగా దేశ సార్వభౌమాధికారంపైనే దాడి. చట్టాల్లో తగు రక్షణ కల్పించినప్పటికీ వాటికి వక్ర భాష్యాలెక్కువయ్యాయి. విధాన పరంగా ప్రభుత్వాలు, సాంకేతికాంశాల వల్ల అక్కడక్కడ న్యాయస్థానాలు కూడా రైతును కాదని కార్పొరేట్లు, బహుళజాతి కంపెనీ (ఎమ్మెన్సీ)ల వైపే మొగ్గుతున్నాయి. పేటెంట్ చట్టాలు, మేథోసంపత్తి హక్కులు, ట్రిప్స్–డబ్లుటీవో ఒప్పందాల నీడలో ఈ ఎమ్మెన్సీలు పెత్రేగిపోతున్నాయి. మోన్‌సాంటో, పెప్సీ, బేయర్... వంటి బడా కంపెనీల అకృత్యాలు, ఆధిపత్య ధోరణులు పెచ్చుమీరాయి. గుజరాత్‌లో బంగాళదుంప రైతులపై పెప్సీ కంపెనీ దావా వేయడం ఈ దాష్టీకాల్లో భాగమే! పెద్ద ఎత్తున 'ఆలు చిప్స్' తయారీకి స్థానికంగా రైతులతో ఒప్పందం కుదుర్చుకొని పండిస్తున్న 'ఎఫ్.ఎల్ 2027' రకం బంగాళదుంపపై తనకు పేటెంట్ హక్కులు న్నాయనేది వాదన. తన అనుమతి లేకుండా నలుగురు రైతులు ఆ రకం పంట పండించి, అమ్ముకుంటున్నారనేది పెప్సీ కంపెనీ అభియోగం. అంతకు ముందు అయిదుగురిపైన ఇవే రకం ఆరోపణలు. ఒక్కో రైతు కోటి రూపాయల పైన నష్టపరిహారం చెల్లించాలని దావా! స్థానిక రైతులు, రైతాంగ సంఘాల వారు, మేథావులు అహ్మదాబాద్‌లో సమావేశమై ప్రతిఘటించారు. దావా వేయడానికి పెప్సీ కంపెనీ, 'ప్లాంట్ రకాలు, రైతుల హక్కుల (పిపివి అండ్ ఎఫ్ ఆర్) చట్టం–2001' లోని సెక్షన్ 64ని ఉటంకిస్తే, రైతులు అదే చట్టంలోని సెక్షన్ 39ని వాడుకున్నారు. 'తమ వ్యవసాయ ఉత్పత్తికి విత్తనాలను దాచుకోవడం, వాడడం, విత్తనాలను నాటడం, తిరిగి నాటడం, మార్చుకోవడం, పంచుకోవడం లేదా విక్రయించుకోవడం....' వంటి రైతు హక్కుల్ని చట్టంలోని ఈ సెక్షన్ రక్షిస్తుంది. అయితే, ఈ చట్టం కింద 'బ్రాండెడ్ సీడ్'ను విక్రయించ కూడదు. రైతు పోరాటం ఫలితంగా పెప్సీ కంపెనీ తన కేసుల్ని ఉపసంహరించుకోవడం ఒక రకంగా రైతాంగ విజయమే! అన్ని చోట్ల, అన్ని సార్లూ ఇది సాధ్యపడకపోవచ్చు. అందుకే, న్యాయాధికారాలతో కూడిన ఓ చట్టబద్ధ కమిషన్ అవసరం.

### ముసాయిదా సిద్ధంగానే ఉంది

తమ హక్కులకు భంగం కలిగిన ప్రతి సందర్భంలోనూ రైతులు ఈ కమిషన్‌ను సంప్రదించవచ్చు. మానవహక్కుల సంఘం, సమాచార హక్కు కమిషన్ తరహాలో వ్యవసాయానికి కేంద్ర, రాష్ట్ర కమిషన్లను ఏర్పాటు చేసుకోవాలి. వ్యవసాయానికి సంబంధించిన అన్ని చట్టాల అమలును పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు ఈ కమిషన్‌లు వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన సిఫారసులు చేస్తాయి. రైతుకు నష్టం జరిగినపుడు బాధ్యులపై చర్యలు పుర మాయిస్తూనే, రైతుకు సత్వర న్యాయం జరిగేలా ప్రభుత్వాలకు తగు ఆదేశాలిస్తాయి. వ్యవసాయానికి జరిగిన, జరుగుతున్న, జరుగబోయే నష్టాల్ని కూడా కమిషన్ నివారించగలుగుతుంది. కమిషన్ పరిధి, అధికారాలు, పనితీరు, విధి–విధానాలకు సంబంధించిన అంశాలతో ముసాయిదా ఎప్పుడో సిద్ధమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ దీన్ని లోతుగా పరిశీలన చేసింది. ఇలాంటి విషయాల్లో 'ముసాయిదా' కన్నా 'సంకల్పం' (విల్ రాదర్ దెన్ బిల్) ముఖ్యం.

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### టూరిజం



"రాహుల్ గాంధీకి లండన్ నుంచి సెలవులు ప్రారంభమయ్యాయి. అప్పుడు, ఇప్పుడు, ఎప్పటికీ రాహుల్ గాంధీయే కాంగ్రెస్ అధినేత అని సుర్జీవాలా ఎందుకు చెబుతారు. ప్రధాని మోదీ రోజుకు 18 గంటలు పని చేస్తారు. ఒక్కసారి కూడా సెలవు తీసుకోలేదు. అమిత్ షా నిరంతరం పని చేస్తూనే ఉంటారు. ఆయనకీ ఎప్పుడు సెలవు తీసుకోవాల్సిన అవసరం రాలేదు. రాహుల్ భారత పర్యాటక రంగాన్ని ప్రమోట్ చేస్తే బావుంటుందేమో?"

– ప్రత్యూష్ కాంత్, బీజేపీ నేత

### రాయి



"ముంబైలోని చాలా మందికి కూడా ఈ బండరాయి 66 మిలియన్ ఏళ్లక్రితందన్న సంగతి తెలియదు. అదే యూరప్‌లో అయితే, దీన్ని ప్రపంచ వారసత్వ స్థలంగా మార్చేసేవారు. దగ్గర్లోనే ఒక మ్యూజియం పెట్టి, ఆ రాయి ఫొటోతో కీ చెయిన్‌లు, టీషర్ట్‌లు అమ్మేవారు. వేలాది మంది పర్యాటకులు వచ్చి చూసేవారు"

– సిద్ధార్థ్ సింగ్, రచయిత

### చెత్త



"నిన్న నేను రెండు పిజ్జాలు ఆర్డర్ చేశా. నాకొకటి, 'ఇంకోటి నీ కోసమే..' అని ఆ బాయ్‌కి నేను పిజ్జా ఇస్తున్నప్పుడు అతడు చూసిన చూపు వెలకట్టలేనిది. కానీ, అతడు తిరిగి ఇచ్చేస్తూ 'ఈ చెత్త మీరే తినండి. నేను ఇంటికెళ్లి అన్నం తింటా..' అన్నప్పుడు నా ముఖంలో కనిపించిన భావం కూడా వెలకట్టలేనిదే"

– డాక్టర్ తాహిర్ జైది, నేత్ర వైద్యుడు

### నాన్న



"నాన్న గిరీష్ కర్నాడ్ ఫొటో చూస్తుంటే నాలో ఎన్నో జ్ఞాపకాలు మెదులుతున్నాయి. సోఫాలో తన స్థానంలో కూర్చుని ఉండేవారు. చేతిలో విస్కీ గ్లాసు. చరిత్ర, పాటలు, జానపద కథలు, తత్వశాస్త్రం అన్నిటి గురించీ అనేక విషయాలు నెమ్మదిగా మాట్లాడేవారు. చర్చించేవారు. ఆ జ్ఞాపకాలే నా స్మృతిపథంలో నిలిచిపోయాయి"

– రఘు కర్నాడ్, జర్నలిస్ట్

### లాటరీ



"ఈ ఏడాది క్రికెట్ వరల్డ్ కప్ లాటరీగా మారింది. ఒక జట్టు మరో బలమైన జట్టుతో మ్యాచ్‌ను కోల్పోతే, మరో జట్టు బలహీనమైన జట్టుతో మ్యాచ్‌ను కోల్పోతోంది. దీంతో ఒక జట్టుకు తమది కాని పాయింట్ లభిస్తుండగా, మరో జట్టు రావాల్సిన పాయింట్ కోల్పోతోంది. మరికొన్ని మ్యాచ్‌లు ఇలాగే వర్షం కారణంగా రద్దయితే, ఇక ఎవరూ వరల్డ్ కప్ చూడాలని అనుకోరు"

– సుమంత్ రామన్, యాంకర్

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి శు.ద్వాదశి ప.3.54 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం స్వాతి ఉ.11.08 వరకు, తదుపరి విశాఖ వర్జ్యం సా.4.36 నుంచి 6.10 వరకు, దుర్ముహూర్తం ఉ.8.04 నుంచి 8.56 వరకు, తదుపరి ప.12.37 నుంచి 1.28 వరకు అమృతఘడియలు... రా.2.01 నుంచి 3.33 వరకు.

**సూర్యోదయం :** 5.29
**సూర్యాస్తమయం:** 6.29
**రాహుకాలం :** ఉ. 10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

## చే లాంటి యోధుడు మళ్లీ పుట్టడు

ఫ్యాషనబుల్ హీరో కాదు
ప్యాషనేట్ రివల్యూషనరీ
'చే' ని ఘర్షణ కన్నది.
విప్లవం పెంచింది.

ధనస్వామ్య విధ్వంసక
ప్రళయ ప్రబోధకుడు
సామ్రాజ్యవాద వినాశక తీతువు
నిరంతరం మృత్యుముఖంలోకి
తీసుకుపోయే ఆస్తమా–
యుద్ధభూమిలాంటి ఓ బాల్యం
'జీవితమంతా ఊపిరాడని
ఇసుక తుఫాన్లు'

గేమ్స్ స్పోర్ట్స్ విన్నర్.. చే
కందకాల్లో నంబర్‌వన్
వార్ ప్లే బాయ్ హార్డ్ వర్కర్

'అలసట ఆయాసం
గాలియంత్రాలు'
'శ్వాసల కోశాధికారి'
ఆస్తమా పీడితులకు 'రేడియేటర్' చే!
విప్లవాల ఊపిరి
మొండిధైర్యం నాడీ
ప్రవాహానికి జారుకున్న 'పిల్లి'
నెట్టుకుపోతోంది
సాయుధ మృత్యు మార్గాన....

ఉచ్ఛ్వాస – నిశ్వాసాల 'కొసల' మీద
ఊపిరి ఉయ్యాలలూగినవాడు
క్యాస్ట్రో నీడన ఊపిరిని

ఉగ్రాతలూగించినవాడు
గుండెనిండా గాలి పోసుకుని
ఎత్తైన శిఖరాల మీంచి పల్టీ కొడతావు
నువ్వే చివరి విప్లవకారుడవు
నువ్వు నా ప్రాణానివి
అన్ని పువ్వుల్లో
ఎర్రమందారమే నాకు ప్రియం

విప్లవకారుడా,
తుపాకీ గొట్టంలాంటి ముక్కుపుటాల్లో
ఊపిరి ఆడకపోతే
ప్రపంచం చచ్చిపోతుంది!



భయోద్విగ్న, ఆహార్యం–
నీ సింహ రూపం
శత్రువు గుండెల్లో
ఫిరంగి గుళ్ళు – నీ కళ్ళు
మొన వంపు తిరిగిన కత్తులు–
నీ మీసాలు
నీ చేతులు తుపాకులు

'రాత్రి అంతరిక్షం' నీ టోపీలో ఇరుక్కుంది
సిగార్ పెదవుల మీద 'అగ్నిపర్వతం'
అన్నిటినీ మించి నువు మనిషివి కాదు
పేలుడు పదార్థానివి!

కమ్యూనిస్ట్ విప్లవ సిద్ధాంత పితామహుడు
కారల్ మార్క్స్‌కు నిజమైన వారసుడివి

(నేడు చేగువేరా జయంతి)

నీలం సర్వేశ్వరరావు
మొబైల్ : 93919 96005

# నాగరిక చట్టం అడవికి వర్తించదా?

విశ్లేషణ


మాడభూషి శ్రీధర్

ఆదివాసులు, మరికొన్ని సంప్రదాయ జాతులు అడవుల్లో తరతరాల నుంచి ఉంటున్నారు. అభివృద్ధి పేరుతో, వారిని 'అభివృద్ధి చేస్తా'మనే సాకుతో, మనం అభివృద్ధి కావడానికి వారిని వెనుకకు, ఇంకాఇంకా వెనుకకు తోసేస్తున్నాం. తరతరాలుగా అక్కడే ఉండి బతుకుతున్నవారిని నోటీసు లేకుండా తొలగించడం న్యాయమా? 'మీరు ఇక్కడి నించి వెళ్లిపొండి' అని వారిని గద్దిస్తే రెండు ప్రశ్నలు వేస్తారు. 'ఈ నేల ఎందుకు వదలాలి? ఎక్కడికి వెళ్లాలి?' ఈ ప్రశ్నలకు ఎవరు జవాబిస్తారు?

1927లో బ్రిటిష్ పాలకులు అడవులను రక్షించడానికేనని అంటూ, అడవి చట్టం తెచ్చారు. అటవీ అధికారులు, గార్డులు, జవాన్లు తదితర ఉద్యోగులతో ఒక పెద్ద క్యాడర్ తయారైంది. ప్రభుత్వం ఫలానా హద్దుల్లోని ప్రాంతం అడవి అని ప్రకటిస్తే చాలు, అటవీ అధికారులు అక్కడ రాజ్యం ఏలడం మొదలుపెడతారు.

మన హక్కులను అమలుచేసుకోవడానికి కాల పరిమితులచట్టం పరిమితులు నిర్దేశించింది. భూమి, ఇల్లు వంటి స్థిరాస్తులను ఎవరైనా కబ్జా చేస్తే ఆ కబ్జా చేసినవారిని ఖాళీ చేయించడానికి ఈ చట్టం 12 సంవత్సరాల కాలపరిమితి విధించింది. ఈలోగా రాకపోతే కబ్జాదారుడే ఆ కబ్జాలో దర్జాగా కొనసాగే వీలు ఏర్పడుతుంది. ప్రభుత్వ భూమి అయితే 30 సంవత్సరాల పాటు ఆక్రమణల్లో ఉంటే ప్రభుత్వం అది నా భూమి అని క్లెయిమ్ చేయకపోతే ఆ తరువాత అవకాశం లేకుండా పోతుంది. ఆదివాసులు, తదితరులు తరతరాలనుంచి కొంత అడవి భూమిని తమ అధీనంలో ఉంచుకుంటే, ప్రభుత్వం ఆ భూమి తనదే అని ఏ విధంగా క్లెయిమ్ చేయగలుగుతుంది? నాగరికుల చట్టం అడవిలో వారికి వర్తించదా?

1927నుంచి అడవి చట్టం కింద అటవీ అధికారులకు తీవ్రమైన అధికారాలు ఇవ్వడం వల్ల తగాదాలు మొదలైనాయి. ఫారెస్ట్ గార్డ్ ఈ అటవీ వాసులకు గాడ్ కన్నా భయంకరుడు. ఈ గార్డ్ చెప్పు చేతల్లో అడవి మనుషుల హక్కులు ఉంటాయి. ఈ నిరంకుశ అటవీ పాలనలో జనం పడ్డబాధల పునాదుల మీద తీవ్రవాదం, నక్సలిజం పుట్టి పెరిగాయి. విభజనవాదం, వేర్పాటువాదం కూడా వచ్చింది.

అడవిపైన ఆదివాసులకు యాజమాన్యపు హక్కు ఇవ్వకపోయినా, కనీసం అడవిలో ఉండే హక్కు వారికి ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు, ఉద్యమాలు సాగుతున్నాయి. చివరకు ప్రభుత్వం ఈ ప్రజాందోళనలకు తలొగ్గి 2006లో అడవి హక్కుల చట్టం తెచ్చింది. ఈ చట్టం ప్రకారం ఆదివాసులు 2005 డిసెంబర్ 13 నాటికి తాము అడవిలో ఫలానా హద్దుల మధ్య ఉంటున్నట్టు రుజువుచేస్తే ఆ హద్దుల మధ్య నివసించే హక్కు ఉందని పత్రం ఇస్తారు. ఈ చట్టంద్వారా కొత్త హక్కులు ఇవ్వడం లేదు, ఇది వరకు నుంచి వారి హక్కులను గుర్తించి, రక్షించి, పరిధులను నిర్ణయించడం ఈ చట్టం ఉద్దేశం.

ఈ హక్కులను గుర్తించడానికి ఒక ప్రక్రియను నిర్దేశించారు. గ్రామసభకు ఆదివాసులు తమ క్లెయిమ్‌లను సమర్పించాలి. ఆ హక్కు అభ్యర్థన పత్రాలను, రుజువులను సబ్ డివిజనల్ స్థాయి అధికారుల కమిటీ పరిశీలిస్తుంది. ఈ కమిటీకి ఒక అధికారి అధ్యక్షుడు. వీరి నిర్ణయాన్ని సమీక్షించడానికి కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఉంటుంది. క్లెయిమ్‌లను పరిశీలించి న్యాయంగా నిర్లక్ష్యం లేకుండా వ్యవహరిస్తే అటవీ నివాసులకు హక్కులు లభిస్తాయి. నిర్లక్ష్యంగా ఆ క్లెయిమ్‌లు తిరస్కరిస్తే అప్పీలులో కూడా న్యాయం జరగకపోతే వారేమవుతారు? అనేక రాష్ట్రాలలో నవంబర్ 2018 నాటికి 42 లక్షల 24 వేల క్లెయిమ్‌లు వచ్చాయని, అందులో 18 లక్షల 94 వేల మందికి హక్కు పత్రాలు ఇచ్చారని, 19 లక్షల 39 వేల క్లెయిమ్‌లు తిరస్కరించారని కేంద్ర అటవీ శాఖ లెక్కలు వివరిస్తున్నాయి. దాదాపు 44.8 శాతం మంది క్లెయిమ్‌దారులకు హక్కు పత్రాలు ఇచ్చారు. కానీ మిగిలిన 55 శాతం మంది గతేమిటి? వారిని ఆక్రమణదారులంటారా? అక్కడ నివసిస్తున్నామనడానికి రుజువులు చూపలేకపోతేనో, చూపిన రుజువులు నమ్మకపోతేనో, అవి చెల్లవంటే వారి క్లెయిమ్ ఒప్పుకోరు. అందువల్ల ఆక్రమణదారుడని నిందించి అడవి వదిలి వెళ్లిపోవాలంటారా? అది న్యాయమా? అనేది ధర్మాసనం ముందున్న ప్రశ్న. అర్హులందరికీ పట్టాలిచ్చారా? ఇవ్వని వారంతా అనర్హులైన ఆక్రమణదారులా అని సుప్రీంకోర్టు అడిగింది. ప్రభుత్వాలు ఇచ్చిన ప్రమాణ పత్రాల ఆధారంగా 16 రాష్ట్రాలలో ఉన్న 11 లక్షల మంది గిరిజనులు, ఇతర సంప్రదాయ నివాసులను తొలగించాలని సుప్రీం కోర్టు ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఆదేశించింది. ఒకవేళ 11 లక్షలమందిని అడవుల నుంచి వెళ్లిపొమ్మంటే ఎక్కడికి వెళ్తారు, ఎలా బతుకుతారు? సమస్య చాలా తీవ్రమైందని గుర్తించి సుప్రీంకోర్టు ఫిబ్రవరి 13 తీర్పుపైన తానే ఫిబ్రవరి 28న స్టే ఇచ్చింది. అటవీ వాసుల సమస్య అంతటితో తీరుతుందా?

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

## మరిచిపోలేని మందహాసం

పదునైన సమీక్షలు, విమర్శలు, జ్ఞానవంతమైన సంపాదకీయాలు, వేలపుటల వ్యాసాలు, లేఖలు, డైరీలు, కవిత్వంతో పాటు శాస్త్రీయంగా, తార్కికంగా తెలుగులో జీవిత చరిత్రల రచనకు శ్రీకారం చుట్టిన కె.వి.రమణారెడ్డి(కేవీయార్) నిరంతర అక్షర శ్రామికుడు. విరసానికి వ్యవస్థాపక కార్యదర్శిగా ఎన్నికైన కేవీయార్ దానితో పాటు సాహిత్యవ్యక్తిగా పునర్జన్మ నెత్తారు. ఒకటో రెండో కథలు, నవలానువాదంతో సహా సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను స్పృశించిన అరుదైన సాహితీవేత్త. కేవీయార్‌తో 1956 నుంచి సన్నిహితంగా మెలిగిన చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ ఇటీవల 'కె.వి.ఆర్‌తో మా జ్ఞాపకాలు' అన్న పుస్తకం రాయడం ఆ అక్షరయోధుడి జీవిత చరిత్ర రాని లోటును తీర్చింది.



ఆధునిక, అభ్యుదయ, విప్లవ సాహిత్యంలో కేవీయార్ జీవితాన్ని ఉన్నది ఉన్నట్టు ఈ పుస్తకంలో ఆవిష్కరించారు. నెల్లూరు జిల్లా రేబాల గ్రామంలో 1928 మార్చి 23న జన్మించిన రమణారెడ్డి బాల్యం నుంచే భావుకుడు. సుభాష్ చంద్రబోస్‌పట్ల ఆకర్షితుడైనప్పుడే ఆయనలో అతివాద భావాలకు అంకురార్పణ జరిగింది. చదువుకునే రోజులలోనే 'క్షాత్రవాణి' అన్న లిఖిత పత్రికకు సంపాదకుడిగా పనిచేశారు. డిటెన్షన్ విధానానికి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని రాజకీయ చైతన్యానికి నాంది పలికారు. ఐఏఎస్ పరీక్షల్లో నెగ్గినా, రాజకీయాల వల్ల ఇంటర్వ్యూలో నెగ్గలేదు. కావలి జవహర్ భారతి కళాశాలలో చరిత్ర, రాజనీతి శాస్త్ర పాఠాలు చెప్పారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మొదలైన గ్రంథ పఠనం, విరసం అధ్యక్షుడిగా ఎన్నికై విజయవాడకు తిరిగివచ్చిన మర్నాడే, 1998 జనవరి 15వ తేదీన చివరిశ్వాస విడిచేవరకు కొనసాగింది. విరసంపట్ల నిబద్ధత, నిమగ్నత, నక్సలైట్ ఉద్యమంతో మమేకం పొందారు.

దువ్వూరి రామిరెడ్డిపై రాసిన 'కవికోకిల'ను జి.ఎన్. రెడ్డి మెచ్చుకున్నారు. గురజాడపై రాసిన 'మహోదయం' సర్వజనామోదం పొందింది. రారా దాన్ని ఎన్‌సైక్లోపీడియా అన్నారు. నెల్లూరు జైల్లో రాసిన 'డిటెన్యూ డైరీ' రాజకీయ, సాహిత్యాంశాలతో కూడిన విజ్ఞానదాయక గ్రంథం. ఇందులోనే 'జైలు తల్లికి నమస్కారం. ఇది నాపాలిట సత్రము, మఠము, హాస్టలు, కమ్యూన్, నిత్య విద్యార్థినైన నాకు పాఠశాల కూడా' అని రాశారు. 'భైట స్వేచ్ఛ నశించినప్పుడు ఎవరైనా ఉండవలసింది జైల్లోనే' అంటారు. కేవీయార్ సాహిత్య స్నేహప్రపంచం విశాలమైంది. ఉద్యమ రాజకీయాల్లో సైద్ధాంతికంగా మడమతిప్పని మనస్తత్వం. అలుపెరగని చదువరి. కేవీయార్ నాకు స్నేహితుడు, తాత్వికుడు, మార్గదర్శి అన్న వకుళాభరణం మాటలు మరిచిపోలేని మందహాసాలు.

రాఘవశర్మ, మొబైల్ : 94932 26180

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం ॥ 14-6-2019



పారితోషికం 14 కోట్లు?
సినిమా పేజీలో...



స్త్రీ శక్తి

# స్వచ్ఛమైన సంతోషం



● ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు అందుకుంటూ...



● స్వచ్ఛభారత్ అవార్డు అందుకుంటూ..



● కేటీఆర్ చేతుల మీదుగా అంతర్జాతీయస్థాయిలో ఐఎస్‌వో సర్టిఫికెట్‌తో...

ఇల్లు అందంగా ఉందంటే ఇల్లాలిదే గొప్పతనం. ఇళ్లను పరిశుభ్రంగా ఉంచినప్పుడే పక్కన ఉన్న సమాజం అంతా స్వచ్ఛంగా ఉంటుంది. దీనికి పట్టణాల్లో మున్సిపాలిటీలు, గ్రామాల్లో పంచాయతీల ఏలికలు చైతన్యవంతం అయి ఉండాలి. ఇలానే సూర్యాపేట మున్సిపాలిటీ ఏలికగా ఎంపికై మంచినీటి సమస్య లేకుండా చేయడంతో పాటు పరిశుభ్రతకు పట్టం కట్టారు తొలి మహిళా మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక. ఈ పరిశుభ్రతకు మెచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి స్వచ్ఛ అవార్డులు పేట మున్సిపాలిటీ ముంగిట వాలాయి. నేడు అన్ని మున్సిపాలిటీలకు సూర్యాపేట ఆదర్శంగా నిలిచింది.

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆమెకు ఒక కోరిక ఉండేది. ఇంట్లో మహిళలకు ఎదురయ్యే సమస్యల్లో ఒకటి నీళ్లు.. రెండోది పరిశుభ్రత. దీన్ని దృష్టిలో పెట్టుకొని చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తర్వాత నీటి సమస్యపై స్పందించారు. ఇంట్లోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి ట్రాక్టర్లకు ఇవ్వాలంటూ నిత్యం మైకుల ద్వారా మున్సిపాలిటీలో మహిళలకు అవగాహన కల్పించింది. బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదిలోనే నీటి సమస్యను పరిష్కరించింది. మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో ఒక్క 20 రోజుల్లోనే పట్టణంలో ఎక్కడా నీటి సమస్య లేకుండా చేశారు. అదే ఉత్సాహంతో ఈ ఐదేళ్లలో వేసవిలో మంచినీటి సమస్య లేకుండా చూశారు.



**రాజకీయం రంగరించుకొని...**

నల్లగొండ జిల్లాలోని దేవరకొండ పట్టణానికి చెందిన డాక్టర్ మల్లికార్జున్‌రావు కుమార్తె ప్రవళిక. బాల్యంలోనే హైదరాబాద్ నగరంలో స్థిరపడ్డారు. కంప్యూటర్స్ సైన్స్ విద్యనభ్యసించారు. చదువు పూర్తి కాగానే సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త గండూరి ప్రకాష్‌తో 20 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వివాహ అనంతరం ఆయన సాగిస్తున్న వస్త్ర వ్యాపారంలో చేదోడువాదోడుగా ఉన్నారు. 11వ వార్డు మాజీ కౌన్సెలర్‌గా ఉన్న గండూరి ప్రకాష్ తాను ప్రాతినిధ్యం వహించిన అదే వార్డు నుంచి తన సతీమణి గండూరి ప్రవళికను బరిలో నిలపడంతో ఆమె విజయం సాధించింది. జనరల్ మహిళకు చైర్‌పర్సన్‌గా అవకాశం రావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 2014లో ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారికి కావాల్సిన వసతులు కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతోంది. అంతేకాకుండా ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టి జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయిల్లో ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ, పన్ను వసూళ్లు, ఓడీఎఫ్ లాంటి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్వచ్ఛభారత్ పోటీలో తెలంగాణ రాష్ట్రంలోనే ఒక దఫా స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు, మరోమారు స్వచ్ఛభారత్, స్కోచ్ అవార్డులను సొంతం చేసుకున్నారు. 2016లో ఉత్తమ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, 2017లో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డును ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా అందుకున్నారు. అలాగే 2018లో అంతర్జాతీయ స్థాయిలో ఐఎస్‌ఓ సర్టిఫికెట్, 2018లో జాతీయస్థాయిలో స్కోచ్ అవార్డు, 2019లో స్వచ్ఛభారత్ అవార్డును అందుకున్నారు. ఆస్తి పన్నుల వసూళ్లలో కూడా చైర్‌పర్సన్ సలహాలు.. సూచనలు పాటించిన అధికారులు రాష్ట్రంలోనే పన్నుల వసూళ్లలో మొదటి స్థానం పొంది అవార్డు తీసుకున్నారు.

**– వర్దెల్లి అరుణకృష్ణ**, సూర్యాపేట

### అనుకున్నది సాధిస్తే.. అదో తృప్తి...

**చ**దువుకునే రోజుల్లో ఏదో ఒక రంగంలో రాణించాలన్నది నా లక్ష్యం. అప్పటికే వస్త్ర రంగంలో ఉన్న గండూరి ప్రకాశ్‌తో నాకు వివాహం అయింది. ఆ తర్వాత వస్త్ర రంగంలో సక్సెస్ సాధించాం. నా భర్త ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చా. మున్సిపాలిటీలో తొలి మహిళా చైర్‌పర్సన్‌గా నా మార్కు ఉండాలనుకున్నా.. అది సాధించడంతో స్వచ్ఛ అవార్డులు మున్సిపాలిటీకి దక్కాయి. మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో ఏళ్ల నాటి మంచినీటి సమస్యకు పరిష్కారం చూపించాం. మంచి నీటికి మహిళలు పడే ఇబ్బందిని తీర్చానన్న తృప్తి నాకుంది. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుతున్న మహిళలు, ప్రతిరోజు వీధుల్లోకి వచ్చే ట్రాక్టర్లలో చెత్త వేస్తున్నారు. అది నాకెంతో సంతోషాన్నిస్తోంది. ఇప్పుడు సూర్యాపేట మున్సిపాలిటీ దేశ స్థాయిలోనే స్వచ్ఛత విషయంలో ముందంజలో ఉందంటే ఇదంతా పట్టణ ప్రజల సహకారంతోనే సాధ్యమైంది.

**- గండూరి ప్రవళిక,** మున్సిపల్ చైర్‌పర్సన్, సూర్యాపేట






**జ్ఞానం ఉన్నవాళ్లు కొంచెం పైన ఉంటారు. అక్కణ్ణుంచే కిందికి చూసి..**
**కళను అభ్యసించేవాళ్లను సవరిస్తుంటారు.**
**'పైకి రావడం తేలిక కాదు.. బీ సీరియస్' అని చెప్పడం అది.**
**అయితే ఆ చెప్పడం ఘాటుగా ఉండకూడదు.**
**కళల్లో సౌమ్యం ఉంటుంది. అదే సౌమ్యత సీనియర్‌లలోనూ ఉండాలి.**
**అంతే సౌమ్యంగా సవరించాలి. అది రాగం అయినా, అభినయం అయినా..!**

# దిద్దుఘాటు

**దీ**పికా సింగ్ టీవీ నటి. తెలుగువాళ్లకు కూడా తెలుసు. స్టార్ ప్లస్ సిరీస్ 'దియా అవుర్ బాతి హమ్' (నువ్వు దీపం.. నేను ఒత్తి) సీరియల్‌తో బాగా పాపులర్ అయ్యారు. తెలుగిళ్లకు 'ఈతరం ఇల్లాలు'. టీవీలోనే కాదు. బయట కూడా బాగా యాక్టివ్. సోషల్ మీడియాలో తన డాన్స్ వీడియోలను షేర్ చేస్తుంటారు. కొత్త సీరియల్ 'కవచ్–2' కోసం ప్రాక్టీస్ చేసిన డాన్స్ వీడియోను కూడా అలాగే షేర్ చేశారు దీపిక! అది ఒడిస్సీ డాన్స్. 'వావ్' అన్నారు అభిమానులంతా. సీనియర్ టీవీ నటి సుజాతా సెహ్‌గల్ మాత్రం ఆమెపై ఇంతెత్తున లేచారు. 'ఆపెయ్ డాన్స్. ఎంత ఘోరంగా ఉంది. పదిహేనేళ్లు ట్రైనింగ్ తీసుకుంటే కాని రాని డాన్స్ అది'అన్నారు. దీపిక బాగా హర్ట్ అయింది. ఆమెను అన్నందుకు దీపిక ఫ్యాన్స్ సుజాతను అన్నారు. ఇప్పుడీ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

అసలు కళలో దిద్దుబాటు ఎలా ఉండాలి? కోపంగానా, ప్రేమగానా, అసహనంగానా, పెద్దరికంగానా, చిన్నబుచ్చుతూనా? ఎలా? ఎలా ఉండాలి?

* * *



● 'శంకరాభరణం'లో సోమయాజులు...

**జె**.వి.సోమయాజులు గారి ఇంటికి పెళ్లిచూపులకు వస్తారు చంద్రమోహన్, నిర్మలమ్మ. సోమయాజులు గొప్ప సంగీత విద్వాంసులు. ఆయన కూతురు రాజ్యలక్ష్మి. సినిమాలో పేరు శారద.

''మా పిల్ల సాక్షాత్తూ సరస్వతీ దేవే అనుకోండి. మంచి గాత్రం ఉంది. మొగుడుకి ఉత్తరాలు రాసుకునేంత చదువు చదువుకుంది. వంటావార్పూ శుచీ శుభ్రం అన్నీ తెలుసు'' అంటుంది పిల్ల తరపు ఆవిడ.

అమ్మాయిని ఒక పాట పాడమని అడుగుతుంది నిర్మలమ్మ. లోపల్నుంచి వీణను తెచ్చి అక్క చేతికి ఇస్తుంది చిన్నారి తులసి.

రాగయుక్తంగా 'సామజవరగమన..' పాట మొదలౌతుంది. పాడుతూ పాడుతూ చంద్రమోహన్‌తో తీపి ఊహల్లోకి వెళ్లిపోతుంది రాజ్యలక్ష్మి. అంతకుముందే గుడిలో అతడిని చూసి ఉంటుంది. అలా పాడుతూ పాడుతూ.. అపశ్రుతి పలుకుతుంది.

'శారదా' అని కూతురిపై పెద్దగా అరిచేస్తారు జె.వి.సోమయాజులు, కుర్చీలోంచి పైకి లేస్తూ! ఉలిక్కిపడుతుంది రాజ్యలక్ష్మి. కోపంతో ఊగిపోతారు పెద్దాయన.

''నువ్వు పాడుతున్న ఆ రాగమేమిటి? అంటున్న ఆ స్వరం ఏమిటి? శుద్ధ హిందోళంలో ఆ రిషభం ఎలా వచ్చింది! చెప్పు.. హిందోళానికి ఆరోహణం ఏమిటి?'' అంటారు. 'సగమ దనిస' అంటుంది. 'అవరోహణ?' అంటారు. 'సనిద మగస' అంటుంది. 'మరి ఆ రిషభం ఎక్కణ్ణుంచి వచ్చింది?' అంటారు. రాజ్యలక్ష్మి ఏడుస్తుంది.

''స్వర సంకరం చెయ్యడానికి బుద్ధిలేదటే'' అని తిట్టేస్తారు.

జె.వి.సోమయాజులు స్టైయిల్ ఆఫ్ దిద్దుబాటు అది.

* * *



● 'సాగర సంగమం'లో కమల్‌హాసన్...

**హై**దరాబాద్.. రవీంద్రభారతి.

''చిరుతప్రాయంలోనే కాలికి మువ్వ కట్టి, నటరాజ పదపూజలో తరించి, అనేక పట్టణాలలో ప్రదర్శనలిచ్చిన కుమారి శైలజ నేడు మన నగరంలోనే శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇవ్వడం మనం, మన నగరం చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను. అటువంటి కళాకారిణిని సత్కరించి నాట్యమయూరి అని బిరుదునివ్వడం మన పూర్వజన్మ సుకృతం అనుకుంటున్నాను'' అంటాడు కిశోర్. సిటీలో బాగా పలుకుపడి ఉన్నవాళ్ల అబ్బాయి కిశోర్ శైలజను ప్రేమిస్తుంటాడు. అతడే ఆ నృత్యప్రదర్శన ఏర్పాటు చేయిస్తాడు. కవరేజీ కోసం ప్రెస్‌వాళ్లకు కబురు వెళుతుంది.



● సుజాతా సెహ్‌గల్

ప్రోగ్రామ్ స్టార్ట్ అవుతుండగా.. ప్రెస్ గ్యాలరీలోకి పైజామా లాల్చీతో వస్తాడు కమల్‌హాసన్. 'ఓం నమశ్శివాయ' పాటకు శైలజ నృత్యం మొదలౌతుంది. డాన్స్ అదిరిపోతుంది. స్టేజ్ కింద ఒకటే చప్పట్లు. కమల్‌హాసన్ మాత్రం తలగోక్కుంటాడు. మర్నాడు పేపర్‌లలో మంచి రివ్యూలు వస్తాయి.

పేపర్ 1: పదవిన్యాసంతో ప్రేక్షకుల్ని సమ్మోహనం చేసిన నాట్య మయూరి కుమారి శైలజ నృత్య ప్రదర్శన.

పేపర్ 2: ద మోస్ట్ ఎగ్జయిటింగ్ పెర్ఫార్మెన్స్ ఇన్ ద సిటి గివెన్ బై కుమారి శైలజ.

కిశోర్ ఒక్కో పేపర్ హెడ్డింగ్ చదువుతూ శైలజను సిగ్గుల మొగ్గను చేస్తుంటాడు. కిశోర్ అలా పొగడ్తల్లో ముంచెత్తుతున్నప్పుడు ఓ పేపర్‌లో వచ్చిన హెడ్‌లైన్ శైలజ కంటపడుతుంది. 'నాట్యశాస్త్రానికే తీరని కళంకం. కుప్పిగంతులు, కప్పగెంతులు. నటరాజుకు శిరోభారం' అని హెడ్డింగ్ కనిపిస్తుంది. శివతాండవం చేసినట్లుగా కోపంతో ఊగిపోతుంది శైలజ. ఆ వార్త రాసింది కమల్‌హాసన్.

ఆ పత్రిక ఆఫీస్‌కి వెళ్లి, ఎడిటర్ చేత కమల్‌హాసన్‌ని క్యాబిన్‌లోకి పిలిపించి, ''ఏరా ఇడియట్.. చేతిలో పెన్ను, కాగితం ఉంది కదా అని నీ ఇష్టం వచ్చినట్లు రాస్తావా? అసలు శాస్త్రీయ నృత్యం గురించి చెప్పడానికి నీకేం అర్హత ఉందిరా! నువ్వేమైనా భరతమునివా? మర్యాదగా శైలజ గారి కాళ్లు పట్టుకుని క్షమాపణ అడుగు. లేదా నీ కాళ్లూ చేతులు విరిచి అవతల పారేస్తాను జాగ్రత్త. బాస్టర్డ్'' అని కమల్‌హాసన్‌ని నిలబెట్టి తిట్టేస్తాడు కిశోర్.

ఏం మాట్లాడడు కమల్. స్టాఫ్ అంతా చూస్తుంటారు. తన దగ్గరున్న టేప్ రికార్డర్ ఆన్ చేసి, క్రితం రోజు శైలజ డాన్స్ చేసిన పాటను వినిపించి, మళ్లీ డాన్స్ చెయ్యమని అడుగుతాడు శైలజని.

'పంచ భూతములు ముఖపంచకమై.. ఆరు రుతువులు ఆహార్యములై' అనే చరణానికి మళ్లీ డాన్స్ చేసి చూపిస్తుంది శైలజ.

''ఇదీ.. శాస్త్రీయ నృత్యమా?'' అని అడుగుతాడు.

''ఏ! కాదా?!'' అంటుంది.. వెటకారంగా.

''ఏ సాంప్రదాయం??'' అంటాడు.

'ఇడియెట్' అని గొణక్కుని.. ''ఎన్ని సాంప్రదాయాలు ఉన్నాయో కూడా తెలుసా నీకు? దీన్ని భరత నాట్యం అంటారు'' అంటుంది.

కమల్ ఆ చరణాన్ని రీప్లే చేస్తాడు. దాన్ని తను భరతనాట్యంలో చేసి చూపిస్తాడు. 'భరతనాట్యం అంటే ఇదీ' అని చెప్తాడు.

మళ్లీ రీప్లే. కథక్. మళ్లీ రీప్లే.. కథాకళి.

''దృష్టి, మనసు, భావమూ చేసే కళలమీదే లగ్నమై ఉండాలి. అప్పుడే రససిద్ధి కలుగుతుంది. నీ దృష్టి ప్రేక్షకుల మీద. మనసు వాళ్లు కొట్టే చప్పట్ల మీద. ధ్యాస అందుకోబోయే బిరుదుల మీద'' అని, 'హు.. నాట్యమయూరి' అని ఒక చూపు చూసి వెళ్లిపోతాడు.

కమల్‌హాసన్ దిద్దుబాటు స్టైయిల్ అది.

వెళ్లేముందు పనిలో పనిగా తనను బాస్టర్డ్ అన్న వాడి దగ్గరికి వెళ్లి.. 'ఏమన్నావ్.. బాస్టర్డా..' అని లాగి చెంప మీద కొడతాడు.

* * *

**''ఓ** పెద్ద పేరున్న దర్జీ దగ్గరికి చీటీ గుడ్డ అట్టుకెళ్లి మాంచి కోటు కుట్టమంటే బాగోదు. అట్టాగే బాగా శాస్త్రం తెలిసిన మనిషి దగ్గరికెళ్లి నీ లొల్లాయి పదాలు పాడే కంఠం తోటి సంగీతం నేర్పమంటే.. చ చ.. దానికీ రాగం, తానం, స్థాయి ఎన్నుండాల. అసలు గొంతుక ఏ స్థాయిలో విప్పినా ఝుమ్మ అంటూ నిలబడిపోవాల. అప్పుడు ఆవిడేమైనా నేర్పినా, నువ్వేమైనా నేర్చుకున్నా..'' అంటాడు మల్లికార్జున్‌రావు కమలహాసన్‌తో 'స్వాతిముత్యం' సినిమాలో.. రాధిక గురించి.

కమల్ ఆలోచనలో పడతాడు. గోదారి ఒడ్డున మోకాళ్ల మీద కూర్చొని ఒక చెవికి చెయ్యి ఆన్చి.. 'ఆ..' అని గాత్రాన్ని ట్యూన్ చేసుకుంటుంటాడు. నీళ్ల కోసం బిందెతో వస్తుంది అక్కడికి రాధిక. ''మీరు రోజూ ఇలా సాధన చేస్తారా?'' అంటుంది. ''ఇప్పుడే మొదలు పెట్టాను మీ దగ్గర సంగీతం నేర్చుకోవాలి కదా'' అంటాడు.

''నేనిక నేర్పేదేముందీ.. మీరింత బాగా పాడుతుంటే'' అంటుంది.

ఉత్సాహంగా కొన్ని 'ఆ'లు.. పైకీ, కిందికీ రాగం తీస్తాడు. సవరిస్తుంది. ఆ సవరణలతో పర్‌ఫెక్ట్‌గా రాగం తీస్తాడు. కమల్‌కి తనపై తనకే ఆశ్చర్యం వేస్తుంది.

''అదేంటండీ.. మీరు పక్కనుంటే నేను గొంతు విప్పితే చాలు మంచి రాగమైపోతోంది'' అంటాడు.

''నేను లేనప్పుడు మీరు పాడుతున్నదీ మంచి రాగమే.. మధ్యమావతి'' అంటుంది. తనూ పాడుతుంది.

దిద్దుబాటులో రాధిక స్టైయిల్ ఇది.

అలా 'సువ్వీ సువ్వీ సువ్వాలమ్మా..' పాట మొదలౌతుంది. ఇద్దరూ కలిసి పాడతారు.



● 'స్వాతి ముత్యం'లో కమల్‌హాసన్, రాధిక

* * *

**'మూ**గమనసులు' సినిమాలో ఇలాంటిదే రివర్స్ సీన్ ఉంది. సావిత్రికి పాడటం నేర్పిస్తుంటాడు అక్కినేని. కాలేజీలో పాటలు పోటీలు పెడతారు. నేర్పించమని అక్కినేనిని అడుగుతుంది. 'నేను నేర్పించడం ఏమిటి అమ్మాయి గారూ' అంటాడు అక్కినేని. ''అవున్రా.. ఒట్టి పల్లె పదాలే పాడాలట'' అంటుంది. సావిత్రి కలవారి అమ్మాయి. అక్కినేని పడవ వాడు. కాలేజీ అయ్యాక సావిత్రిని రేవుకి చేరుస్తుంటాడు. పల్లె పదాలు నేర్పమంటే సరేనంటాడు. ఇంటికి రమ్మంటుంది. వెళ్తాడు.

''నేను పాట నేర్పడం ఏంటి అమ్మాయి గారూ..'' అని మళ్లీ అంటాడు. ''నేను పాడతాను. మీరు నేర్చుకోండి'' అంటాడు. ''నా గొంత అంత బాగుండదు అమ్మాయి గారూ'' అంటాడు. పాట మొదలు పెడతాడు.

'నా పాట నీ నోట పలకాల సిలకా..' అని రాగం తీస్తాడు.

ఆమె ఇమిటేట్ చేస్తుంది. అయితే సిలకా అనడానికి బదులు చిలకా అంటుంది. ఎన్ని సార్లు దిద్దినా అలాగే అంటుంది. అక్కినేని చికాకుపడతాడు.

'యహా.. చి కాదు సి.. సి.. సిలకా.. అంటాడు. అది అక్కినేని దిద్దుబాటు.

● దీపికా సింగ్



● 'మూగమనసులు'లో సావిత్రి, ఏయన్నార్

* * *

దిద్దుబాటు ఎలా ఉన్నా.. సరిదిద్దడం కోసమే అయి ఉండాలి. కించపరచ కూడదు. కాన్ఫిడెన్స్ దెబ్బతియ్యకూడదు. జె.వి. సోమయాజులుకు సంగీతం అంటే ప్రాణం. అందుకే కూతురు తప్పుగా పాడినందుకు ఆయనకు ప్రాణం పోయినంత పనైంది. కమల్‌హాసన్ డాన్స్ ఎక్స్‌పర్ట్. అందుకే శైలజ తప్పుగా అభినయం చేస్తే అతడు 'నటరాజుకు శిరోభారం' అని రాశాడు. కమల్‌కి స్వాతిముత్యంలో సంగీతం నేర్చుకోవాలని ఉంటుంది. ట్రై చేస్తాడు. రాధిక నవ్వుతూ సరిచేస్తుంది. 'నువ్వు పాడుతున్నదీ మంచి రాగమే అని ఎంకరేజ్ చేస్తుంది'. అక్కినేని మాత్రం సావిత్రిని విసుక్కుంటాడు. ఆమె జమీందారుల పిల్లే అయినా.. పల్లె పదాన్ని పల్లెపదంలా పలకక పోవడంతో 'యెహే' అనేస్తాడు. నలుగురూ నాలుగు విధాలుగా సెట్‌రైట్ చేశారు. కొంచెం నొప్పించి ఉండొచ్చు కానీ.. అది నేర్పించడానికే. వేరే ఉద్దేశం లేదు. అయితే ఇప్పుడు సుజాతా సెహగల్ చేసింది మాత్రం దీపిక మీద ఘాటుగా ఆగ్రహించడమే. 'కళను ధ్వంసం చేస్తున్నావ్' అంటే ఎవరికైనా కన్నీళ్లే కదా వస్తాయి. కళను ఉపాసించే వారిని అనడం అంటే కళను అనడమే.

## బ్యూటిప్స్

### మొటిమలను వెల్లుల్లితో వదలగొట్టచ్చిలా...

**ము**ఖం ఎంత ముద్దొచ్చేలా ఉన్నా, మొటిమలుంటే కొంచెం తీసికట్టుగా కనిపిస్తుంది. ఈ సమస్యకు చాలా రకాల క్రీములు వాడినప్పటికీ తాత్కాలిక ఉపశమనమే కానీ, శాశ్వత పరిష్కారం లభించదు ఒక్కోసారి. అలాంటివారి పాలిట వెల్లుల్లి వరమనే చెప్పాలి. ఎందుకంటే, వెల్లుల్లిలో బాక్టీరియాను చంపడానికి సహాయపడే యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్, క్రిమినాశక గుణాలుంటాయి. ఇంతకీ మొటిమల నివారణకు వెల్లుల్లిని ఎలా ఉపయోగించాలో చూద్దామా...

- ఓ నాలుగైదు వెల్లుల్లి రెబ్బలను చితగ్గొట్టి అందులో వెనిగర్ వేసి, పేస్టులా వచ్చే వరకు కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక కాటన్ బాల్‌తో తీసుకుని మొటిమలు ఉన్న చోట రాయాలి. పూర్తిగా ఆరిపోయే వరకు ఉండి, పొడి బారిన తర్వాత ముఖాన్ని స్వచ్ఛమైన నీటితో కడిగేసుకోవాలి. మెరుగైన ఫలితాల కోసం రోజూ ఈ మిశ్రమాన్ని ఉపయోగించవచ్చు.
- వెల్లుల్లిని చిదిమి, దాని నుండి రసాన్ని తీయాలి. దీనిని ఒక శుభ్రమైన గిన్నెలోకి తీసుకుని అందులో తాజా కలబంద గుజ్జును (అలోవెరా జెల్) కలపాలి. ఈ మిశ్రమాన్ని మొటిమల మీద రాసి, ఓ పావుగంట తర్వాత మామూలు నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మొటిమల సమస్య తగ్గుతుంది




## ఆర్థరైటిస్‌కు చికిత్స ఉందా?

డా. శ్రీకాంత్ మోర్లావర్ (CMD)

నా పేరు నారాయణ, వయస్సు 52 సంవత్సరాలు, నేను గత 8 సంవత్సరాల నుండి విపరీతమైన మోకాళ్ళ నొప్పి మరియు వాపులతో బాధపడుతున్నాను. మోకాళ్ళు పట్టేసినట్టుగా మరియు కదలిక శ్రేణి కూడా తగ్గిపోయింది. దీనివలన నేను ఎక్కువ దూరం నడవలేకపోతున్నాను. డాక్టరు గారిని సంప్రదించి ఎన్నో మందులు వాడినా ప్రయోజనం కనిపించడం లేదు. హోమియో చికిత్స ద్వారా నా సమస్య నయం అయ్యే అవకాశం ఉందా? సలహా ఇవ్వగలరు.

పైన చెప్పిన లక్షణాలని బట్టి మీరు ఆర్థరైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నారు అని చెప్పొచ్చు. ప్రస్తుత పరిస్థితులలో మానవుడి జీవన విధానం ప్రకృతి సహజమైన విధానాలకు విరుద్ధంగా ఉండడం వలన సరైన వ్యాయామం లేకపోవడం, తీవ్రమైన మానసిక ఒత్తిడి, పౌష్టికాహారం లోపం వలన త్వరిత గతిన మానవుడు ఆర్థరైటిస్‌కు గురి అవుతుండడం జరుగుతుంది. ఆర్థరైటిస్ అంటే కీళ్ళలో ఉండే కార్టిలేజ్ (మృదులాస్థి) అనే మెత్తని పదార్థం అరుగుదలకు గురి కావడంతో ఎముకలలో రాపిడి ఏర్పడి శోథమునకు దారి తీస్తుంది. అధిక బరువు, వయస్సు, ఇన్‌ఫెక్షన్లు, వంశపారంపర్యం, ఇన్‌ఫ్లమేటరీ కారణాలు, ఆటోఇమ్యూన్ డిజార్డర్స్ మొదలైన కారణాల చేత రకరకాలుగా ఆర్థరైటిస్ వచ్చే అవకాశం ఉంటుంది.

**ఆర్థరైటిస్‌లో రకాలు:-**

**ఆస్టియో ఆర్థరైటిస్ :** ఇది ఎక్కువగా 40 సంవత్సరాలు వయస్సు దాటిన వారిలో కార్టిలేజ్ అరుగుదల వలన ఎముకల మధ్య రాపిడి పెరగడం వలన వస్తుంది. ఈ విధమైన డీజెనెరేటివ్ ఆర్థరైటిస్ మగవారితో పోలిస్తే ఆడవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. ఆర్థరైటిస్ అనేది శరీరంలో ఏ కీళ్ళలోనైనా ఏర్పడే అవకాశం ఉంది. కానీ శరీర బరువునంతటినీ మోసే మోకాలులో ఇది అధికంగా కనబడుతుంది. మోకాళ్ళ వాపు మరియు నొప్పి, చేతితో తాకినప్పుడు వేడిగా అనిపించడం, నడిచే సమయంలో కిరకిరమని శబ్దం మరియు నడిచేందుకు ఇబ్బంది పడటం, కింద కూర్చోలేకపోవడం, ఉదయాన్నే నిద్రలేచేసరికి కీళ్ళ నొప్పులు అధికమవడం వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు.

**రుమటాయిడ్ ఆర్థరైటిస్:** ఇది ఒక ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్, జీవన క్రియలలో ఏర్పడే అసమతుల్యత వలన తలెత్తే ఈ ఆటోఇమ్యూన్ డిసీజ్ శరీరంలో ఇరువైపులా ఉండే కీళ్ళకు సమాంతరంగా వ్యాప్తి చెందుతుంది. కీళ్ళ తీవ్రమైన వాపుకు గురికావడంతో కదలికలు పూర్తిగా స్తంభించి కీళ్ళ వైకల్యానికి దారితీస్తుంది.

**గౌట్ ఆర్థరైటిస్:** సాధారణంగా మన రక్తంలో "యూరిక్ ఆమ్లం" అనే ముఖ్య రసాయనం ఉండాల్సిన దానికంటే ఎక్కువగా ఉండటం వలన ఈ వ్యాధి వస్తుంది. మొదట్లో ఇది కాలిబొటన వ్రేలు వంటి ఏదో ఒకటి రెండు కీళ్ళకు పరిమితమైనప్పటికీ ఇతరత్ర కీళ్ళకు వ్యాపిస్తుంది.

**సోరియాటిక్ ఆర్థరైటిస్:** ఇది సిరో నెగటివ్ ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్, దీర్ఘకాలికంగా సోరియాసిస్ బాధితులైన వారిలో 30% మంది ఈ ఆర్థరైటిస్‌తో బాధపడుతారు.

**ఇన్‌ఫెక్టివ్ ఆర్థరైటిస్ :** దీనినే సెప్టిక్ ఆర్థరైటిస్ అని అంటారు. ఇది బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ వలన వస్తుంది. రక్తం ద్వారా గానీ లేదా కీళ్ళ చుట్టూ ఉండే కణజాలాలు ఇన్‌ఫెక్షన్‌కు గురి అయినప్పుడు గానీ ఇన్‌ఫెక్టివ్ ఆర్థరైటిస్ సంభవిస్తుంది. ఎక్కువగా ఇది ఆర్టిఫిషియల్ జాయింట్ రిప్లేస్‌మెంట్ చేసుకునే వారిలో కనిపిస్తుంది.

**హోమియోకేర్ చికిత్స :** పైన చెప్పబడిన అన్ని రకాల ఆర్థరైటిస్ సమస్యలను హోమియో వైద్యంలో మెరుగైన చికిత్సలుంటాయి. మిగిత వైద్య ప్రక్రియలతో పోలిస్తే నొప్పిని తగ్గించడంలోనూ మరియు కదలికలను సురక్షితంగా ఉంచడంలోనూ హోమియోపతిలో చక్కటి పరిష్కారం లభిస్తుంది. హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో మాత్రమే అందించబడే జెనెటిక్ కాన్స్‌టిట్యూషనల్ చికిత్స విధానం ద్వారా రోగి యొక్క మానసిక మరియు శరీర లక్షణాలను సమర్థవంతమైన వైద్య బృందంచే క్షుణ్ణంగా విచారించి చికిత్స అందించడం జరుగుతుంది. దీని వల్ల సమస్య మళ్లీ తిరగబెట్టకుండా నయం చేసే అవకాశం ఉంది.

* శరీర ధర్మం ప్రకారం వ్యక్తిగత ఫలితాలు/ సమయం మారే అవకాశం ఉంది.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
వరల్డ్-క్లాస్ హోమియోపతి
టోల్ ఫ్రీ 1800 108 1212
ఉచిత కన్సల్టేషన్ 955 000 1199
www.homeocare.in

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ శుక్రవారం
14-6-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేనొక అమ్మాయికి ప్రపోజ్ చేశాను. తను సరే అంది. మూడు సంవత్సరాలు ప్రేమించుకున్నాం. నేను పోలీసు జాబ్‌కి ప్రిపేర్ అవుతున్నాను. తను ఓ రోజు ఫోన్‌చేసి.. 'నాకు నువ్వు వద్దు.. ఎందుకంటే.. నువ్వు మళ్లీ మళ్లీ తిడుతూనే ఉంటున్నావ్' అని అంది. నిజం చెప్పమని గట్టిగా అడిగితే.. తనకు వాళ్ల బావ ప్రపోజ్ చేశాడని చెప్పింది. పైగా తను మొదట వాళ్ల బావకి ప్రపోజ్ చేసిందట. ఆ విషయం నాకు ఇప్పుడు చెబుతోంది. కానీ.. తను లేకుండా నేను ఉండలేకపోతున్నా సార్. తన కాళ్ళు పట్టుకొని ఏడ్చాను. అయినా కూడా వినడం లేదు. తను నాకు కావాలి సార్ ఏం చెయ్యమంటారు?

– నరేష్

మేనరికం పెళ్లి చేసుకోకూడదని నేను చెప్పానని అమ్మాయికి చెప్పు!

'బావ లైన్ కట్ అవుతుందా సార్?'

ఏంటి నీలూ ఎందుకు కట్ కాదు.?? మేనరికం చేసుకుంటే వాళ్లకు పుట్టే పిల్లలు ఏదైనా ప్రాబ్లమ్‌తో పుట్టొచ్చు. ఆ ఒక్క కారణం చాలదా?

అయినా రేపు ఒక బిడ్డకు వాళ్ల మ్యారేజ్ వల్ల ప్రాబ్లమ్ వస్తే.. అలాంటి మ్యారేజ్ ఎందుకు చేసుకున్నామని డిస్టర్బ్ కారా నీలూ?

గట్టిగా చెప్పమను నీలూ..!

వివరించి చెప్పమను నీలూ..!

గూగుల్ అమ్మను అడిగి మరీ.. అన్ని విషయాలు తెలుసుకుని మరీ చెప్పమను నీలూ..!!

ఒక మంచి డాక్టర్‌ని కూడా సంప్రదించి అన్నీ డిటెయిల్స్ అమ్మాయి వాట్సాప్‌కి కానీ ఫేస్ బుక్ మెసేంజర్‌కి గానీ పంపమను నీలూ..!

ఎంతో బాగా రీసెర్చ్ చేసుకుని.. 'మేనరికం ఈజ్ డేంజరస్' అని చెప్పమను నీలూ...!!

'సార్..! మీరు అంతగా ఆవేశపడకండి సార్.. నరేష్ చెబుతాడు లే సార్!'

lovedoctorram@sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?




కట్‌చేయ్...దాచేయ్...

**రేపు చక్రి బర్త్‌డే**

**పల్లవి :**
చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే మెరే హాయ్
ఓలల్లా... గుండెల్ని గుల్ల చేసి
జారకే మెరే హాయ్
నీ ప్రేమ కోసం నేను పిచ్చోణ్ణైపోయానే
(2)
నీ కళ్లు పేలిపోను చూడవే మెరే హాయ్
॥చూపుల్తో॥

**చరణం : 1**
నీ ప్రేమ నాలో నింపే మైకమే
హాయ్ మైకమే
(2)
ఏదోలా కొత్తగా ఉంది లోకమే హాయ్ లోకమే
నిలువెల్లా నీరైపోయె దేహమే హాయ్ దేహమే
లైఫంతా అయిపోయింది భారమే హాయ్
నీ అందం అడవైపోను చూడవే మెరే హాయ్
ఓలల్లా
॥చూపుల్తో॥

**చరణం : 2**
నవ్వుల్తో పిండేస్తావు హృదయమే
హాయ్ హృదయమే
(2)
నిను విడిచి ఉండలేను
నిమిషమే హాయ్ నిమిషమే
సై అంటే చూపిస్తాను స్వర్గమే హాయ్ స్వర్గమే
ఛీ అంటే జిందగి మొత్తం నరకమే హాయ్
నీ ఈడు బీడైపోను చూడవే మెరే హాయ్
ఓలల్లా
॥చూపుల్తో॥

**చిత్రం : ఇడియట్ (2002)**
**రచన : కందికొండ**
**సంగీతం : చక్రి**
**గానం : శంకర్ మహదేవన్**

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 6 | | 5 | 9 | | | |
| | 2 | 8 | | | | 1 | | |
| 9 | 5 | 3 | | 2 | | | | |
| 2 | | 4 | | | 6 | | | 3 |
| 5 | 3 | 1 | | 4 | | 2 | 8 | 6 |
| 6 | | | 3 | | | 5 | | 4 |
| | | | | 7 | | 9 | 3 | 1 |
| | | 5 | | | | 4 | 2 | |
| | | | | 9 | | 8 | | 5 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 1 | 9 | 3 | 6 | 8 | 7 | 2 | 4 |
| 4 | 8 | 2 | 1 | 9 | 7 | 3 | 5 | 6 |
| 3 | 6 | 7 | 5 | 4 | 2 | 1 | 9 | 8 |
| 2 | 7 | 5 | 9 | 8 | 6 | 4 | 3 | 1 |
| 6 | 3 | 1 | 4 | 7 | 5 | 2 | 8 | 9 |
| 8 | 9 | 4 | 2 | 3 | 1 | 5 | 6 | 7 |
| 1 | 2 | 6 | 7 | 5 | 9 | 8 | 4 | 3 |
| 9 | 5 | 3 | 8 | 1 | 4 | 6 | 7 | 2 |
| 7 | 4 | 8 | 6 | 2 | 3 | 9 | 1 | 5 |


ప్రభాస్

## నేనున్నాను!

'బాధ అయినా, సంతోషం అయినా నాతో షేర్ చేసుకోవడానికి ఎవరూ లేరు' అని బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ అంటే... 'నేనున్నాను' అని భరోసా ఇస్తున్నారు ప్రభాస్. అంతేనా.. ప్రభాస్, శ్రద్ధాకపూర్‌లపై గన్స్‌తో ఎటాక్ జరుగుతున్నప్పుడు 'అసలు ఎవరు వీళ్లు?' అని శ్రద్ధ అడుగుతుంది... 'ఫ్యాన్స్' అని ప్రభాస్ సమాధానం. ఇంతలో శ్రద్ధ అక్కడి నుంచి వెళ్లాలని ప్రయత్నిస్తుంది. ఫైరింగ్ సౌండ్ రెట్టింపు అవుతుంది.. 'ఇంత వయొలెంట్‌గా ఉన్నారేంటి' అని ప్రభాస్‌ను ఆమె అడిగితే.. 'డైహార్డ్ ఫ్యాన్స్' అని సమాధానం చెబుతాడు ప్రభాస్. ఈ డైలాగ్స్‌తో పాటు కొన్ని యాక్షన్ సీన్లతో గురువారం విడుదలైన 'సాహో' టీజర్ అదిరిపోయిందని ప్రభాస్ ఫ్యాన్స్ అంటున్నారు. ప్రభాస్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సాహో'. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయికగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్నారు. ఇదివరకే ప్రభాస్, శ్రద్ధాకపూర్ లుక్స్‌ను రిలీజ్ చేసిన టీమ్ ఇటీవల 'షేడ్స్ ఆఫ్ సాహో చాప్టర్ 1', 'షేడ్స్ ఆఫ్ సాహో చాప్టర్ 2' వీడియోలను కూడా విడుదల చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా దాదాపు 98 సెకన్లు నిడివి ఉన్న 'సాహో' టీజర్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రాజమౌళి, నాగార్జున, రానా.. ఇలా పలువురు సినీ ప్రముఖులు 'సాహో' టీజర్‌ను ప్రశంసించారు. ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. త్వరలో ఆస్ట్రియాలో ప్రభాస్, శ్రద్ధాకపూర్‌లపై ఓ రొమాంటిక్ సాంగ్‌ను తీయబోతున్నారని తెలిసింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది.

## ప్రేమలో పడను


నాగార్జున

'నీకు షెటర్లు మూసేసి దుకాణం సర్దేసే వయసు వచ్చింది' అని నాగార్జునను ఉద్దేశించి నటి దేవదర్శిని అన్నప్పుడు ఆశ్చర్యపోవడం నాగార్జున వంతు. ఇంతలోనే 'ఇంత అందంగా పుట్టి ఏం ప్రయోజనం ఉండదురా!' అని బుజ్జగింపు. 'ఈ వయసులో మీకు పెళ్లేంటి సార్.. ఎండిపోయిన చెట్టుకు మళ్లీ నీళ్లు పోస్తే పూలు పూస్తాయా?' అని 'వెన్నెల' కిశోర్ కామెడీ పంచ్.. ఇలా అందరూ పంచ్‌లేస్తే నాగ్ చెప్పిన డైలాగ్ ఏంటో తెలుసా.. 'ఐ డోంట్ ఫాల్ ఇన్ లవ్. ఐ ఓన్లీ మేక్ లవ్'. నాగార్జున హీరోగా 'చిలసౌ' ఫేమ్ రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'మన్మథుడు 2'. ఇందులో రకుల్‌ప్రీత్ సింగ్ కథానాయికగా నటించారు. కథానాయికలు సమంత, కీర్తీ సురేశ్ అతిథి పాత్రల్లో కనిపిస్తారు. ఈ సినిమా టీజర్‌ను గురువారం విడుదల చేశారు. లక్ష్మీ, రావు రమేష్, నాజర్, ఝాన్సీ, దేవదర్శిని, 'వెన్నెల' కిశోర్ తదితరులు నటించిన ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందించారు. నాగార్జున, పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టు 9న విడుదల కానుంది.

## కాంబినేషన్ రిపీట్

బాలకృష్ణ–కె.ఎస్.రవికుమార్–సి.కల్యాణ్ కాంబినేషన్ మరోసారి రిపీట్ అవుతోంది. బాలకృష్ణ హీరోగా కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన 'జై సింహా' సినిమా గత ఏడాది జనవరిలో విడుదలైన విషయం తెలిసిందే. తాజాగా ఈ ముగ్గురి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న నూతన చిత్రం గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో హ్యాపీ మూవీస్ బ్యానర్‌పై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ బోయపాటి శ్రీను కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చారు. సీనియర్ దర్శకులు కోదండ రామిరెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. ''ఈ చిత్రానికి పరుచూరి మురళి చక్కని కథను అందించారు. జూలైలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది. చిరంతన్ భట్ సంగీతం, రామ్‌ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. రామ్–లక్ష్మణ్ పోరాట సన్నివేశాలు సినిమాకి హైలైట్‌గా ఉంటాయి. చిన్నా ఆర్ట్ వర్క్ అందిస్తున్నారు. త్వరలోనే ఇతర నటీనటుల వివరాలను తెలియజేస్తాం'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: సి.వి.రావ్.


బాలకృష్ణ, వీవీ వినాయక్

## కొంచెం ఆలస్యంగా..


రెహమాన్

రెహమాన్ తొలిసారి కథా రచయితగా, నిర్మాతగా మారిన చిత్రం '99 సాంగ్స్'. విశ్వేష్ కృష్ణమూర్తి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఎహన్ భట్, ఎడిల్సీ వర్గస్ హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. రెహమాన్ సంగీత దర్శకుడు. ఈ సినిమాను జూన్ 21న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావడంతో సినిమా విడుదల ఆలస్యం అవుతుందని రెహమాన్ తన ట్వీటర్ ద్వారా తెలిపారు. ''99 సాంగ్స్' సినిమా మీద మీరు చూపిస్తున్న ఆసక్తి, ప్రేమ మమ్మల్ని విపరీతమైన ఆనందానికి గురి చేస్తున్నాయి. పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్‌ఎక్స్ పనులు ఫుల్ స్పీడ్‌లో జరుగుతున్నాయి. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తాం'' అని తెలిపారు.


దీపికా పదుకోన్

## పారితోషికం 14 కోట్లు?

ఇండస్ట్రీలో పారితోషికంపరంగా కొన్ని లెక్కలుంటాయి. హీరో కంటే హీరోయిన్‌కు పెద్ద అంకెల్లో చెక్కులు అందేవి కావు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. మార్కెట్ ఉన్న యాక్టర్స్‌కు అదే రేంజ్‌లో పారితోషికాలు అందుతున్నాయి. తాజాగా '83' సినిమా కోసం దీపికా పదుకోన్ 14 కోట్ల వరకూ తీసుకుంటున్నారని తెలిసింది. 1983 క్రికెట్ వరల్డ్ కప్ ఆధారంగా కబీర్ ఖాన్ తెరకెక్కిస్తున్న చిత్రం '83'. ఇందులో కపిల్ దేవ్ పాత్రలో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్నారు. కపిల్ దేవ్ భార్య రోమీ భాటియా పాత్రలో దీపికా పదుకోన్ కనిపిస్తారు. వివాహం తర్వాత రణ్‌వీర్– దీపికా కలసి నటిస్తున్న సినిమా ఇదే. తొలిసారి ప్రపంచకప్ గెలిచిన నేపథ్యంతో పాటు దీపిక– రణ్‌వీర్ మళ్లీ కలసి నటించడంతో ఈ ప్రాజెక్ట్‌పై స్పెషల్ క్రేజ్ ఏర్పడింది. దీంతో దీపికా 14 కోట్లు వరకూ తీసుకుంటున్నారనుకోవచ్చు. అన్నట్లు 'పద్మావత్' సినిమాకి అందులో నటించిన రణ్‌వీర్, షాహిద్ కపూర్‌లకన్నా దీపికానే ఎక్కువ పారితోషికం తీసుకున్నారు. ఇక '83' షూట్‌లో జాయిన్ అయ్యే ముందు రోమీ భాటియాతో కొంత సమయం గడిపి ఆ కథను తన కోణం నుంచి అర్థం చేసుకోవాలనుకుంటున్నారట దీపిక. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

## హాయ్ హైదరాబాద్

హిందీ హీరోలు అజయ్ దేవగణ్, అక్షయ్ కుమార్ హైదరాబాద్‌కు చాలాసార్లు హాయ్ చెప్పారు. ఇప్పుడు మళ్లీ చెప్పబోతున్నారు. ఎందుకంటే ఈ ఇద్దరి చిత్రాల షూటింగ్ ఇక్కడ జరగనుంది. అజయ్ దేవగణ్ నటిస్తున్న 'భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా' సినిమా కోసం ఇక్కడి ఓ ప్రముఖ స్టూడియోలో గుజరాత్ ప్రదేశాలను సెట్ వేయిస్తున్నారు. అది కూడా 1970 కాలం నాటివి కావడం విశేషం. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ ఈ సెట్‌లో త్వరలో ప్రారంభం కానుంది. 1971 ఇండియా–పాకిస్థాన్ కార్గిల్ వార్ సమయంలో గుజరాత్‌లోని భుజ్ ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన ఆధారంగా ఈ సినిమాను అభిషేక్ దుదియా తెరకెక్కిస్తున్నారు.

### బ్యాంకాక్ నుంచి డైరెక్ట్‌గా...

పది నిమిషాల యాక్షన్ సన్నివేశాల కోసం దాదాపు వారం రోజులు బ్యాంకాక్‌కు షిఫ్ట్ అయ్యారు అక్షయ్ కుమార్ అండ్ టీమ్. ఇప్పుడు బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చనున్నారు. రోహిత్ శెట్టి దర్శకత్వంలో అక్షయ్ కుమార్ హీరోగా 'సూర్యవన్షీ' అనే చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కత్రినా కైఫ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో ప్రారంభం కానుంది. కొన్ని యాక్షన్ సన్నివేశాలతో పాటుగా ఓ రొమాంటిక్ సాంగ్‌ను కూడా షూట్ చేయనున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ కానుంది.


అజయ్ దేవగణ్


అక్షయ్ కుమార్

## కెమిస్ట్రీ కుదిరింది


అంజలి

అంజలి, లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రల్లో ఆదిత్ అరుణ్ ప్రత్యేక పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆనంద భైరవి'. కర్రి బాలాజీ దర్శకత్వం వహిస్తున్నారు. హరివేన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఇటికేల రమేష్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా మొదటి షెడ్యూల్ వైజాగ్ పరిసర ప్రాంతాల్లో పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కర్రి బాలాజీ మాట్లాడుతూ– ''ఆనందిని పాత్రలో అంజలి ఒదిగిపోయారు. ఆ పాత్ర కోసం చాలా స్లిమ్ అయ్యారు. ఒక మధ్యతరగతి అమ్మాయి పాత్రలో తన హావభావాల్ని ప్రదర్శిస్తున్నప్పుడు ఆశ్చర్యపోయా. ఆ పాత్ర కోసం స్కూటీ రైడ్ చేస్తున్న సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నప్పుడు స్కూటీ మీదనుంచి పడటంతో ఆమెకు గాయాలయ్యాయి. అయినా షూటింగ్‌లో పాల్గొన్నారు. సెకండ్ షెడ్యూల్‌లో లక్ష్మీ రాయ్‌పై యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తాం'' అన్నారు. ''అందమైన విశాఖపట్నంలో అంజలి, ఆదిత్ అరుణ్‌లపై కర్రి బాలాజీ చిత్రీకరించిన ప్రేమ సన్నివేశాలు ఆహ్లాదకరంగా ఉన్నాయి. పృథ్వీ, బ్రహ్మాజీ, గుండు సుదర్శన్, జయవాణిలపై చిత్రీకరించిన కామెడీ సన్నివేశాలు బాగా వచ్చాయి. తర్వాతి షెడ్యూల్‌ని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తాం'' అని ఇటికేల రమేష్ రెడ్డి అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సురేష్ దత్తి, కెమెరా: పీజీ విందా, సంగీతం: మణిశర్మ.

## కొండల్లో థ్రిల్


ఆర్య, కేథరిన్

ఆర్య, కేథరిన్ థెరిస్సా జంటగా రాఘవ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కదంబన్'. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా తమిళంలో ఘన విజయం సాధించి, ఆర్య కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని లక్ష్మీ వెంకటేశ్వర ఫ్రేమ్స్ పతాకంపై ఉదయ్ హర్ష వడ్డెల్ల 'గజేంద్రుడు' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ఉదయ్ హర్ష వడ్డెల్ల మాట్లాడుతూ– ''ఓ కొండ ప్రాంతాల్లో ఉండే గిరిజన పుత్రులుగా హీరో, హీరోయిన్ నటించారు. సినిమా అంతా కూడా కొండ ప్రాంతంలో ఉంటూ ఆద్యంతం థ్రిల్‌కి గురి చేసేలా ఉంటుంది. ఈ సినిమా కోసం ఆర్య బాగా బరువు పెరిగారు. కేథరిన్, ఆర్య జంట తెరపై కనువిందు చేస్తుంది'' అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: భారతి వరప్రసాద్ వడ్డెల్ల.


ఆండీ రాబర్ట్స్, మహేశ్‌బాబు

## ఫ్యాన్ మూమెంట్

హీరో మహేశ్‌బాబుకు ఫ్యాన్స్ నంబర్ ఇంత అని చెప్పలేం. ఎప్పటికప్పుడు ఆ నంబర్ అప్‌డేట్ అవుతూ పెరుగుతూ ఉంటుంది. అంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న మహేశ్ తానే అభిమానిలా మారిపోయి వెస్టిండీస్ క్రికెటర్ ఆండీ రాబర్ట్స్‌తో ఫొటో దిగారు. ప్రస్తుతం మహేశ్ హాలిడే మూడ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవలే లండన్‌లో భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌ను లైవ్‌లో మహేశ్ వీక్షించిన సంగతి గుర్తుండే ఉంటుంది. సో.. మహేశ్ అక్కడే ఈ ఫొటో దిగి ఉండవచ్చు. ఇక.. ఈ ఫారిన్ ట్రిప్ కంప్లీట్ కాగానే 'సరిలేరు నీకెవ్వరూ' సినిమా షూట్‌లో జాయిన్ అవుతారు మహేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.


భూమిక

## కంటిని నమ్మొద్దు

రెండేళ్ల క్రితం నాని 'ఎమ్‌సీఏ' (మిడిల్‌క్లాస్ అబ్బాయి) చిత్రంతో ఫుల్‌లెంగ్త్ క్యారెక్టర్ ఆర్టిస్టుగా కెరీర్‌ను స్టార్ట్ చేశారు భూమిక. గత ఏడాది తమిళ, తెలుగు ద్విభాషా చిత్రం 'యు–టర్న్', 'సవ్యసాచి' చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించారు. ఇప్పుడు మళ్లీ తమిళంలో మరో సినిమా చేయడానికి అంగీకరించారు. ఉదయనిధి స్టాలిన్ హీరోగా తమిళంలో తెరకెక్కుతున్న చిత్రం 'కన్నై నంబాదే'. (కంటిని నమ్మొద్దు అని అర్థం) మారన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ఆత్మిక కథానాయికగా నటిస్తున్నారు. ఈ థ్రిల్లింగ్ మూవీలోనే ఓ కీలక పాత్ర చేయనున్నారు భూమిక. ''సినిమాలో మంచి ఎమోషనల్ కంటెంట్ ఉంది. సినిమాకు భూమిక పాత్ర హైలైట్‌గా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమా కాకుండా మరికొన్ని సినిమాలకు భూమిక కథలు వింటున్నారట.


సాయి శ్రీవి, రవిచంద్ర, యుగేష్

## ప్రేమించడం ప్రమాదం

'ఈ 2 మనసులు' చిత్రంతో సినిమా నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టారు వ్యాపారవేత్త ఎస్. చంద్రశేఖర్. ఆ చిత్రం నిర్మాణంలో ఉండగానే 'ఇష్క్ ఈజ్ రిస్క్' అంటూ మరో చిత్రానికి శ్రీకారం చుట్టారాయన. రవిచంద్ర, యుగా యుగేష్, సాయి శ్రీవి ముఖ్య తారలుగా రాజ్ కింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. జేయస్టార్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్స్ సమర్పణలో శేఖర్ మూవీస్ పతాకంపై ఎస్.చంద్రశేఖర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ– ''లవ్ ఎంటర్‌టైనర్ రూపొందుతోన్న చిత్రమిది. హాస్యానికి పెద్ద పీట వేశాం. చక్కని టీమ్ కుదిరింది'' అన్నారు. ''దర్శకుడిగా ఇది నా రెండో చిత్రం. ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చిన చంద్రశేఖర్‌గారికి థ్యాంక్స్. యువతరంతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు రాజ్ కింగ్. ఈ చిత్రానికి కెమెరా: జగన్. ఏ, సంగీతం: డేవిడ్.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం
14-6-2019

ఫ్యాషన్

# పట్టు ఏదైనా ఇలా కట్టు

పట్టుచీర అనగానే ఒక అలవాటైన సాంప్రదాయక కట్టు ఊహలోకొస్తుంది. కానీ ఫ్యాషన్ డిజైనర్లు అందమైన ఊహ చేసి కొత్త కట్టును మనకు చూపిస్తున్నారు. ఇక్కడ ఉన్నవన్నీ పట్టుచీరలే. ఇండో వెస్ట్రన్ సమ్మేళనంలో ఆకట్టుకుంటున్న కట్టులివి.



పుత్తడిబొమ్మను తలపించే కంచిపట్టు కట్టు.. గాడీగా కాకుండా సింపుల్‌గానూ అదే సమయంలో అద్భుత సింగారంగానూ కితాబులు కొట్టేస్తుంది. ఈ స్టైల్‌కి రెట్రోస్టైల్ బ్లౌజ్, పవిట కొంగు, ఆభరణాల ఎంపిక, ముడివేసిన కేశాలంకరణ ప్రధానమైనవి.

యుద్ధనారిలా కనిపించే ఆకర్షణీయ కట్టు ఇది. పట్టు స్కర్ట్ మీద కుడివైపుకు కుచ్చిళ్లు పెట్టి, ఎడమవైపు భుజం మీదుగా ముందుకు తీసుకువచ్చిన పల్లూ.. క్లోజ్డ్ రౌండ్ నెక్ ప్లెయిన్ బ్లౌజ్.. కట్టును భిన్నంగా చూపుతుంది.

బ్లాక్ కలర్ కంచిపట్టు చీరకు బంగారు రంగు కోర్‌సెట్ పూర్తి వెస్టర్న్ లుక్‌ని తీసుకు వచ్చింది. దీనికి జత చేసే ఫ్యాషన్ జువెల్రీ, కేశాలంకరణ కూడా చీరకట్టు అందాన్ని రెట్టింపు చేస్తుంది.

బంగారు రంగు కంచిపట్టు చీరకు అదే రంగు విక్టోరియన్ కోర్‌సెట్‌ను బ్లౌజ్‌గా ధరించారు బాలీవుడ్ నటి కంగనా రనౌత్. దీనికి అదే రంగు పెప్లమ్ బెల్ట్‌ని జత చేయడంతో చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఇటీవల కేన్స్ ఉత్సవాలలో ఇలా మెరిసారు కంగనా.

జంప్‌సూట్ మీద కంచిపట్టు చీరతో ఆహూతులను ఆశ్చర్యపరిచారు లాక్మేఫ్యాషన్ వీక్‌లో బాలీవుడ్ నటి సుస్మితాసేన్. ఇండోవెస్టర్న్ లుక్‌తో ఆకట్టుకునేలా డిజైనర్స్ సెట్ చేసిన కట్టు ఇది.

రెట్రో స్టైల్ చీరకట్టు ఎప్పుడూ ఎవర్‌గ్రీన్ మార్కులు కొట్టేస్తుంది. త్రీ బై ఫోర్త్ స్లీవ్స్‌తో బ్లౌజ్, ఎక్కువ కుచ్చులతో పవిట.. కట్టడి చేసే కేశాలంకరణ రాణికళను తీసుకు వస్తుంది.

చీరకట్టులో చిన్న మార్పు మరింత స్టైల్‌గా చూపుతుంది. పవిట కొంగును కుచ్చుళ్ల అంచులను టచ్ చేస్తూ తీస్తే ఓ స్టైల్. దానికి ప్లెయిన్ కాలర్ బ్లౌజ్ ధరిస్తే.. న్యూలుక్‌తో ఆకట్టు కుంటారు.

నిర్వహణ:
నిర్మలారెడ్డి

## కాస్మటాలజీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్



### అవాంఛిత రోమాలను తొలగించుకోవడం ఎలా?



నా వయసు 24 ఏళ్లు. నా ముఖమంతా అవాంఛిత రోమాలున్నాయి. మరో నాలుగైదు నెలల్లో నాకు పెళ్లి నిర్ణయించారు. బ్లీచింగ్ చేయించుకుంటే వెంట్రుకలు రంగు మారతాయేమోనని ఆందోళనగా ఉంది. థ్రెడ్డింగ్ చేయించుకోవచ్చా? నా సమస్యకు తగిన పరిష్కారం సూచించండి.

**- సుమ, కాకినాడ**

అవాంఛిత రోమాల సమస్యకు అనేక కారణాలు ఉంటాయి. కొందరిలో ఇది జన్యుపరంగా వచ్చే సమస్య. అయితే మరికొందరిలో హార్మోన్ల అసమతౌల్యత వల్ల ఈ సమస్య వస్తుంది. ఒకవేళ మీకు హార్మోనల్ ఇంబ్యాలెన్స్ వల్ల ఇది వస్తే... ఆ సమస్యను చక్కదిద్దడం ద్వారా మీ అవాంఛిత రోమాలు ఆటోమేటిగ్గా తొలగిపోతాయి.

ఇకపోతే బ్లీచింగ్ లేదా హెయిర్ రిమూవల్ క్రీమ్స్ వాడటం వల్ల ఒక్కోసారి చర్మంపై రియాక్షన్ వచ్చే అవకాశం ఉంటుంది. లేజర్ హెయిర్ రిడక్షన్ చికిత్సతో మీ సమస్యను సులభంగా పరిష్కరించవచ్చు. ఆ ప్రక్రియ వల్ల పైన మీరు పేర్కొన్న విధానాలనూ అవలంబించాల్సిన అవసరమూ ఉండదు.

### జుట్టు విపరీతంగా రాలుతోంది... పరిష్కారం చెప్పండి

నా వయసు 24 ఏళ్లు. నాకు విపరీతంగా జుట్టు రాలిపోతోంది. గత కొద్ది నెలలుగా ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంది. మా నాన్నగారికి కూడా బట్టతల ఉంది. నాకు కూడా బట్టతల వస్తుందేమోననే ఆందోళన ఇటీవల బాగా ఎక్కువైంది. నాకు బట్టతల రాకుండా ఏవైనా జాగ్రత్తలు తీసుకోవచ్చా? దయచేసి చెప్పండి.

**- ఆర్. సత్యం, హైదరాబాద్**

బట్టతల రావడానికి జన్యుపరమైన కారణాలు కూడా ప్రధానమైనవే అయినప్పటికీ... మీ నాన్నగారికి బట్టతల ఉన్నంతమాత్రాన మీకు తప్పనిసరిగా రావాలని ఏమీ నియమం లేదు. ఎందుకంటే ఒక్కోసారి బట్టతలను సంక్రమింపజేసే జీన్స్ మీలో ఎక్స్‌ప్రెస్ కాకపోవచ్చు. జుట్టు రాలిపోవడానికి అనేక కారణాలు ఉంటాయి. సమతుల ఆహారం తీసుకోకపోవడం, తీవ్రమైన ఒత్తిడికి లోనుకావడం వంటివి జుట్టు రాలడానికి దోహదం చేసే కారణాల్లో ముఖ్యమైనవి. మీకు ఏ కారణాల వల్ల జుట్టు రాలుతోందో కనుక్కుంటే, దానికి దూరంగా ఉండటం ద్వారా జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. ఒకవేళ పోషకాహార లోపం వల్ల జుట్టు రాలుతుంటే, మంచి ఆహారం తీసుకోవడంతో పాటు మీలో లోపించిన పోషకాలను... సంబంధిత సప్లిమెంట్ల ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. మీకు ఒకసారి కాస్మటాలజిస్ట్‌ను సంప్రదించి, మీకు జుట్టు రాలడానికి గల కారణాలను నిర్ధారణ చేసుకోండి. దాన్ని బట్టి చికిత్స ఉంటుంది.



### గరుకైన ముఖం నునుపు కావడం ఎలా?



నా వయసు 29 ఏళ్లు. ఇప్పుడు మొటిమలు రావడం లేదుగానీ... ఒకప్పుడు నాకు చాలా ఎక్కువగా మొటిమలు వచ్చేవి. వాటి కారణంగా నా ముఖం బాగా గరుకుగా తయారైంది. నా ఫేస్ నునుపుగా ఉండాలన్నది నా కోరిక. దానికి ఏమైనా చికిత్సలు ఉన్నాయా? దయచేసి వివరించండి.

**- రాధిక, సికింద్రాబాద్**

మీ సమస్యను యాక్నె స్కారింగ్ అంటారు. మీకు సమస్య తీవ్రతను బట్టి చికిత్స ఉంటుంది. ఇందులో కొన్ని అడ్వాన్స్‌డ్ ప్రక్రియలు అంటే... ఉదాహరణకు డెర్మా నిడిలింగ్, డెర్మాబ్రేషన్, కెమికల్ పీల్స్ వంటి చికిత్స ప్రక్రియల ద్వారా ఇది సాధ్యపడుతుంది. మీరు ఒకసారి కాస్మటాలజిస్ట్‌ను సంప్రదించి, మీకు ఏ ప్రక్రియ అవసరమో నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుంది. కాస్మటాలజిస్ట్‌లు మీకు అవసరమైన చికిత్సను సూచిస్తారు.

### చికెన్‌పాక్స్ మచ్చలు తొలగిపోతాయా?

నా వయసు 20 ఏళ్లు. రెండేళ్ల కిందట నాకు చికెన్‌పాక్స్ వచ్చాయి. నాకు తెలియకుండానే గిల్లడం వల్ల నా ముఖమంతా మచ్చలు ఏర్పడ్డాయి. ఆ మచ్చల కారణంగా నలుగురిలోకి వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. మచ్చల కారణంగా ముఖం నల్లగా కూడా కనిపిస్తుండటంతో ఆత్మన్యూనతగా ఫీలవుతున్నాను. నా సమస్యకు ఏదైనా పరిష్కారం సూచించండి.

**- ఆర్. సత్యవతి, కొత్తగూడెం**

మీరు వచ్చిన మచ్చలను పోస్ట్ ఇన్‌ఫ్లమేటరీ హైపర్‌పిగ్మెంటేషన్ అంటారు. ఈ మచ్చలు సూర్యరశ్మికి ఎక్స్‌పోస్ కావడం వల్ల మరింత నల్లబడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉదయం పది గంటల నుంచి మధ్నాహ్నం మూడింటి వరకు సూర్యకిరణాల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. అదువల్ల ఆ టైమ్‌లో బయటకు వెళ్లాల్సివస్తే మీకు ఎస్‌పీఎఫ్ 30 ఉన్న సన్‌స్క్రీన్స్ వాడటం తప్పనిసరి. దాంతో పిగ్మెంటేషన్‌ను కొంతవరకు అదుపు చేయవచ్చు. మచ్చలు పూర్తిగా తొలగించడానికి కెమికల్ పీల్స్ అనే చికిత్స చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు మరికొన్ని పూతమందులూ వాడటం అవసరం. అయితే ఈ చికిత్సను పూర్తిగా కాస్మటాలజిస్ట్‌ల పర్యవేక్షణలోనే చేయాల్సి ఉంటుంది.



**డాక్టర్ సుభాషిణి జయం,** చీఫ్ కాస్మటాలజిస్ట్,
ఎన్‌ఛాంట్ మెడికల్ కాస్మటాలజీ క్లినిక్, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్

## పరి పరిశోధన

### పగలు బస్సు.. రాత్రి లారీ!



బస్సు అంటే.. కేవలం ప్రయాణీకుల కోసమే అని మనకు తెలుసు. అలాగే సరుకుల కోసం లారీలు ఉన్నాయి! ఇలా కాకుండా.. ఒకపూట బస్సులా.. ఇంకో పూట లారీలా వ్యవహరించే వాహనముంటే ఎలా ఉంటుంది? అచ్చం ఫొటోలో ఉన్న స్కానియా ఎన్ఎక్స్‌టీ మాదిరిగా ఉంటుంది. ఆశ్చర్యంగా అనిపిస్తోందా? వివరాలు చూసేద్దాం. స్వీడన్ కంపెనీ స్కానియా ఇటీవలే ఈ ఎన్ఎక్స్‌టీ కాన్సెప్ట్ వాహనాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. దీనిని పగటిపూట బస్సులా వాడుకోవచ్చు. అంటే ప్రయాణీకుల రవాణాకు ఉపయోగించుకోవచ్చు. రాత్రి అవగానే పైనున్న బాడీ మొత్తం పక్కకు తప్పుకుని.. వీధుల్లోని చెత్త మొత్తాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలించే లారీగా మార్చేయవచ్చు. ప్రజా రవాణాపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో దీన్ని ఇటీవలే ప్రదర్శించారు. పూర్తిగా విద్యుత్తుతోనే నడుస్తుంది కాబట్టి కాలుష్యమన్న మాటే లేదు. ఒకే ఛాసిస్ రెండు రకాల పనులకు ఉపయోగపడుతుంది. రద్దీ సమయాల్లో లారీల వాడకాన్ని తగ్గించడం ఇంకో లాభం. చెత్త బయటపడేసేందుకు మాత్రమే కాకుండా మన అవసరాలకు తగ్గట్టు అన్ని ఆకారాల బాడీలను కూడా దీనికి బిగించుకోవచ్చు. దాదాపు ఎనిమిది మీటర్ల పొడవున్న బస్సులో 55 మంది ప్రయాణించవచ్చు. ఒకసారి ఛార్జ్ చేస్తే 245 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. పైకప్పుపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్, అన్నివైపులా చూడగలిగే అత్యాధునిక కెమెరాలు వంటివన్నీ అదనపు హంగులు!

### వేలాడే పట్టీతో.. ఉపగ్రహాలకు గాలం!



అంతరిక్షంలో ఊరికే తిరుగుతూ ఉన్న ఉపగ్రహాలు, వాటి శకలాల సంఖ్య ఎంతో మీకు తెలుసా? అక్షరాలా 5000000. ఇన్ని వ్యర్థ పదార్థాల్లో కొద్దిగా సైజున్న ఏ ఒక్కటి భూమ్మీదకు చేరినా.. కొత్తగా ప్రయోగిస్తున్న ఉపగ్రహాలను తాకినా.. బోలెడంత నష్టం. ఈ చెత్త అంతటిని తొలగించేందుకు లేదా తగ్గించేందుకు శాస్త్రవేత్తలు చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా స్పెయిన్ శాస్త్రవేత్తలు ఓ వినూత్నమైన పద్ధతిని ఆవిష్కరించారు. మనిషి వెంట్రుక కంటే పలుచనైనా, రెండు సెంటీమీటర్ల వెడల్పు.. కొన్ని కిలోమీటర్ల పొడవు ఉన్న అల్యూమినియం పట్టీపై ఓ ప్రత్యేక పదార్థం పూత పూయడం.. కొత్తగా ప్రయోగించే ఉపగ్రహాలను ఈ పట్టీతో చుట్టేయడం ఈ కొత్త పద్ధతిలోని కీలక అంశం. ఈ ఏర్పాటు ఉన్న ఉపగ్రహాలు అంతరిక్షంలోకి చేరి జీవితకాలం ముగించుకున్న తరువాత పట్టీ ఉపగ్రహానికి వేలాడేలా ఏర్పాట్లు ఉంటాయి. ప్రత్యేక పదార్థపు పూత కారణంగా భూ అయస్కాంత క్షేత్రం ఈ పట్టీపై పని చేయడం మొదలవుతుంది. పట్టీ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి జరిగి ఉపగ్రహంలోని మోటార్లకు అందుతుంది. దాంతో ఉపగ్రహాలు తాము న్న స్థానం నుంచి కిందకు దిగడం ప్రారంభిస్తాయి. ఈ క్రమంలో భూమ్మీది నుంచి పంపే సంకేతాల ద్వారా వాటిని నియంత్రించి నిరపాయకరంగా తొలగించవచ్చు.



### అవార్డు గెలిచాడు... మనసుల్ని గెలిచాడు

టాంటన్: పాకిస్తాన్‌పై శతక్కొట్టిన వార్నర్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. ఈ అవార్డు అందుకుని వెళ్తున్న అతను ఉన్నట్లుండి దాన్ని ఓ కుర్రాడికి ఇచ్చి అందరి మనసుల్ని గెలిచాడు. గ్యాలరీలో ఆసీస్ టీమ్ జెర్సీ వేసుకున్న పిల్లవాడికి అవార్డు ఇవ్వడంతో ఆ కుర్రాడు, అతని తండ్రి తెగ సంబరపడ్డారు. ఆసీస్ తమ తదుపరి మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడుతుంది. లండన్‌లో శనివారం ఈ మ్యాచ్ జరుగుతుంది.





## బోపన్న జంట సంచలనం

**స్టుట్‌గార్ట్:** మెర్సిడెస్ కప్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్‌లో తన భాగస్వామి డెనిస్ షపోవలోవ్ (కెనడా)తో కలిసి భారత స్టార్ రోహన్ బోపన్న సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. జర్మనీలోని స్టుట్‌గార్ట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న–షపోవలోవ్ ద్వయం 6–4, 6–3తో సోంగా–లుకాస్ పుయి (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. అంతకుముందు తొలి రౌండ్‌లో బోపన్న–షపోవలోవ్ జంట 6–4, 3–6, 10–6తో దిగ్గజ డబుల్స్ జోడీ బాబ్ బ్రయాన్–మైక్ బ్రయాన్ (అమెరికా)పై సంచలన విజయం సాధించింది.

## బ్యాడ్మింటన్‌కు లీ చోంగ్ వీ వీడ్కోలు



భార్యతో లీ చోంగ్ వీ

**పుత్రజయ (మలేషియా):** అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో ఓ శకం ముగిసింది. మలేసియా దిగ్గజ క్రీడాకారుడు, ప్రపంచ మాజీ నంబర్‌వన్ లీ చోంగ్ వీ తన 19 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 'రిటైర్‌మెంట్ నిర్ణయం నా జీవితంలో చాలా కఠినమైనది. నాకు బ్యాడ్మింటన్ అంటే చాలా ఇష్టం. టోక్యో ఒలింపిక్స్ తర్వాత రిటైర్ అవ్వాలనుకున్నాను, కానీ ఇంత త్వరగా కెరీర్‌ను ముగుస్తున్నందుకు చాలా బాధగా ఉంది. ఎప్పుడూ నా వెన్నంటే ఉండి నాకు మద్దతు తెలిపిన అభిమానులకు, కోచ్‌లకు నా ధన్యవాదాలు' అంటూ లీ చోంగ్ వీ గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నాడు. 348 వారాల పాటు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా కొనసాగినా... లీ చోంగ్ వీకి ఒలింపిక్స్ స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ అందని ద్రాక్షలా మిగిలిపోయాయి. మూడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో (2011, 2013, 2015), మూడుసార్లు ఒలింపిక్స్‌లో (2008, 2012, 2016) ఫైనల్‌కు చేరినా తుదకు అతను రజత పతకాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ముక్కు సంబంధిత క్యాన్సర్ బారిన పడిన లీ చోంగ్ వీ గత సంవత్సరం చికిత్స తీసుకున్నాడు. చికిత్స ముగిశాక కెరీర్‌ను కొనసాగించాలని ఆశించాడు. అయితే మళ్లీ రాకెట్ పట్టలేకపోయాడు. అతని ర్యాంకింగ్ 191వ స్థానానికి పడిపోయింది. టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలు తక్కువగా ఉండటంతో ఆటకు వీడ్కోలు పలికాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో లీ చోంగ్ వీ 69 సింగిల్స్ టైటిల్స్ సాధించాడు.

## మనకూ తగిలింది

# వరుణుడి దెబ్బ

**వర్షం కారణంగా న్యూజిలాండ్‌తో మ్యాచ్ రద్దు ● రెండు జట్లకు చెరో పాయింట్**



చిత్తడిగా మారిన మైదానం

**నాటింగ్‌హామ్:** ప్రపంచ కప్‌ను నీడలా వెంటాడుతున్న వరుణుడు భారత్‌కూ అడ్డుతగిలాడు. దీంతో గురువారం ఇక్కడ న్యూజిలాండ్‌తో టీమిండియా ఆడాల్సిన మ్యాచ్ రద్దయింది. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. తొలుత తడిగా ఉన్న ఔట్ ఫీల్డ్, శీతల వాతావరణ ప్రభావంతో టాస్ ఆలస్యమైంది. అరగంట తర్వాత సిద్ధమవబోతుండగా వాన ప్రారంభమైంది. సాధారణ పరిస్థితుల్లో అయితే ఇదేమంత అడ్డంకి కాకపోయేది. కానీ, మంగళ, బుధవారాల్లో నాటింగ్‌హామ్‌లో కురిసిన భారీ వర్షాలకు ట్రెంట్‌బ్రిడ్జ్ మైదానం ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. దీనికి గురువారం వాన తోడవడం, ఎండ ఏమాత్రం లేకపోవడంతో మ్యాచ్ ఆడే వీల్లేకపోయింది. 'వచ్చారు... చూశారు... వెళ్లారు' తరహాలో అప్పటికీ ఇంగ్లండ్ కాలమానం ప్రకారం 11.30కు, 12.30కు అంపైర్లు మైదానాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో చివరి సారిగా పరిస్థితిని సమీక్షించి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. నాలుగు మ్యాచ్‌ల ద్వారా (మూడు విజయాలు, ఒక రద్దు) ఏడు పాయింట్లు సాధించిన న్యూజిలాండ్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 'టాప్'లో ఉండగా, మూడు మ్యాచ్‌లాడిన భారత్ రెండు విజయాలు, ఒక మ్యాచ్ రద్దుతో ఐదు పాయింట్లతో మూడో స్థానానికి చేరింది. గత మూడు ప్రపంచ కప్‌లలో భారత్, కివీస్ జట్ల మధ్య మ్యాచ్ జరగలేదు. చివరిసారి 2003 కప్‌లో సెంచూరియన్ వేదికగా టీమిండియా నెగ్గింది. కప్‌లో ఇరు జట్ల మధ్య మొత్తం ఏడు మ్యాచ్‌లు జరగ్గా భారత్ మూడు, కివీస్ నాలుగు గెలిచాయి. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మ్యాచ్ నేపథ్యంలో... గురువారం మ్యాచ్ సాగి ఉంటే టీమిండియాకే ఎక్కువ ప్రయోజనకరంగా ఉండేది. కీలక ఓపెనర్ శిఖర్ ధావన్ దూరమైన నేపథ్యంలో కూర్పును పరీక్షించుకునే అవకాశమూ చిక్కేది.

### పాక్‌తో మ్యాచ్‌కు సైతం ముప్పు!

వారం వ్యవధిలో టోర్నీలో వర్షం కారణంగా రద్దయిన నాలుగో మ్యాచ్ ఇది. వీటిలో మూడింట టాస్ అయినా పడకపోగా, మరోదాంట్లో గంటకు మించి ఆట సాగలేదు. వాతావరణం చూస్తుంటే శుక్రవారం నాటి వెస్టిండీస్, ఇంగ్లండ్ మ్యాచ్ సహా ఇదే బాటలో మరిన్ని మ్యాచ్‌లు ప్రభావితం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్, ఇంగ్లండ్ జట్లు ఆడిన మ్యాచ్‌లకు మాత్రమే వర్షం ఎదురవ్వలేదు. అన్నింటికీ మించి టోర్నీకే పెద్ద ఆకర్షణ అయిన భారత్–పాకిస్తాన్ మ్యాచ్‌కూ వరుణుడి గండం తప్పేలా లేదు. మాంచెస్టర్‌లో ఆదివారం ఈ మ్యాచ్ జరగాలి. నాటింగ్‌హామ్‌కు వందపైగా కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ అక్కడ సైతం వాతావరణం ఇదే తీరుగా ఉంది.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 4 | 3 | 0 | 1 | 2.163 | 7 |
| ఆస్ట్రేలియా | 4 | 3 | 1 | 0 | 0.570 | 6 |
| భారత్ | 3 | 2 | 0 | 1 | 0.539 | 5 |
| ఇంగ్లండ్ | 3 | 2 | 1 | 0 | 1.307 | 4 |
| శ్రీలంక | 4 | 1 | 1 | 2 | -1.517 | 4 |
| వెస్టిండీస్ | 3 | 1 | 1 | 1 | 2.054 | 3 |
| బంగ్లాదేశ్ | 4 | 1 | 2 | 1 | -0.714 | 3 |
| పాకిస్తాన్ | 4 | 1 | 2 | 1 | -1.654 | 3 |
| దక్షిణాఫ్రికా | 4 | 0 | 3 | 1 | -0.952 | 1 |
| అఫ్గానిస్తాన్ | 3 | 0 | 3 | 0 | -1.493 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

### అభిమానుల ఆవేదన...

ప్రతిష్టాత్మక ప్రపంచ కప్‌లో వర్షం అభిమానులకు మరో రూపంలో ఆవేదన మిగులుస్తోంది. ఐసీసీ నిబంధనల ప్రకారం మ్యాచ్ ప్రారంభం కాకుంటే ప్రేక్షకులకు టిక్కెట్ డబ్బు వెనక్కిస్తారు. అయితే, ఎక్కువశాతం మంది బ్లాక్‌లో టిక్కెట్లు కొంటున్నారు. దీంతో మ్యాచ్ రద్దయినా వీరికి డబ్బు తిరిగి రావడం లేదు. 'కివీస్‌తో మ్యాచ్‌కు రూ.70 వేలు పెట్టి బ్లాక్‌లో టిక్కెట్ కొన్నా. ఇదంతా పోయినట్లే. పాక్‌తో మ్యాచ్‌కైతే రూ.1.80 లక్షలు చెబుతున్నారు. నేను దీనిని భరించే స్థితిలో లేను' అని సింగపూర్ నుంచి వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాపోయాడు. మరోవైపు 'మేం నాలుగు రోజులైంది సూర్యుడిని చూసి...! భారత్‌తో మ్యాచ్ రద్దు మాకేం ఆశ్చర్యం కలిగించలేదు. విశ్రాంతి దొరుకుతున్నందున ఒకందుకు ఇది మంచిదే అనుకోవాలి' అని న్యూజిలాండ్ కెప్టెన్ విలియమ్సన్ అన్నాడు.



డ్రెస్సింగ్ రూమ్‌లో కోహ్లి నిరీక్షణ

### చెరో పాయింట్ సంతోషమే

'కివీస్‌తో మ్యాచ్ రద్దు సరైన నిర్ణయమే. విజయాలు సాధించి ఉన్నాం కాబట్టి చెరో పాయింట్ దక్కడం ఏమంత ఇబ్బందికరమేం కాదు. పాక్‌తో ఆదివారం మ్యాచ్ గురించి ఆలోచిస్తున్నాం. మా ప్రణాళికలు మాకున్నాయి. మైదానంలో వాటిని అమలు చేయాలి. ధావన్ చేతికి కొన్ని వారాల పాటు ప్లాస్టర్ తప్పనిసరి. లీగ్ మ్యాచ్‌ల చివరి దశలో లేదా సెమీస్‌కు అతడు అందుబాటులోకి వస్తాడు. అతడు తిరిగి ఆడాలని కోరుకుంటున్నా' అని కోహ్లి పేర్కొన్నాడు.

## పసిడిపై గురి

- రికర్వ్ విభాగంలో ఫైనల్‌కు చేరిన భారత పురుషుల ఆర్చరీ జట్టు
- 14 ఏళ్ల తర్వాత ఈ ఘనత

**ఎస్–హెర్టోజెన్‌బాష్ (నెదర్లాండ్స్):** ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత పురుషుల ఆర్చరీ జట్టు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అద్వితీయ ప్రదర్శనతో అదరగొట్టింది. బుధవారం క్వార్టర్ ఫైనల్‌కు చేరి టోక్యో ఒలింపిక్స్ బెర్త్ ఖాయం చేసుకున్న భారత బృందం... గురువారం మరో రెండు విజయాలు సాధించి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ప్రవీణ్ రమేశ్ జాదవ్‌లతో కూడిన భారత బృందం క్వార్టర్ ఫైనల్లో 6–0తో చి చుంగ్ టాన్, యు చెంగ్ డెంగ్, చున్ హెంగ్ చెలతో కూడిన చైనీస్ తైపీ జట్టును ఓడించింది. భారత్ తొలి సెట్‌ను 55–52తో, రెండో సెట్‌ను 55–48తో, మూడో సెట్‌ను 55–54తో గెల్చుకుంది. ఒక్కో సెట్‌కు రెండు పాయింట్ల చొప్పున ఇస్తారు. సెమీఫైనల్లో భారత జట్టు 'షూట్ ఆఫ్'లో వాన్ డెన్ బెర్గ్, వాన్ డెర్ వెన్, స్టీవ్ విజ్లెర్‌లతో కూడిన నెదర్లాండ్స్ జట్టుపై గెలిచింది. తొలి సెట్‌ను నెదర్లాండ్స్ 56–54తో, రెండో సెట్‌ను భారత్ 52–49తో, మూడో సెట్‌ను నెదర్లాండ్స్ 57–56తో, నాలుగో సెట్‌ను భారత్ 57–55తో గెల్చుకున్నాయి. దాంతో స్కోరు 4–4తో సమమైంది. విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్'ను నిర్వహించగా... భారత్ 29–28తో నెదర్లాండ్స్‌ను ఓడించి ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. 14 ఏళ్ల తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు ఫైనల్ చేరింది. చివరిసారి 2005లో భారత్ ఫైనల్ చేరి తుది పోరులో 232–244తో కొరియా చేతిలో ఓడి రజతం దక్కించుకుంది. చివరిసారి ఫైనల్ చేరిన నాటి భారత జట్టులోనూ తరుణ్‌దీప్ రాయ్ సభ్యుడిగా ఉండటం విశేషం. ఆదివారం జరిగే ఫైనల్లో చైనాతో భారత్ పోటీపడుతుంది.

### కాంస్య పతక పోరుకు జ్యోతి సురేఖ

మహిళల కాంపౌండ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ విశేషంగా రాణించింది. ఆమె రెండు కాంస్య పతకాల కోసం పోటీపడనుంది. జ్యోతి సురేఖ, ముస్కాన్, రాజ్ కౌర్‌లతో కూడిన భారత మహిళల కాంపౌండ్ జట్టు సెమీఫైనల్లో 226-227తో అమెరికా చేతిలో ఓడిపోయింది. అంతకుముందు తొలి రౌండ్‌లో బై పొందిన భారత్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 236-226తో ఫ్రాన్స్‌పై... క్వార్టర్ ఫైనల్లో 219-213తో నెదర్లాండ్స్‌పై గెలిచింది. శనివారం జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో టర్కీతో భారత్ ఆడుతుంది. మరోవైపు వ్యక్తిగత విభాగంలోనూ జ్యోతి సురేఖ కాంస్యం కోసం బరిలో ఉంది. సెమీఫైనల్లో జ్యోతి సురేఖ 140-143తో పియర్స్ ఫైజి (అమెరికా) చేతిలో ఓడిపోయింది. శనివారం జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో యాసిమ్ బోస్టాన్ (టర్కీ)తో సురేఖ ఆడుతుంది. సురేఖ క్వార్టర్ ఫైనల్లో 147-141తో సారా ప్రీల్స్ (బెల్జియం)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 'షూట్ ఆఫ్'లో తాంజా జెన్సన్ (డెన్మార్క్)పై, మూడో రౌండ్‌లో 146-143తో బోమిన్ చోయ్ (దక్షిణ కొరియా)పై విజయం సాధించింది.



# ఇంగ్లండ్‌కు సవాల్

వెస్టిండీస్ చివరిసారిగా ప్రపంచ కప్ గెలిచింది 1979లో...! అది కూడా ఫైనల్లో ఇంగ్లండ్‌పై విజయంతో! ఆ తర్వాత రెండు జట్లు గత 40 ఏళ్లలో కప్‌లో మరో ఐదుసార్లు ఎదురుపడ్డాయి. కానీ, వెస్టిండీస్‌కు ఇంగ్లండ్‌పై నెగ్గడం గగనమైంది. ప్రస్తుతం మరోసారి అమీతుమీకి సిద్ధమయ్యాయి. మరి... పైచేయి టోర్నీ హాట్ ఫేవరెట్, మోర్గాన్ నేతృత్వంలోని ఆతిథ్య జట్టుదా? హోల్డర్ సారథ్యంలోని కరీబియన్లదా? నేడే చూడాలి...!

**నేడు సౌతాంప్టన్‌లో వెస్టిండీస్‌తో మ్యాచ్**

- ఆసక్తికరం గేల్–ఆర్చర్ పోరాటం
- పొంచిఉన్న వర్షం ముప్పు

మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



**సౌతాంప్టన్:** ప్రపంచ కప్‌లో ఓ ఆసక్తికర సమరం. ధనాధన్ ఆటకు పేరుగాంచిన ఇంగ్లండ్–వెస్టిండీస్‌లు సౌతాంప్టన్‌లోని రోజ్‌బౌల్ మైదానం వేదికగా శుక్రవారం తలపడనున్నాయి. ఆతిథ్య జట్టు భీకర ఫామ్‌తో అదరగొడుతున్నా, సమష్టిగా ఆడితే ఎలాంటి ప్రత్యర్థినైనా ఓడించే సత్తా ఉన్నవారు కరీబియన్లు. కప్‌లో ఇరు జట్లకు ఇది నాలుగో మ్యాచ్. రెండు విజయాలు, ఒక ఓటమితో ఇంగ్లండ్ నాలుగు పాయింట్లతో ఉండగా, ఒక విజయం, ఒక ఓటమి, ఒక మ్యాచ్ రద్దుతో విండీస్ ఖాతాలో మూడు పాయింట్లున్నాయి. ఇటీవలి కాలంలో వన్డేల్లో ఇంగ్లండ్‌కు దీటుగా నిలిచినది వెస్టిండీసే కావడం గమనార్హం. వీటి మధ్య ఫిబ్రవరిలో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2–2తో సమమవడమే దీనికి నిదర్శనం. మరోవైపు విండీస్ దీవుల్లోని ఓ భాగమైన బార్బడోస్‌లో జన్మించి ఇంగ్లండ్‌కు ఆడుతున్న పేసర్ జోఫ్రా ఆర్చర్‌ను యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ ఎలా ఎదుర్కొంటాడన్నది ఈ మ్యాచ్‌లో ఆసక్తికర అంశం కానుంది. కీలక బ్యాట్స్‌మన్ జాస్ బట్లర్ ఫిట్‌నెస్ సాధించడం ఇంగ్లండ్‌కు ఊరటనిస్తోంది. ఆల్‌రౌండర్ ఆంద్రీ రసెల్ మోకాలి గాయం విండీస్‌ను కలవరపరుస్తోంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో అతడు లేకుండానే జట్టు బరిలో దిగింది. రసెల్ కోలుకుంటే తప్పక ఆడించాలని జట్టు భావిస్తోంది.

### ముఖాముఖి రికార్డు

ఇరు జట్లు ఇప్పటివరకు 101 మ్యాచ్‌ల్లో ఎదురుపడ్డాయి. ఇంగ్లండ్ 51 మ్యాచ్‌ల్లో గెలుపొందగా... వెస్టిండీస్ 44 గెలిచింది. ఆరుమ్యాచ్‌లు రద్దయ్యాయి. ప్రపంచ కప్‌లో మాత్రం ఇంగ్లండ్‌దే పూర్తిగా పైచేయి. విండీస్‌తో ఆరుసార్లు తలపడగా... ఐదుసార్లు ఇంగ్లండే నెగ్గింది. ఒక్కదాంట్లోనే కరీబియన్లు (1979 ప్రపంచ కప్ ఫైనల్) విజయం సాధించగలిగారు.

### జోరులో మోర్గాన్ సేన

టోర్నీ తొలి మ్యాచ్‌లో సఫారీలను తేలిగ్గానే ఓడించిన ఇంగ్లండ్‌కు రెండో మ్యాచ్‌లో పాకిస్తాన్ షాకిచ్చింది. ఈ ప్రభావం నుంచి వెంటనే కోలుకున్న ఆ జట్టు బంగ్లాదేశ్‌పై భారీ విజయం సాధించింది. పేస్, అదనపు బౌన్స్‌తో ప్రత్యర్థి పేసర్లు కాట్రెల్, థామస్, హోల్డర్ మంచి లయలో బౌలింగ్ చేస్తుండటంతో నేటి మ్యాచ్ వారికి సవాలే కానుంది. ఓపెనర్ జేసన్ రాయ్, జో రూట్, బట్లర్ ఫామ్‌లో ఉండటంతో మిగతా వారు పెద్దగా పరుగులు చేయకున్నా సాగిపోతోంది. మరో ఓపెనర్ బెయిర్ స్టో, కెప్టెన్ మోర్గాన్ తమ స్థాయి ఇన్నింగ్స్ బాకీ ఉన్నారు. బౌలింగ్‌లో ఆర్చర్ ఏమాత్రం అవకాశం లేనంతగా బంతులేస్తున్నాడు. రషీద్ స్పిన్ మధ్య ఓవర్లలో కీలకం. మొదట బ్యాటింగ్ దక్కితే ఇంగ్లండ్‌ను అందుకోవడం ఎవరి తరం కాదు.



గేల్

### విండీస్‌కు బ్యాటింగే బెంగ

బౌలింగ్ ఎంత బలంగా ఉందో... విండీస్ బ్యాటింగ్ అంత అనిశ్చితితో సాగుతోంది. ఆస్ట్రేలియాతో మ్యాచ్ బ్యాట్స్‌మెన్ వైఫల్యం కారణంగానే చేజారింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ రద్దు జట్టు అవకాశాలకు కొంత గండి కొట్టింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌పై గెలుపు కీలకం కానుంది. విధ్వంసక క్రిస్ గేల్ ఇంకా పూర్తిస్థాయిలో విజృంభించలేదు. ఓపెనర్ ఎవిన్ లూయిస్ ఫామ్‌లో లేడు. భారీ స్కోర్లు చేయాలన్నా, ఛేదించాలన్నా వీరితో పాటు కుర్రాళ్లు పూరన్, హెట్‌మైర్ రాణించాల్సి ఉంటుంది. సౌతాంప్టన్‌లో శుక్రవారం వర్షం కురిసే అవకాశం ఉంది. దీని ప్రభావం మ్యాచ్‌పై పడొచ్చు.

# ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...



**నేడు జపాన్‌తో భారత్ సెమీఫైనల్**

- గెలిస్తే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత

**భువనేశ్వర్:** ఈ ఏడాది చివర్లో జరిగే టోక్యో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌కు అర్హత సాధించేందుకు భారత హాకీ జట్టు విజయం దూరంలో నిలిచింది. ఆసియా క్రీడల చాంపియన్ జపాన్‌తో నేడు జరిగే అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సిరీస్ ఫైనల్స్ సెమీఫైనల్లో భారత్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. సొంత ప్రేక్షకుల మధ్య ఆడనుండటం భారత్‌కు కలిసొచ్చే అంశం. కొత్త కోచ్ గ్రాహమ్ రీడ్ శిక్షణలో ఇప్పటికే గ్రూప్ మ్యాచ్‌లను భారీ గోల్స్ తేడాతో గెలవడం ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. గ్రూప్ మ్యాచ్‌లలో రష్యా, ఉజ్బెకిస్తాన్‌లపై 10–0తో, పోలాండ్‌పై 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. ముఖ్యంగా భారత మిడ్‌ఫీల్డ్ చురుకుగా కదులుతూ గోల్స్ చేసే అవకాశాలను సృష్టిస్తోంది. అయితే ఆ అవకాశాలను గోల్స్‌గా మలచడంలో కాస్త ఇబ్బంది పడుతున్నా సెమీఫైనల్ మ్యాచ్‌లో భారతే ఫేవరెట్‌గా కనబడుతోంది. 'మా జట్టు ఆటతీరు పట్ల నేను సంతోషంగా ఉన్నాను. గోల్స్ చేసే అవకాశాలను సృష్టిస్తున్నా కొన్నిసార్లు వాటిని లక్ష్యానికి చేర్చడంలో తడబడుతున్నారు. ఈ అంశంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది' అని కోచ్ గ్రాహమ్ అన్నారు. చివరిసారిగా జపాన్‌తో ఈ ఏడాది జరిగిన అజ్లాన్ షా టోర్నీలో తలపడిన భారత్ 2–0తో విజయాన్ని అందుకుంది.

## విండీస్ పర్యటనలో ముందుగా టి20లు

**రెండు టెస్టులు, మూడు వన్డేలు ఆడనున్న భారత్**

**సెయింట్ జాన్స్:** ఈ ఏడాది భారత్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో ముందుగా వెస్టిండీస్‌తో తలపడుతుంది. ఆగస్టులో విండీస్ పర్యటనకు వెళ్లే టీమిండియా ముందుగా మూడు టి20లు ఆడుతుంది. అయితే ఆగస్టు 3, 4 తేదీల్లో జరిగే రెండు టి20లు అమెరికాలోని ఫ్లోరిడాలో నిర్వహిస్తారు. 6న ఆఖరి మ్యాచ్ వెస్టిండీస్‌లోని గయానాలో జరుగుతుంది. అనంతరం మూడు వన్డేల సిరీస్ అదే వేదికపై (ఆగస్టు 8) మొదలవుతుంది. రెండు, మూడో వన్డేలు 11, 14 తేదీల్లో ట్రినిడాడ్‌లో జరుగుతాయి. టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఆగస్టు 22 నుంచి 26 వరకు ఆంటిగ్వాలో, రెండో టెస్టు 30 నుంచి సెప్టెంబర్ 3 వరకు జమైకాలో నిర్వహిస్తారు. విండీస్‌లో భారత పర్యటన మెగా ఈవెంట్ ముగిసిన వెంటనే జరగాల్సింది. ఆటగాళ్లకు విశ్రాంతి కావాలని బీసీసీఐ కోరడంతో కాస్త వెనక్కి జరిపారు.

## హమ్మయ్య.. బడి దొరికింది!

• సాక్షి ఎఫెక్ట్



బడిలో పాఠాలు చెబుతున్న హెచ్‌ఎం

**కేసముద్రం:** మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండల కేంద్రం శివారు బ్రహ్మంగారి తండాలో ప్రాథమిక పాఠశాల పిల్ల లు, ఉపాధ్యాయుడు బడికోసం చేసిన కృషి ఫలించింది. వీరి పాఠశాలకు గత ఏడాది గది ఇచ్చిన యజ మాని ఈ సారి ఇవ్వకపోవడంతో పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా బుధవారం వారు గదులకోసం తండా మొత్తం తిరిగిన విషయం విదితమే. చివరకు ఉపాధ్యాయుడు చెట్టు కిందే పాఠాలు బోధించారు. ఈ విషయమై 'సాక్షి'ప్రధాన సంచికలో గురువారం 'బడి కోసం వెతుకులాట'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఈఓ.. ఎంఈఓ కాంతారావుతో సమస్యపై ఆరా తీశారు. పిల్లలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంఈఓను ఆదేశించడంతో పాటు కేసముద్రం పీఎస్‌కు విద్యార్థులను పంపించాలని సూచించారు. కానీ అది దూరమవుతుందని తండా పెద్దలు గుగులోతు భద్రు, బానోతు బాలునాయక్, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ ఇస్లావత్ తిరుపతి తదితరులు హెచ్‌ఎం వెంకటేశ్వర్లుతో మొరపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది గది ఇచ్చిన యజమానితో మాట్లాడి కొద్దిరోజులు పాఠశాల నిర్వహణకు ఒప్పించారు. దీంతో చెట్టు కింద నుంచి బడి గదిలోకి మారింది.

## బకాయిల కోసం ఇంటి తలుపులు స్వాధీనం

**సైదాపూర్(హుజూరాబాద్):** కరీంనగర్ జిల్లాలో సహకార సంఘాల రుణాల వసూళ్లలో అధికారులు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. రుణాలు చెల్లించని పక్షంలో ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించిన వెన్కపల్లి సహకార సంఘం అధికారులు ఇళ్ల తలుపులు స్వాధీనం చేసుకునే పనిలో పడ్డారు. లక్షలాది రూపాయలు బకాయిలు ఉన్న వారిని పట్టించుకోని అధికారులు రైతులపై తమ అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ, వారి పరువు తీస్తున్నారు. సైదాపూర్ మండలం గొడిశాల, రాములపల్లి, ఎలబోతారం గ్రామాల్లో గురువారం మొండి బకాయిల వసూలుకు కార్యక్రమం చేపట్టారు. కొన్నేళ్లుగా బకాయిపడిన వారి ఇంటికెళ్లి డబ్బులు కట్టడం లేదని ఇంటి తలుపులు స్వాధీనం చేసుకున్నారు. కొందరు రైతులు అక్కడికక్కడే కొంత డబ్బులు చెల్లించి తలుపులు తీసుకున్నారు. సంఘం వద్దకు వచ్చి డబ్బులు చెల్లించిన వారి తలుపులు తిరిగి ఇస్తున్నామని సూపర్‌వైజర్ విజయ్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**కథలాపూర్(వేములవాడ):** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలిగోట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, రైతు గంగం జనార్దన్‌రెడ్డి(55) అప్పుల బాధతో గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జనార్దన్‌రెడ్డికి గ్రామశివారులో ఏడెకరాల భూమి ఉంది. వర్షాలు సరిగా లేక బోర్లలో నీళ్లు అడుగంటిపోవడంతో పంటలు పండలేదు. ఈ క్రమంలోనే కూతురు పెళ్లికి అప్పులు చేశాడు. పంటల సాగుకు చేసిన పెట్టుబడి రుణాలతోపాటు కూతురు పెళ్లికి చేసిన అప్పులు రూ.15 లక్షలకు చేరుకున్నాయి. ఈ యేడు సైతం వర్షాలు కురిసేలా లేవని.. అప్పు తీర్చే మార్గం లేదని మనోవేదనకుగురై ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య సత్తవ్వ, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## నేడు టీఎస్‌ఐసెట్ ఫలితాల విడుదల

**కేయూ క్యాంపస్:** రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2019–20 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు గత నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన టీఎస్ఐసెట్–2019 పరీక్షల ఫలితాలను శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విడుదల చేయనున్నట్లు టీఎస్‌ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ రాజేశం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ పరిపాలనా భవనం సెనేట్ హాల్‌లో జరిగే ఫలితాల విడుదల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ టి.పాపిరెడ్డి, కేయూ వీసీ ఆర్.సాయన్న పాల్గొంటారని పేర్కొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

NIT NO.EE/16-18/Tender Notice/2019, తేది : 10-06-2019.

దిగువ పనులు చేపట్టుట కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. 1) (NIT No.16) కరీంనగర్ జిల్లాలో రూ.72.90 లక్షలతో 4 దేవాలయాలు అభివృద్ధి చేయుట. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు ముగింపు తేది (దాఖలు) : 17.06.2019 నుండి 02.07.2019. 2) (NIT No.17) ఆదిలాబాద్ జిల్లాలో రూ.48 లక్షలతో 4 దేవాలయాలు అభివృద్ధి చేయుట. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ మరియు ముగింపు తేది (దాఖలు) : 19.06.2019 నుండి 04.07.2019. & 3) 1 వరంగల్ రూరల్, 1 వరంగల్ అర్బన్ జిల్లాలలో రూ.100 లక్షలతో 2 దేవాలయాలు అభివృద్ధి చేయుట. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ మరియు ముగింపు తేది (దాఖలు) : 19.06.2019 నుండి 04.07.2019 మరింత సమాచారం కొరకు https://tender.telangana.gov.in ను దర్శించండి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్

DIPR RO.No.303-DP/CL/Advt/1/2019-20, Dt:13.06.2019.

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
లేఖ సంఖ్య : 914/2019/A3 షార్ట్ టెండర్ నోటీసు తేది : 11-06-2019.

ఖమ్మం జిల్లాలోని హరితహారం కార్యక్రమాలు అటవీ ప్రాంతము మరియు ఇతర ప్రదేశముల నందు నాటుటకు Gusseted పాలిథిన్ బ్యాగ్స్ సరఫరా కొరకు అడవుల విభాగం, అర్బన్ బయోవర్సిటీ, జి.హెచ్.సి. లేదా రాష్ట్ర ప్రభుత్వ లేదా కేంద్ర ప్రభుత్వ ఆర్గనైజేషన్ నుండి రిజిస్ట్రేషన్ చేసుకొన్న అధీకృత కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్ కోరబడుచున్నవి. వివరాలు కొరకు జిల్లా అటవీ అధికారి, ఖమ్మం ఆఫీస్ వేళలో సంప్రదించండి. ఫోన్ నెం. : 08742-298098. టెండర్ ఫారములు రూ.1000/- డి.డి. మరియు EMD 25000/- జిల్లా అటవీ అధికారి ఖమ్మం పేరున ఏ దేని నేషనల్ బ్యాంకు, ఖమ్మంలో చెల్లుబాటు అయ్యే విధంగా చెల్లించి తేది. 14.06.2019 నుండి 21.06.2019 ఉ.12.00గం. వరకు అన్ని పని దినముల యందు కార్యాలయము వేళల్లో జిల్లా అటవీ అధికారి, ఖమ్మం నుండి పొందవచ్చును. టెండరు స్వీకరణ చివరి తేది. 21.06.2019 సమయము మధ్యాహ్నం 1.00గం.వరకు. అధీకృత కాంట్రాక్టర్లు మాత్రమే టెండర్ వేయుటకు అర్హులు. టెండర్లు తేది : 21.06.2019 మధ్యాహ్నం 5.00 AN గం. జిల్లా అటవీ అధికారి కార్యాలయం / జాయింట్ కలెక్టర్ కార్యాలయం, ఖమ్మంలో తెరవబడును.

సం/- జిల్లా అటవీ అధికారి, ఖమ్మం

DIPR RO.No.305-DP/CL/Advt/1/2019-20, Dt:13.06.2019.

తెలంగాణ ప్రభుత్వము
అటవీ శాఖ
T.No. 01/2019-20/S5 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 10.06.2019

2019–20 కాలంలో నల్గొండ డివిజన్‌లోని మునుగోడు మరియు నల్గొండ రేంజ్‌లలోని తక్కెళ్ళపల్లి మరియు చిట్యాల బీట్స్‌లోని వివిధ ప్రదేశాలలో మర్రిగూడ మరియు చిట్యాల మండలాలలోని CA ఏరియాల చుట్టూ ఐరన్ యాంగులర్ పోల్స్‌తోపాటు చెయిన్ లింక్ మెష్ ఫెన్సింగ్ యొక్క స్థాపన కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండరు కోరబడుతుంది. **అంచనా కాంట్రాక్టు విలువ: రూ. 225.848 లక్షలు.** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్: 17.06.2019న సా. 04.00 గం.ల నుండి, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 24.06.2019న మ. 02.00 గం.ల వరకు, టెండరు దాఖలుకు ఆఖరి తేది: 24.06.2019 మ. 03.00 గం. వరకు, సాంకేతిక బిడ్ తెరుచుట: 24.06.2019న మ. 03.30 గం., ధర బిడ్ తెరుచుట: 24.06.2019న సా. 04.00 గం. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును.

సం/- ఫారెస్ట్ డివిజినల్ ఆఫీసర్, నల్గొండ

DIPR Ro. No. 294-DP/CL/Advt/1/2019-20, Dt: 13/06/2019.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్య మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్

1) e-proc. Notice No.51/SE/TS/TUFIDC/Sathupalli/ General/2019-20/ 65, తేది : 12.06.2019. పనిపేరు : సత్తుపల్లి మున్సిపాలిటీలో వివిధ ప్రాంతాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం మరియు వైకుంఠదామం నిర్మాణం. ECV : రూ.296.67 లక్షలు. బిడ్ల డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేది : 14.06.2019 నుండి 21.06.2019. 2) e-proc. Notice No.51/SE/TS/TUFIDC/Yellandu/General / 2019-20/66, తేది : 12.06.2019. పనిపేరు : ఎల్లందు మున్సిపాలిటీలో మోడల్ మార్కెట్ నిర్మాణం. ECV : రూ.657.21 లక్షలు. బిడ్ల డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేది : 14.06.2019 నుండి 29.06.2019. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in ను దర్శించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH), TUFIDC, యూనిట్ -I, వరంగల్

DIPR RO.No.293-DP/CL/Advt/1/2019-20, Dt:13.06.2019.

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి
SE-II సర్కిల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ADV. No.09/TA/SE-II/TTD/Tpt/2019-20 తేది: 12-06-2019

SE-II సర్కిల్‌లో ఇరవై ఐదు (25) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి. NIT నంబర్లు దిగువ విధంగా ఉన్నవి:

| | | |
|---|---|---|
| S.E-II | NIT నం.లు: 65 నుండి 77/SE-II/2019-20 | (13 పనులు) |
| E.E-I | NIT నం.లు: 46 మరియు 47/EE-I/2019-20 | (2 పనులు) |
| E.E-V | NIT నం.లు: 30 నుండి 34/EE-V/2019-20 | (5 పనులు) |
| E.E-IX | NIT నం.లు: 29 నుండి 33/EE-IX/2019-20 | (5 పనులు) |

వివరాల కోసం www.tirupati.org కి లేదా www.tirumala.org కి లాగాన్ చేయండి. పని వివరాల కోసం https://tender.eprocurement.gov.inకు లాగిన్ చేయండి.

Roc. No.PR4/13907/Adv.No.112/PRO/2019, Dt: 13-06-2019 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Prathiba Bhavan, M.J.Road, Nampally, Hyderabad.
ASSISTANT PROFESSORS (Clinical Departments)
IN DIRECTOR OF MEDICAL EDUCATION
(General Recruitment) Notification No. 49/2017
RESULT NOTIFICATION FOR INTERVIEW

The Commission published the list of provisionally admitted candidates for INTERVIEW (Oral Test) to the post of Assistant Professors (Clinical Departments) in Director of Medical Education. The interviews will be held in the office of TSPSC at Prathibha Bhavan, Nampally, Hyderabad from **24.06.2019 to 26.06.2019.**

For the List of candidates provisionally admitted for interview and specialty wise interview Schedule and further details, candidates can visit the Commission's Website **www.tspsc.gov.in**

Hyderabad Sd/-
Date: 12.06.2019 SECRETARY

DIPR RO.NO. 153-PP/CL/ADVT/1/2019-20, dt 13/06/2019


# అడవి నుంచి గెంటేశారు..

• బలవంతంగా గిరిజనుల తరలింపు
• కాగజ్‌నగర్ ఫారెస్టు అధికారుల దాష్టీకం
• తిండితిప్పలు లేక 16 కుటుంబాల అవస్థలు



కలప డిపోలో ఉన్న గిరిజనులు



కొలాంగూడలో కూల్చిన గిరిజనుల నివాసాలు

**కాగజ్‌నగర్:** గిరిజనులపై అటవీ అధికారుల దౌర్జన్యాలు హెచ్చు మీరుతున్నాయి. కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం కొలాంగొంది గిరిజనులను అటవీ అధికారులు అడవి నుంచి గెంటేశారు. నివాసాలను కూల్చివేసి సామగ్రితో సహా పంపేయడంతో కలప డిపోలో గిరిజనులు తలదాచుకుంటున్నారు. 20 ఏళ్లుగా ఇక్కడే ఉంటూ సమీపంలో పోడు వ్యవసాయం చేసుకుంటూ నివాసముంటున్న మొత్తం 16 గిరిజన కుటుంబాలను రిజర్వు ఫారెస్టు భూమి పేరుతో అధికారులు ఖాళీ చేయించారు. గిరిజనులు ఉంటున్న స్థలం రిజర్వు ఫారెస్టు భూమిగా పేర్కొంటూ అటవీ అధికారులు గతంలో చాలాసార్లు సర్వేలు నిర్వహించారు. గతంలోనే ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులు ప్రత్యామ్నాయంగా వేరే చోట వ్యవసాయ భూమి, డబుల్ బెడ్‌రూం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ సమయంలోనే గిరిజనుల నుంచి సంతకాలు కూడా తీసుకున్నారు. మరోవైపు అటవీ శాఖ భూమిలో పోడు వ్యవసాయం చేస్తున్నారని పేర్కొంటూ 2017లో 13 మంది గిరిజనులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

**కోర్టు తీర్పు రాకముందే..!**

గతంలో సర్వేలు చేసిన అటవీ అధికారులు ఖాళీ చేయాలని గిరిజనులకు నోటీసులు కూడా జారీ చేశారు. దీనిపై గిరిజనులు అప్పట్లో కాగజ్‌నగర్‌కు చెందిన న్యాయవాదిని సంప్రదించడంతో ఆయన వారి తరుపున హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చట్ట ప్రకారం గిరిజనులకు పునరావాసం కల్పించాలని ఈ ఏడాది మార్చి 25న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనికి అటవీ అధికారులు కౌంటర్ ఫైల్ దాఖలు చేశారు. 2013 నుంచి మాత్రమే గిరిజనులు ఇక్కడ నివాసముంటున్నారని కోర్టుకు నివేదిక అందజేశారు. చట్ట ప్రకారం 2006కు ముందు నుంచి ఉంటున్న వారికే హక్కులు వర్తిస్తాయని పేర్కొన్నారు. కొలాంగొంది గిరిజనులకు ఎలాంటి హక్కులు లేవని అటవీ అధికారులు వాదించారు. మంగళవారం కేసు వాదనకు రావడంతో ఒక రోజు గడువు కావాలని సదరు న్యాయవాది కోరినట్లు సమాచారం. ఆ మరుసటి రోజు బుధవారం అటవీ అధికారులు జీపీఆర్‌ఎస్ మ్యాప్ ఆధారంగా అక్కడ ఎలాంటి నివాసాలు లేవని, ఎప్పుడో తరలించామని సూచించి కోర్టును తప్పుదోవ పట్టించినట్లు తెలిసింది. అది నిజం చేయడానికే అటవీ శాఖ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా గిరిజనులను కాగజ్‌నగర్ కలప డిపోకు తరలించారు. కోర్టు ఆదేశాల ప్రకారమే ఖాళీ చేయించామని తెలుపుతున్న అటవీ అధికారులు సదరు కాపీ ఇవ్వాలని కోరగా స్పందించడం లేదు.

**ఆగమేఘాల మీద తరలింపు..**

బుధవారం ఉదయం కొలాంగొందికి వచ్చిన అటవీ అధికారులు గిరిజనులను బలవంతంగా జీపులో ఎక్కించి కాగజ్‌నగర్ కలప డిపోకు తరలించారు. వారికి సంబంధించి పూరి గుడిసెలను ధ్వంసం చేశారు. అధికారులు అక్రమంగా తమను ఖాళీ చేయించారని, కలప డిపోలో తిండి లేక గోస పడుతున్నామని వాపోతున్నారు.

### కోర్టు ఆదేశాల మేరకే..



కోర్టు ఆదేశాల మేరకే గిరిజనులను తరలించాం. గిరిజనులు చెప్పే మాటల్లో వాస్తవం లేదు. గత నాలుగైదేళ్ల నుంచి మాత్రమే ఉంటున్నారు. ముందు గిరిజనులే కోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత హైకోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చట్ట పరిధిలో చర్యలు తీసుకున్నాం. పునరావాసం కోసం ఉట్నూర్ ఐటీడీఏ పీవో కృష్ణ ఆదిత్యకు నివేదిక పంపాం. అప్పటి వరకూ గిరిజనులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– రాజరమణారెడ్డి, ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

### నివాసాలు కూల్చేశారు..



అన్నం కూడా తిననివ్వకుండా మా నివాసాలను కూల్చివేశారు. మా తాతల నుంచి చేస్తున్న భూమిలోనే సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గతంలో మాకు తెలియకుండా సంతకాలు తీసుకున్నారు. ఇల్లు, సాగు భూమి, పంట రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. ఇప్పుడేమో ఒక్కసారిగా నిలువ నీడ లేకుండా చేశారు. రెండ్రోజులుగా అన్నం, నీళ్లు కూడ దొరకడం లేదు.

– సిడాం మధురావు, కొలాంగొంది

### చెట్టుకొకలం.. పుట్టకొకలం అయ్యాం..

మాకు ఉన్న నీడను అధికారులు కూల్చివేశారు. మేం ఇప్పుడు ఎలా బతికేది. దౌర్జన్యంగా ఇళ్లను కూల్చివేశారు. ఇప్పుడు మేం చెట్టుకొకలం, పుట్టకొకలం అయ్యాం.

– సిడాం బాపురావు, కొలాంగొంది



గట్టు భీముడి భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న కేటీఆర్

# గట్టు భీముడికి కన్నీటి వీడ్కోలు

• అంత్యక్రియలకు హాజరైన కేటీఆర్
• పాడె మోసిన మంత్రి నిరంజన్‌రెడ్డి

**గట్టు:** టీఆర్‌ఎస్ నేత, గద్వాల మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడికి టీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బల్గెరలో నిర్వహించిన గట్టు భీముడి అంత్యక్రియలకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై నివాళులర్పించారు. గట్టు భీముడి కుటుంబానికి పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీనిచ్చారు. టీఆర్‌ఎస్ పార్టీ మంచి బీసీ నాయకుడిని కోల్పోయిందన్నారు. ఇదే క్రమంలో గట్టు భీముడి సతీమణి భువనేశ్వరి తమ కుటుంబానికి తీరని అన్యాయం జరిగిందని, మాకు న్యాయం చేయాలని కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యవహారం అంతా పూర్తయిన తర్వాత మంత్రి నిరంజన్‌రెడ్డిని కలవాలని, ఆయన ద్వారా మీకు న్యాయం చేస్తామని కేటీఆర్ చెప్పారు. అంత్యక్రియల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్ గట్టు భీముడి పాడెను మోశారు. ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం, జెడ్పీ చైర్మన్ సరిత భీముడికి నివాళులర్పించారు.

## సెప్టిక్ ట్యాంక్‌లో పడ్డ ఇద్దరు విద్యార్థినులు

**పటాన్‌చెరు ప్రభుత్వ పాఠశాలలో ఘటన**

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో ప్రమాదవశాత్తు ఇద్దరు విద్యార్థినులు పడిపోయారు. దీంతో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. నాలుగో తరగతి చదువుతున్న లావణ్య, వైష్ణవి మధ్యాహ్నం 3 గంటల సమయంలో బాత్రూం పక్కన ఉన్న సెప్టిక్ ట్యాంక్ కప్పుపై నిలబడ్డారు. ఈ క్రమంలో ట్యాంక్ పై కప్పు ఒక్కసారిగా విరిగిపోవడంతో వారిద్దరు అందులో పడిపోయారు. దీన్ని గమనించిన ఉపాధ్యాయులు విద్యార్థులను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అయితే వైష్ణవికి స్వల్ప గాయాలు కాగా, లావణ్యకు కాలు విరిగిపోయింది. తాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని కూతురు లావణ్యకు విద్యాశాఖ అధికారులు చికిత్స చేయించాలని ఆమె తల్లి కోరింది.

## 'పరిహారం చెక్కుల' నిందితుడి అరెస్టు

**విచారణలో నేరం ఒప్పుకున్న సందీప్**

**సిద్దిపేట కమాన్:** మల్లన్నసాగర్ పరిహార చెక్కును దొంగిలించి డబ్బులు డ్రా చేసుకున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న సందీప్‌ను పోలీసుల అదుపులోకి తీసుకుని విచారించగా తానే చెక్కులను దొంగతనం చేసి డబ్బులు డ్రా చేసుకున్నానని నేరం అంగీకరించాడు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ నందీశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో పారిపల్లివీధిలోని సందీప్ ఇంటి నుంచి రూ.3 లక్షలను రికవరీ చేశారు. త్వరగా స్థిరపడాలనే ఆశతో కలెక్టర్ సంతకాలు చేసిన బ్లాంక్ చెక్కులను దొంగిలించి.. ఇద్దరం సమానంగా పంచుకుందాం అనే ఒప్పందంతో తన చిన్న నాటి స్నేహితుడైన జప్తినాచారం గ్రామానికి చెందిన చాంద్ పాషాకు అందచేశాడు. దీంతో చాంద్‌పాషా ఆ చెక్కుపై రూ.50 లక్షలు అని రాసి దుద్దెడ గ్రామంలోని ఓ బ్యాంక్‌లో జమ చేసుకున్నాడు. అందులో నుంచి రూ.5 లక్షలను సందీప్‌కు ఇచ్చాడు. మిగతావి తర్వాత ఇస్తాను నాకు అప్పులు ఉన్నాయని సందీప్‌ను చాంద్‌పాషా నమ్మించాడు. సందీప్ ఆ మొత్తంలో నుంచి రూ.లక్షను అవసరాలకు, మరో రూ.లక్ష తన వేతన ఖాతాలో జమ చేసుకున్నాడు. మరో రూ.3 లక్షలను తన ఇంట్లో దాచుకున్నాడు. ఇదిలా ఉంటే మార్చిలో మళ్లీ రైతులకు చెక్కులు పంపిణీ చేసే సమయంలో ఎవరికి అనుమానం రాకుండా మరో చెక్కును సందీప్ దొంగలించి చాంద్ పాషాకు అందచేశాడు. ఈ క్రమంలో మొదటి చెక్ ద్వారా విత్‌డ్రా చేసిన డబ్బుల కోసం సందీప్ చాంద్‌పాషాకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోయే సరికి చెక్కులపై విచారణ జరుగుతుందేమోనని సందీప్ భయపడి తన విధులకు సెలవు పెట్టి థాయ్‌లాండ్, బ్యాంకాక్‌కు వెళ్లాడు. తిరిగి ఈ నెల 10న వరంగల్‌కు రాగా కేసు విచారణ జరుగుతుందని భయపడి తిరిగి హైదరాబాద్ వెళ్లాడు. గురువారం పోలీసుల విచారణలో భాగంగా సందీప్ జరిగిన విషయం చెప్పి తాను చేసిన నేరాన్ని అంగీకరించాడు.

## లారీ ఎక్కిన విమానం



**కోహీర్ (జహీరాబాద్):** ఆకాశంలో జోరుగా విహరించాల్సిన విమానం లారెక్కింది. మరమ్మతుల నిమిత్తం దేశ రాజధాని ఢిల్లీ నుంచి విజయవాడకు ఆ విమానాన్ని తీసుకెళ్తున్నారు. గురువారం మధ్యాహ్నం ఆ లారీ కోహీర్ మండలంలోని దిగ్వాల్ జాతీయ రహదారి 65పై దర్శనమిచ్చింది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఆ విమానాన్ని ఆసక్తిగా తిలకించారు.

# పాత కక్షలతోనే 'నడి రోడ్డు'పై హత్య

• పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు కలీల్
• రూ.6 లక్షలు సుపారీ తీసుకొని హత్య చేసిన నిందితులు
• నిందితుడి అరెస్టును ధ్రువీకరించని పోలీసులు



మహబూబ్‌ను రోడ్డుపై నరికి చంపుతున్న దృశ్యం (ఫైల్)

**పటాన్‌చెరు టౌన్:** పట్టపగలు జాతీయ రహదారిపై అందరూ చూస్తుండగానే ఒక వ్యక్తిని హత్య చేసి పరారైన నిందితుడు ఖలీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ హత్య కోసం నిందితుడు రూ.6 లక్షలు సుపారీ తీసుకున్నట్లు తెలిసింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో గత నెల 31న హైదరాబాద్ ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన మహబూబ్ హుస్సేన్ (25)ను నడిరోడ్డుపై కొబ్బరి బోండాలు నరికే కత్తితో హత్య చేసిన విషయం తెలిసిందే. పాత కక్షలు కారణంగానే మహమూబ్‌ను హత్య చేసినట్లు సమాచారం. అక్రమంగా బియ్యం రవాణా చేసే వాళ్లలో ఒక వర్గానికి, మరో వర్గానికి పడకనే లక్డారంలో గత నవంబర్‌లో జరిగిన హర్షద్ హత్యకు ప్రతీకారంగా అతడి సోదరులు మహబూబ్‌ను హత్య చేయించినట్లు తెలిసింది. ఈ హత్య కేసులో నిందితులు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన వారుగా సమాచారం. ప్రధాన నిందితుడి నుంచి పోలీసులు ఒక తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

**కొలిక్కి వచ్చిన హత్య కేసు..**

మహబూబ్‌ను హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలియడంతో కేసు కొలిక్కి వచ్చినట్లయింది. ఈ కేసులో మొత్తం 10 మందికి పైగా ఉన్నారని సమాచారం. హత్య చేస్తున్న సమయంలో రోడ్డుకు అవతలి వైపు కారులో కొందరు, మరి కొందరు ద్విచక్ర వాహనాలపై ఉన్నట్లు తెలిసింది. రెండు మూడ్రోజుల్లో నిందితులను రిమాండ్‌కు తరలించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై డీఎస్పీ రాజేశ్వర్‌రావును వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు. నిందితుడి అరెస్టును ఆయన ధ్రువీకరించలేదు.



కన్నెపల్లి పంపుహౌస్ వద్ద ఈఎన్‌సీలతో మాట్లాడుతున్న నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులు

## కాళేశ్వరం ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఈనెల 21న ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీలు హరిరామ్, నల్ల వెంకటేశ్వర్లు కన్నెపల్లి పంపుహౌస్ వద్ద ఏర్పాట్ల కోసం గురువారం స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఎస్పీ ఆర్.భాస్కరన్ వారితో కలసి పంపుహౌస్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రారంభ పూజ, మోటార్లకు స్విచ్ ఆన్ చేసే ప్రదేశం, యాగశాల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంపుహౌస్ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి 21న చేపట్టనున్న పనులను వివరించారు. పంపుహౌస్‌లో మిగిలి ఉన్న మోటార్ల బిగింపు పనులు పూర్తి చేసి 21 వరకు సిద్ధంగా ఉంచాలని ఏజెన్సీ ప్రతినిధులకు ఈఎన్‌సీలు సూచించారు.

# హైరిస్క్‌లో ఆదిలాబాద్ ఏజెన్సీ

• ఐదేళ్లలో 416 డెంగీ, 10,675 మలేరియా కేసులు
• సీజనల్ వ్యాధుల నివారణకు సర్కారు చర్యలు
• నేడు రాష్ట్రస్థాయి సమావేశం



ఉట్నూర్

సీజనల్ వ్యాధుల నివారణపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా డెంగీ కేసులు నమోదు అవుతున్న 14 జిల్లాల పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో వ్యాధుల తీవ్రత అధికంగా ఉంది. నివారణ చర్యల్లో భాగంగా జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రబలే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకోసం నేడు జిల్లాల కలెక్టర్లు, గిరిజన ప్రాంత అధికారులతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ సమీక్ష నిర్వహించనున్నారు.

**ఏజెన్సీలో ఇదీ పరిస్థితి..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో 31 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 181 ఉప ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో 4,95,794 మంది గిరిజన జనాభా ఉంది. వీరందరి ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై దృష్టి కేంద్రీకరించింది. ఏజెన్సీలో గడిచిన ఐదేళ్ల కాలంలో 10,675 మలేరియా, 416 డెంగీ కేసులు, 16 చికున్‌గున్యా కేసులు నమోదు కావడంతో సీజనల్ వ్యాధులను పూర్తి స్థాయిలో అదుపులో ఉంచేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. వర్షాకాలం మొదలైందంటే వివిధ రకాల వ్యాధులతో గిరిజనులు పిట్టల్లా రాలిపోతుంటారు. ఈ నేపథ్యంలో గిరిజన మరణాలను పూర్తి స్థాయిలో తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కలెక్టర్లు, ఏజెన్సీ ప్రాంత అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు.

**వైద్య శిబిరాల ఏర్పాటు**

గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ఇప్పటికే దోమ తెరలు పంపిణీ చేసింది. మలేరియా తీవ్రతపై వారంవారం క్షేత్ర స్థాయిలో సమీక్షల ద్వారా వైద్య సిబ్బంది దిని తీవ్రత ఎక్కువున్న ప్రాంతాల్లో నియమించనున్నారు. హైరిస్క్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి దోమల నివారణకు ఇళ్లలో ఐఆర్‌ఎస్ పిచికారీ చేయనున్నారు. జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డుల ఏర్పాటుతోపాటు ఈ వ్యాధులతో సంభవించిన మరణాల గణాంకాలు సేకరించేందుకు ఆడిట్ కమిటీ ఆధ్వర్యంలో వైద్యుల బృందం ఏర్పాటు చేయనున్నారు. సీజనల్ వ్యాధుల నివారణపై తగిన ప్రచారం నిర్వహించనున్నారు.

**శాఖల మధ్య సమన్వయంతో..**

ఏజెన్సీలో దోమల నివారణకు పంచాయతీ రాజ్, విద్య, ఇరిగేషన్, మైనింగ్, ఐసీడీఎస్, మత్స్యశాఖ అధికార యంత్రాంగం మధ్య సమన్వయంతో చర్యలు తీసుకోనున్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టనున్నారు, అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే చికున్ గున్యా, యెల్లో ఫీవర్, డెంగీ, జికా, ఫైలేరియా లాంటి కేసుల వివరాలను సేకరించి అవి ప్రబలకుండా ప్రభుత్వం నివారణ చర్యలు తీసుకోనుంది. అలాగే ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదయ్యే ఇటువంటి వ్యాధుల కేసుల్లో రోగుల రక్త నమూనాలను సేకరించి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎలీసా పరీక్షలు నిర్వహించి వ్యాధులను అరికట్టే చర్యలు చేపట్టనున్నారు.

**ఐదేళ్లలో ఏజెన్సీలో ప్రబలిన వ్యాధుల వివరాలు**

| సంవత్సరం | మలేరియా | డెంగీ | చికున్‌గున్యా |
|---|---|---|---|
| 2015 | 9199 | 09 | 16 |
| 2016 | 1213 | 21 | 00 |
| 2017 | 209 | 48 | 00 |
| 2018 | 49 | 315 | 00 |
| 2019(ఇప్పటివరకు) | 05 | 23 | 00 |



శివసాయి

## పోలీస్ స్టేషన్‌లో గొంతు కోసుకున్న యువకుడు

**కరీమాబాద్(వరంగల్) :** వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో కరీమాబాద్ ప్రాంతానికి చెందిన నాగపురి శివసాయి అనే యువకుడు బ్లేడ్‌తో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బంగారం దుకాణంలో పని చేస్తున్న శివసాయి కరీమాబాద్ ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నట్లు నమ్మించడంతో ఆమె బుధవారం ఇంట్లో చెప్పకుండా అతడి వద్దకు వచ్చింది. దీంతో యువతి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారి ఆచూకీ తెలుసుకుని ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో ఆ యువతి తల్లిదండ్రులతోనే వెళ్తానని చెప్పడంతో శివసాయి వెంటతెచ్చుకున్న బ్లేడ్‌తో గొంతుకోసుకున్నాడు. ఇది గమనించిన పోలీసులు అతడిని ఎంజీఎంకు తరలించారు. అనంతరం శివసాయిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



బిష్కెక్‌లో జిన్‌పింగ్‌తో మోదీ కరచాలనం



పుతిన్‌ను ఆలింగనం చేసుకుంటున్న మోదీ

# పాక్‌కు బుద్ధిచెప్పండి

- జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ
- పుతిన్‌తోనూ భేటీ
- షాంఘై సహకార సదస్సు సందర్భంగా విడివిడిగా సమావేశం

**బిష్కెక్/వాషింగ్టన్:** కిర్గిజిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో గురువారం ప్రారంభమైన షాంఘై సహకార సదస్సు(ఎస్‌సీవో)కు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో వేర్వేరుగా సమావేశమయ్యారు. అనంతరం మోదీ స్పందిస్తూ.. జిన్‌పింగ్‌తో భేటీ అత్యంత ఫలప్రదంగా ముగిసిందని తెలిపారు. 'భారత్–చైనాల మధ్య వేర్వేరు రంగాల్లో పరస్పర సహకారం పెంపొందించుకోవడంపై ఈ భేటీలో చర్చించాం' అని మోదీ వెల్లడించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న విషయాన్ని మోదీ జిన్‌పింగ్ దృష్టికి తీసుకొచ్చారు. ఉగ్రమూకలపై పాక్ కఠినచర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ఉగ్రరహిత వాతావరణంలో పాక్‌తో శాంతి చర్చల ప్రక్రియకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

**జిన్‌పింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు..**

అంతకుముందు సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన మోదీని జిన్‌పింగ్ అభినందించారు. ఇందుకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని.. జూన్ 15న 66వ పుట్టినరోజు జరుపుకోనున్న జిన్‌పింగ్‌కు భారతీయులందరి తరఫున శుభాకాంక్షలు చెప్పారు. ఎస్‌సీవో సదస్సు నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ సమావేశమయ్యారు. ఈ భేటీలో భాగంగా భారత్–రష్యాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను పటిష్టం చేసుకోవాలని మోదీ, పుతిన్ నిర్ణయించారు. బిష్కెక్‌లో ఎస్‌సీవో భేటీ జూన్ 13 నుంచి రెండ్రోజుల పాటు సాగనుంది.

**మోదీ సరికొత్త నాయకుడు: పాంపియో**

అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికాలోని వాషింగ్టన్‌లో జరిగిన ఇండియా ఐడియాస్ సదస్సులో పాంపియో మాట్లాడుతూ.. 'సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎన్డీయే గెలుపొంది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు సరికొత్త నాయకుడిగా మోదీ అవతరించారు' అని కితాబిచ్చారు. భారత యువతకు సుసంపన్నమైన, ఉజ్వల భవిష్యత్తును మోదీ ఇవ్వగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్‌లో 5జీ నెట్‌వర్క్‌లతో పాటు అత్యంత భద్రమైన కమ్యూనికేషన్ వ్యవస్థల ఏర్పాటుకు సాయమందించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. జూన్ 24 నుంచి 30 వరకూ పాంపియో భారత్, శ్రీలంక, జపాన్, దక్షిణకొరియా దేశాల్లో పర్యటించనున్నారు.

# మనకూ ఓ అంతరిక్ష కేంద్రం



**2030 నాటికి సిద్ధం • 20 టన్నుల బరువు**

**వ్యోమగాములు గడిపేలా ఏర్పాటు • ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడి**

**చంద్రయాన్ తర్వాత సూర్యుడి పైకి ఆదిత్య ఎల్–1 వాహక నౌక**

**అనంతరం శుక్రుడిపై అధ్యయనానికి మరో ప్రయోగం**

**న్యూఢిల్లీ:** అంతరిక్ష ప్రయోగాల్లో అంతర్జాతీయంగా తనదైన ముద్ర వేసిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో మెగా ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది! ఆంక్షల చట్రాలు ఎన్ని ఉన్నా.. ప్రపంచంలోనే అత్యంత చవకగా ఉపగ్రహ ప్రయోగాలు నిర్వహించగల సత్తా సాధించుకున్న ఇస్రో... ఇప్పుడు సొంతంగా ఓ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకునే దిశగా అడుగులువేస్తోంది. ఢిల్లీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఇస్రో చైర్మన్ డా.కె.శివన్ ఈ విషయాన్ని ప్రకటించారు. 'చంద్రయాన్–2 ప్రయోగం పూర్తయ్యాక సూర్యుడిపై ఆదిత్య–ఎల్1 వాహకనౌక 2020 తొలి అర్ధభాగంలో పంపిస్తాం. అనంతరం 2–3 సంవత్సరాల వ్యవధిలో ఫ్రాన్స్‌తో కలిసి శుక్రుడిని అధ్యయనం చేసేందుకు మరో ప్రయోగం చేపడతాం' అని తెలిపారు. ఆదిత్య ఎల్1 వాహకనౌక సూర్యుడిలో అత్యంత వేడి ప్రదేశమైన కరోనాను విశ్లేషిస్తుందనీ, దీనివల్ల వాతావరణ మార్పులను అర్థం చేసుకోవచ్చని వెల్లడించారు. ఇస్రో అంతరిక్ష పర్యాటకంపై దృష్టి సారించడంలేదని డా.శివన్ స్పష్టం చేశారు.

**2030 నాటికి పూర్తి**

భారతీయుల్ని సొంతంగా అంతరిక్షంలోకి పంపేందుకు రూ.10,000 కోట్లతో ఇస్రో చేపట్టిన 'గగన్‌యాన్' ప్రాజెక్టుకు కొనసాగింపుగా అంతరిక్ష కేంద్ర నిర్మాణం ఉంటుందని డా.శివన్ తెలిపారు. 'అమెరికా, జపాన్, కెనడా, రష్యా, ఈయూ దేశాలు కలిసి ఏర్పాటుచేసిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్) బరువు 420 టన్నులు ఉండగా, ఇస్రో ఏర్పాటుచేయనున్న అంతరిక్ష కేంద్రం బరువు 20 టన్నులు మాత్రమే ఉంటుంది. ఈ కేంద్రంలో తొలుత వ్యోమగాములు 15–20 రోజులు గడిపేలా ఏర్పాట్లు చేస్తాం. దాన్ని క్రమంగా విస్తరిస్తాం. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రతిపాదనల దశలోనే ఉంది. ఓసారి ప్రభుత్వ ఆమోదం లభిస్తే 2030 నాటికి మనకు సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటవుతుంది. దీనికోసం ఐఎస్‌ఎస్‌తో కానీ, మరేదేశంతో కానీ పని చేయబోం' అని పేర్కొన్నారు. గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉండే పరిస్థితుల్లో మానవశరీరంతో పాటు మొక్కలు, ఇతర జీవులు, బ్యాక్టీరియాలు ఎలా ప్రతిస్పందిస్తాయన్న విషయమై ఈ కేంద్రంలో పరిశోధనలు చేపడతామని చెప్పారు. ఇతర దేశాలతో కలిసి చంద్రుడిపై మానవసహిత యాత్రలు చేపడతామని, గ్రహశకలాలను విశ్లేషిస్తామని కె.శివన్ తెలిపారు.

**అంతరిక్ష కేంద్రం అంటే?**

భూమికి సుమారు 400 కిలోమీటర్ల దూరంలో కొన్ని రోజులపాటు వ్యోమగాములు ఉండేందుకు ఏర్పాటు చేసిన నిర్మాణాన్ని అంతరిక్ష కేంద్రం అని పిలవొచ్చు. దీనిని భూస్థిర కక్ష్యలో తిరుగుతూ ఉండే ఓ భారీ ఉపగ్రహంగానూ అనొచ్చు. అగ్రరాజ్యాల ఆధ్వర్యంలో నడుస్తున్న ఐఎస్‌ఎస్‌ను 1998 నుంచి దశలవారీగా విస్తరిస్తూ వచ్చారు. దీంతో ప్రస్తుతం ఐఎస్‌ఎస్ బరువు దాదాపు 420 టన్నులకు చేరుకుంది. 2000లో తొలిసారిగా ఇందులో ఓ వ్యోమగామి అడుగుపెట్టారు. 2011లో ఐఎస్‌ఎస్‌కు చివరి మాడ్యూల్‌ను జోడించారు. ఐదేళ్ల తర్వాత ఐఎస్‌ఎస్‌లో వ్యోమగాములు నివాసం ఉండేందుకు వీలుగా ప్రత్యేకమైన గాలిబుడగలాంటి నిర్మాణాన్ని ఏర్పాటుచేశారు. 2030 వరకూ పనిచేసే ఈ ఐఎస్‌ఎస్‌లో గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉన్న పరిస్థితుల్లో మొక్కలు ఎలా పెరుగుతాయి? పదార్థాల భౌతిక ధర్మాలు మారతాయా? బ్యాక్టీరియా వంటి సూక్ష్మ జీవులపై ప్రభావం ఎలా ఉంటుంది? వంటి అంశాలపై అనేక ప్రయోగాలు జరుగుతున్నాయి.

## గగన్‌యాన్ తర్వాతే..



**జూ**లై 15న చంద్రయాన్ –2 ప్రయోగం పూర్తయ్యాక గగన్‌యాన్‌పై దృష్టి సారిస్తామని శివన్ తెలిపారు. 'వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే ముందు రెండుసార్లు వారు ప్రయాణించే మాడ్యూల్‌ను పరీక్షిస్తాం. 2022లో తొలి మానవసహిత అంతరిక్ష ప్రయోగాన్ని చేపడతాం. అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములను రాబోయే 6 నెలల్లో ఎంపిక చేస్తాం. ఆ తరువాత వీరికి ఏడాది పాటు శిక్షణ ఇస్తాం. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.10 వేల కోట్ల నిధులను కేటాయించింది' అని శివన్ చెప్పారు. గగన్‌యాన్ ప్రయోగం పూర్తయ్యాక దానికి కొనసాగింపుగా అంతరిక్ష కేంద్రం నిర్మాణంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న శివన్. చిత్రంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్



తుపాను నేపథ్యంలో పడవలను వెరావల్ హార్బర్‌లోనే ఉంచేసిన దృశ్యం

# ఒమన్ వైపు 'వాయు' గమనం

**గుజరాత్‌లో భారీ వర్షాలు**

**అహ్మదాబాద్:** గుజరాత్‌ను భయపెట్టిన 'వాయు' తుపాను తన దిశను మార్చుకుంది. అరేబియా సముద్రంలో అల్లకల్లోలం రేపుతున్న ఈ తుపాను ప్రస్తుతం ఒమన్ వైపు పయనిస్తోంది. అయినప్పటికీ, గుజరాత్ తీరం వెంబడి వర్షాలు, గాలుల ఉధృతి కొనసాగుతూనే ఉంది. 'వాయు' తుపాను హెచ్చరికలతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం ఇప్పటికే మూడు లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. 'వాయు' గమనం మార్చుకున్నట్లు భారత వాతావరణ విభాగం తెలిపినప్పటికీ మరో 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులను హెచ్చరించినట్లు గుజరాత్ సీఎం విజయ్ రూపానీ తెలిపారు. ముందు జాగ్రత్తగా రాష్ట్రంలోని పాఠశాలలు శుక్రవారం కూడా మూసే ఉంటాయని ప్రకటించారు. 'వాయు' దిశ మారినప్పటికీ సౌరాష్ట్ర తీరం వెంబడి రాగల 24 గంటల్లో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం తెలిపింది. అరేబియా సముద్రంలో దాదాపు 900 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న వాయు తుపాను ప్రభావం తొలగిపోయినట్లు భావించలేమని అధికార వర్గాలు చెప్పాయి. వాయు ప్రభావంతో రాష్ట్రంలో ఎటువంటి నష్టం జరిగినట్లు ఇప్పటి వరకు సమాచారం లేదని తెలిపాయి. పోర్‌బందర్‌లోని 150 ఏళ్ల నాటి భూతేశ్వర్ మహాదేవ్ ఆలయం తీవ్ర గాలులు, భారీవర్షం ధాటికి కుప్పకూలిందని వెల్లడించాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైల్వే శాఖ 86 రైళ్లను రద్దు చేసి, 37 రైళ్ల ప్రయాణ మార్గాన్ని కుదించింది.

## తూర్పు గగనతలంపై మళ్లీ పాక్ నిషేధం

**లాహోర్:** భారత్‌తో తూర్పు సరిహద్దు వెంబడి గగనతలంపై నిషేధాన్ని పాకిస్తాన్ మూడోసారి పొడిగించింది. పాక్ పౌర విమానయాన సంస్థ(సీఏఏ) జారీ చేసిన ఆదేశాల మేరకు తాజా పొడిగింపు ఈనెల 28వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. పంజ్‌గూర్ గగనతలాన్ని విమాన ప్రయాణాలకు అనుకూలంగా తెరిచి ఉంచామని, పశ్చిమ మార్గంలో ఇప్పటికే ఎయిరిండియా విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయని కూడా పేర్కొంది. భారత వైమానిక దళం విమానాలు పాక్‌లోని బాలాకోట్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపిన అనంతరం ఫిబ్రవరి 26వ తేదీ నుంచి తమ గగనతలాన్ని పాక్ పూర్తిగా మూసింది.

# వారంతా అమరులయ్యారు

**ఏఎన్‌32 విమానంలో ఉన్న 13 మంది మరణించారు: భారత వాయుసేన**

**న్యూఢిల్లీ:** ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లో కూలిపోయిన ఏఎన్–32 విమానంలో ఉన్న 13 మంది మరణించినట్లు భారత వైమానిక దళం ధ్రువీకరించింది. గురువారం దట్టమైన అటవీ ప్రాంతంలో విమాన శకలాల కోసం సహాయక బృందం గాలింపులో ఈ విషయం వెల్లడైంది. 'జూన్ 3న జరిగిన విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ధైర్యవంతులైన వైమానిక వీరులకు భారత వైమానిక దళం నివాళులు అర్పిస్తోంది. వారి ఆత్మ శాంతించాలి. వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతి' అని వాయుసేన అధికార ప్రతినిధి ఒకరు గురువారం పేర్కొన్నారు. రష్యాలో తయారైన ఏఎన్–32 విమానం అస్సాంలోని జోర్హాట్ ప్రాంతం నుంచి చైనా సరిహద్దులోని మెంచుకాకు జూన్ 3న బయల్దేరిన కొద్దిసేపటికే అదృశ్యమైన విషయం తెలిసిందే. అప్పటినుంచి గాలించగా 8 రోజుల తర్వాత సియాంగ్, షియోమి జిల్లాల సరిహద్దులో మంగళవారం ఈ విమాన శకలాలు దొరికాయి. 13 మంది యుద్ధవీరులు అందించిన సేవలను దేశం ఎప్పుడూ మరిచిపోదని ట్విటర్‌లో కాంగ్రెస్ పేర్కొంది. వారి మృతిపట్ల ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతోపాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంతాపం ప్రకటించారు. కాగా, ఈ ఏడాది ప్రారంభం నుంచి జరిగిన వేర్వేరు ఘటనల్లో మొత్తం పది విమానాలను భారత వాయుసేన కోల్పోయింది. కోల్పోయిన విమానాల్లో ఒక మిరాజ్, ఒక జాగ్వార్, ఒక ఎంఐ17వీ5 హెలికాప్టర్, రెండు హాక్ రకం విమానాలు, రెండు మిగ్ రకం విమానాలు ఉన్నాయి.



దాడిలో తగలబడుతున్న నౌక

# 2 నౌకలపై దాడి

- ఇరాన్ సమీపంలోని 'గల్ఫ్ ఆఫ్ ఒమన్' వద్ద ఘటన
- అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగబాకిన ముడిచమురు ధరలు

**దుబాయ్/టెహ్రాన్/ఓస్లో:** యుద్ధమేఘాలు కమ్ముకున్న గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తత చెలరేగింది. ఇరాన్‌కు సమీపంలో ఉన్న 'గల్ఫ్ ఆఫ్ ఒమన్' ప్రాంతంలో గురువారం రెండు చమురు నౌకలపై గుర్తుతెలియని దుండగులు దాడిచేశారు. ఈ దుర్ఘటనలో రెండు నౌకలు మంటల్లో చిక్కుకోగా, ఇరాన్ నేవీ 44 మంది సిబ్బందిని రక్షించింది. నార్వేకు చెందిన 'ఫ్రంట్ ఆల్టేర్' నౌక ఇథనాల్‌ను ఖతార్ నుంచి తైవాన్‌కు ఇరాన్ సమీపంలోని హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారా తీసుకెళుతోంది. ఈ నేపథ్యంలో నౌక గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతానికి చేరుకోగానే ఉదయం ఒక్కసారిగా మూడు పేలుళ్లు సంభవించాయి. నౌకలో మంటలు చెలరేగడంతో 23 మంది సిబ్బంది సముద్రంలోకి దూకేశారు. అలాగే సౌదీఅరేబియా నుంచి సింగపూర్‌కు ఇదేమార్గంలో మిథనాల్‌ను తీసుకెళుతున్న 'కొకువా కరేజియస్' నౌకపై గంట వ్యవధిలో మరోదాడి జరిగింది. ఈ రెండు నౌకల నుంచి ప్రమాద హెచ్చరికలను అందుకున్న ఇరాన్ నేవీ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని 44 మంది సిబ్బందిని కాపాడింది.

**ఖండించిన ఐరాస..**

ప్రపంచంలో మూడోవంతు చమురును తరలించే హోర్ముజ్ జలసంధి వద్ద దాడి జరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు 3 శాతానికిపైగా ఎగబాకాయి. లండన్‌కు చెందిన బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 61.99 డాలర్లకు చేరుకోగా, న్యూయార్క్ వెస్ట్ టెక్సాస్ బ్యారెల్ చమురు ధర 3.1 శాతం పెరిగి 52.74 డాలర్లకు పెరిగింది. ఈ ఘటనను ఐక్యరాజ్యసమితి(ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గ్యుటెరస్ ఖండించారు. గల్ఫ్‌లో మరో ఉద్రిక్తత తలెత్తితే ప్రపంచం తట్టుకోలేదని హెచ్చరించారు.

## ఈఎస్ఐ చందా 4 శాతానికి తగ్గింపు

**న్యూఢిల్లీ:** ఉద్యోగుల ఆరోగ్య బీమా పథకం(ఈఎస్ఐసీ)కి ఉద్యోగులు, యాజమాన్యాలు చెల్లించే చందాను 6.5 శాతం నుంచి 4 శాతానికి తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. జూలై ఒకటో తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని కేంద్ర కార్మిక శాఖ గురువారం తెలిపింది. ప్రభుత్వ నిర్ణయంతో 3.6 కోట్ల మంది ఉద్యోగులతోపాటు 12.85 లక్షల మంది వివిధ యజమాన్యాలకు లాభం చేకూరనుంది. అలాగే, వివిధ సంస్థలకు ఏడాదికి రూ.5 వేల కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. తాజా నిర్ణయంతో మరికొందరు ఉద్యోగులు, యాజమాన్యాలు తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు ప్రోత్సాహం కలుగుతుందని వివరించింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఈఎస్ఐ పథకం కింద రూ.22,279 కోట్లు జమ అయ్యాయని తెలిపింది. ఈఎస్ఐ చందాదారులు, వారి కుటుంబాలకు వైద్య, ప్రసూతి సేవలతో పాటు నగదు సాయం అందుతుంది.

## 'పీఎం కిసాన్ పెన్షన్' కోసం నెలకు రూ.100

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి కిసాన్ పెన్షన్ యోజనలో భాగంగా రైతులు ఇకపై ప్రతినెలా రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలతో కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ పథకానికి సంబంధించి దిశానిర్దేశం చేశారు.ఈ పథకంలో చేరిన రైతులు 60 ఏళ్ల వరకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. దీనికి సమాంతరంగా కేంద్ర ప్రభుత్వం అంతేమొత్తం చెల్లిస్తుంది. రైతుకు 60 ఏళ్లు నిండాక నెలకు రూ.3,000 చొప్పున పెన్షన్‌గా కేంద్రం చెల్లించనుంది. ప్రధాన మంత్రి కిసాన్(పీఎం కిసాన్) పథకం కింద అర్హులైన రైతులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు. దేశంలోని 14.5 కోట్ల మంది రైతులకుగాను ఇప్పటివరకు కిసాన్ క్రెడిట్ కార్డ్(కేసీసీ) పథకంను పశుసంవర్ధక, మత్స్యశాఖ పరిధిలోని రైతులకూ వర్తింపజేస్తున్నట్లు వెల్లడించారు.

## సాధారణ సేవా కేంద్రాల్లో మళ్లీ ఆధార్ సేవలు

**న్యూఢిల్లీ:** దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ సంబంధిత సేవలను అందించేందుకు సాధారణ సేవా కేంద్రాలకు ఆధార్ ఆథరైజేషన్‌ను పునరుద్ధరిస్తామని ఆధార్(యూఐడీఏఐ) సంస్థ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఆధార్ సమాచార భద్రతపై గతంలో విమర్శల నేపథ్యంలో ఆధార్ సంస్థ ఈ కేంద్రాలకు ఆథరైజేషన్‌ను యూఐడీఏఐ రద్దు చేసింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న 3.9 లక్షల ఈ కేంద్రాలు ఆధార్ సేవలను నిలిపివేశాయి. ఈ కేంద్రాలు రైలు టికెట్ బుకింగ్, పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రాలు, ఆయుష్మాన్ భారత్ స్కీమ్ వంటి సేవలు అందించేవి. తాజాగా ఈ కేంద్రాలకు ఆధార్ ఆథరైజేషన్‌ను పునరుద్ధరించడంతో అడ్రస్, ఫొటో వంటివి ఆధార్‌లో మార్పు చేసుకునే అవకాశం ప్రజలకు కలగనుంది.

## ప్రధాని రేసులో బోరిస్ ముందంజ

**లండన్:** బ్రిటన్ ప్రధాని పదవికి పోటీ పడుతున్న పది మందిలో మాజీ మంత్రి బోరిస్ జాన్సన్ ముందంజలో ఉన్నారు. ప్రధాని ఎంపిక ప్రక్రియలో భాగంగా గురువారం హౌస్ ఆఫ్ కామన్స్‌లో తొలి దశ రహస్య ఓటింగు నిర్వహించారు. కన్జర్వేటివ్ పార్టీ ఎంపీలు పాల్గొన్న ఈ ఓటింగులో జాన్సన్ 114 ఓట్లు సాధించి ప్రధాని రేసులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. మిగతా అభ్యర్థుల్లో విదేశాంగ మంత్రి జెరిమీ హంట్‌కు 43, పర్యావరణ మంత్రి మిఖాయిల్ గోవ్‌కు 37 ఓట్లు వచ్చాయి. జులై 22న కొత్త ప్రధానిని ప్రకటించే అవకాశం ఉంది.

## పార్టీని ముంచింది మీరే: ప్రియాంకా గాంధీ

**రాయ్‌బరేలీ:** లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని ముంచింది మీరే అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ పార్టీ నేతలపై మండిపడ్డారు. ప్రియాంక గురువారం రాయ్‌బరేలీలో పార్టీ నేతలతో మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించని వారి పేర్లను కనుక్కుంటామన్నారు. ఎవరెవరు పార్టీకోసం చిత్తశుద్ధితో పని చేశారో వారి హృదయాలకే తెలుసన్నారు. మరోవైపు, బీజేపీ నేతలుఅమిత్ షా, స్మృతి ఇరానీలు లోక్‌సభకు ఎన్నికవడంతో ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలకు విడివిడిగా కాకుండా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సింఘ్వీ డిమాండ్ చేశారు. విడివిడిగా ఎన్నికలు నిర్వహించాలనుకోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనన్నారు.

# మరికొంతకాలం అమిత్ షాయే!

**కేరళ, బెంగాల్‌లో బలోపేతంపై దృష్టి**

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** బీజేపీ అధ్యక్షుడిగా అమిత్ షా మరికొంతకాలం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో ఆరు నెలలపాటు అధ్యక్ష బాధ్యతలను కొనసాగించనున్నారని విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్‌లలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా తాత్కాలిక చీఫ్‌ను నియమించే అవకాశాలు కూడా లేకపోలేదని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించేందుకు అమిత్‌షా గురువారం వివిధ రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులతో భేటీ అయ్యారు. ఈ నెల 14వ తేదీన రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో, 18న ఆఫీస్ బేరర్లు, ప్రధాన కార్యదర్శులు, జాతీయ కార్యదర్శులతో పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం కానున్నారు.

**రోడ్‌మ్యాప్‌పై కమిటీ**

గురువారం నాటి సమావేశంలో అమిత్‌షా.. ఇటీవలి ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడంలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర కీలకమైందని కొనియాడారు. బెంగాల్, ఏపీ, తమిళనాడు, కేరళలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఇటీవలి ఎన్నికల్లో పార్టీ తెలంగాణ, ఒడిశాలలో మంచి ఫలితాలను సాధించిందన్నారు. సంస్థాగత ఎన్నికలతోపాటు ఇతర ప్రధాన అంశాలపై రోడ్ మ్యాప్ రూపొందించేందుకు బీజేపీ ఉపాధ్యక్షుడు శివరాజ్ సింగ్ చౌహాన్, నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు.



కార్యవర్గ సమావేశంలో అమిత్‌షాను సత్కరిస్తున్న దృశ్యం

# శాంతిభద్రతలు రాష్ట్రం పరిధిలోని అంశం

**గవర్నర్‌కు సంబంధం లేదు: బెంగాల్ సీఎం మమతా బెనర్జీ**

**కోల్‌కతా:** శాంతి భద్రతలు రాష్ట్రం పరిధిలోని అంశమని, దానితో గవర్నర్‌కు సంబంధం లేదని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై చర్చించేందుకంటూ గవర్నర్ కేసరీనాథ్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంపై మమత గురువారం కోల్‌కతాలో మాట్లాడారు. 'గవర్నర్ ప్రయత్నం వెనుక బీజేపీ ప్రోద్బలం ఉందని మమత ఆరోపించారు. శాంతి భద్రతలు రాష్ట్రానికి సంబంధించిన అంశం అయినందునే ఆ సమావేశానికి హాజరు కాలేదని తెలిపారు. రాజ్‌భవన్‌లో జరిగిన సమావేశానికి టీఎంసీ ప్రధాన కార్యదర్శి, మంత్రి పార్థ చటర్జీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్, కాంగ్రెస్, సీపీఎం రాష్ట్ర నేతలు



సోమేన్ మిత్రా, సూర్యకాంత మిశ్రా హాజరయ్యారు. అయితే, రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో సీఎం మమత పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ్ మజుందార్ అన్నారు.

**జూ.డా.ల సమ్మె వెనుక బీజేపీ, సీపీఎం**

రాష్ట్రంలోని ప్రభుత్వం ఆస్పత్రుల్లో జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగడం వెనుక రాజకీయ ప్రత్యర్థులైన సీపీఎం, బీజేపీల హస్తం ఉందని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. సీపీఎం సాయంతో వైద్యుల సమ్మెకు మతం రంగు పులిమేందుకు బీజేపీ కుట్ర పన్నిందన్నారు.

# 3 భాగాలుగా ఓబీసీ కోటా?

**రోహిణి కమిషన్ ప్రతిపాదించే అవకాశం • వచ్చే నెల్లో నివేదిక సమర్పణ**

**దే**శంలో విద్య, ఉద్యోగాల్లో ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీ)కు కేటాయించిన 27 శాతం రిజర్వేషన్ అమలులో భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. దేశంలో ఓబీసీ కోటా అమలు తీరుతెన్నుల అధ్యయనానికి ఏర్పాటైన జస్టిస్ రోహిణి కమిషన్ ఓబీసీ కులాల్లో ఎవరెవరికి ఈ రిజర్వేషన్ వల్ల ఏ మేరకు లబ్ధి కలుగుతోందన్న అంశాన్ని పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఓబీసీలో 2,633 కులాలున్నాయి. ఈ కులాలన్నిటికీ ఉమ్మడిగా 27శాతం రిజర్వేషను అమలవుతోంది. వీటిలో కొన్ని కులాల వారు రిజర్వేషన్ వల్ల ఎక్కువ లబ్ధి పొందుతోంటే, మరికొన్ని కులాల వారికి ప్రయోజనం కలగడం లేదని కమిషన్ అభిప్రాయ పడినట్టు తెలిసింది. తేడాను దృష్టిలో పెట్టుకుని ఈ 27 శాతాన్ని మూడు భాగాలు చేయాలని, లబ్ధి స్థాయిని బట్టి ఆయా కులాలకు రిజర్వేషన్ అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేయనున్నట్టు తెలిసింది. 27శాతంలో రిజర్వేషన్ వల్ల గరిష్టస్థాయిలో లబ్ధి పొందుతున్న కులాలకు 7శాతం, అసలేమీ ప్రయోజనం పొందని కులాలకు 10 శాతం, కొంత లబ్ధి కులాలకు 10శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కమిషన్ ప్రతిపాదించనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. జూలై 31లోపు నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు జస్టిస్ రోహిణి తెలిపారు.

**పది కులాలకే ఎక్కువ లబ్ధి**

ఓబీసీ జాబితాలో ఉన్న వేల కులాల్లో కేవలం 10 ఉప కులాల వారే 25 శాతం రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతున్నారని, 983 ఉప కులాల వారికి ఒక్క శాతం లబ్ధి కూడా చేకూరడం లేదని కమిషన్ తన సంప్రదింపుల పత్రంలో పేర్కొంది. స్వాతంత్ర్యానికి పూర్వం అంటే 1931 చేపట్టిన జనాభా లెక్కల్లో ఓబీసీల గణన జరిగింది. ఆ తర్వాత ఇంత వరకు ఓబీసీల గణన జరగలేదు. ఓబీసీ జనాభాపై కచ్చితమైన లెక్కలు అందుబాటులో లేనందున రోహిణి 1931నాటి ఓబీసీ లెక్కలనే పరిగణనలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. సంప్రదాయకంగా రాళ్లను పాలిష్ చేసే కలైగర్లు, కత్తులు సానపట్టే సిక్లిగర్లు,సరనియాలు వంటి వృత్తిపరమైన కులాలలో పాటు అనేక వెనకబడిన కులాలకు ఓబీసీ రిజర్వేషన్ ఫలాలు ఎంత మాత్రం అందడం లేదని కమిషన్ పేర్కొంది. 'ఈ కులాల జనాభా తక్కువేం కాదు. అయినా వారికి ఓబీసీ ప్రయోజనాలు అందడం లేదు. రాజకీయ ప్రాతినిధ్యం కూడా లేదు'అని కమిషన్ సభ్యుడు డా.జేకే బజాజ్ అన్నారు. అలాగే, ఆంధ్ర ప్రదేశ్‌లో భిక్షాటన చేసే బుడ్బుదీలు, గోసాయన కులాల వారు కూడా ఓబీసీ వల్ల లాభం పొందలేకపోతున్నారని, అయితే ఈ కులాలకు చెందిన ఒకరిద్దరు ఐఐటీ వంటి సంస్థల్లో విద్యార్థులుగా కనిపిస్తున్నారని ఆయన వివరించారు. ఓబీసీ రిజర్వేషన్ వల్ల ఏ కులాలు ఎక్కువ లబ్ధి పొందాయి, ఏవి పొందలేదు అన్నది నిర్ధారించడం కోసం కమిషన్ ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ సహా దేశంలోని విద్యా సంస్థలు, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో గత మూడేళ్లుగా ఈ కోటా కింద పొందిన లక్ష అడ్మిషన్లను, ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వంలో ఈ కోటా కింద పొందిన 1,30,000 ఉద్యోగాలను పరిశీలించింది. కమిషన్ ప్రతిపాదనలు అమల్లోకి రావాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. దీనిపై కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖ మంత్రి తావర్ చంద్ గెహ్లాట్ స్పందిస్తూ 'ముందు కమిషన్ నివేదిక రానివ్వండి. దాన్ని అధ్యయనం చేసి ఏం చెయ్యాలో నిర్ణయిస్తాం' అన్నారు. ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే దేశంలో రాజకీయ సమీకరణాలు కూడా మారుతాయని పరిశీలకులు అంటున్నారు. ఉత్తరాదిన రాష్ట్రీయ జనతా దళ్, సమాజ్‌వాదీ పార్టీ, దక్షిణాన డీఎంకే, అన్నాడీఎంకే వంటి పార్టీలు ఓబీసీల ఓటు బ్యాంకులు కలిగి ఉన్నాయి.



సాక్షి **బిజినెస్**
శుక్రవారం
14-6-2019
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 15 ▼ | 8 ▲ |
| 39,741 | 11,914 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం.లకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,837 | ▲ | 44 |
| డోజోన్స్ | 26,109 | ▲ | 105 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,369 | ▲ | 1 |
| డాక్స్ | 12,169 | ▲ | 53 |
| షాంఘై | 2,911 | ▲ | 1 |
| నిక్కాయ్ | 21,032 | ▼ | 98 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.58 | 70.22 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.48 | 89.64 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.91 | 79.84 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.87 | 65.29 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.91 | 49.08 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.89 | 51.67 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.76 | 19.52 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.19 | 19.75 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.42 | 10.77 |

# భారత్ కీలకం..

- భారీ మార్కెట్ కాబట్టి ప్రయోగాలు
- కొత్త ఉత్పత్తులకు బాగా తోడ్పాటునిస్తోంది
- తరువాత ప్రపంచమంతటా తేవొచ్చు
- గూగుల్ సీఈవో సుందర్ పిచయ్



**వాషింగ్టన్:** టెక్ దిగ్గజం గూగుల్ కొంగొత్త ఉత్పత్తులు ఆవిష్కరించడంలోనూ, అంతర్జాతీయంగా ఇతర దేశాల్లో వాటిని ప్రవేశపెట్టడంలోనూ భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. పరిమాణం పరంగా భారత్ చాలా భారీ మార్కెట్ కావడంతో ఇక్కడిలాంటి ప్రయోగాలు చేయటం గూగుల్‌కు సాధ్యమవుతోంది. అమెరికా, ఇండియా వ్యాపార మండలి (యూఎస్ఐబీసీ) నిర్వహించిన 'ఇండియా ఐడియాస్' సదస్సులో పాల్గొన్న సందర్భంగా గూగుల్ సీఈవో సుందర్ పిచయ్ ఈ విషయాలు చెప్పారు. పాలనను, సామాజిక.. ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చడానికి భారత ప్రభుత్వం టెక్నాలజీని అద్భుతంగా వినియోగించుకుంటోందని ఆయన కితాబిచ్చారు. ఇందులో తాము కూడా భాగస్వాములం కావడం సంతోషదాయకమన్నారు. 'భారత మార్కెట్ భారీ పరిమాణం కారణంగా ముందుగా అక్కడ కొత్త ఉత్పత్తులు, సాధనాలు రూపొందించేందుకు, ఆ తర్వాత ఇతర దేశాల్లో ప్రవేశపెట్టేందుకు మాకు వీలుంటోంది. ముఖ్యంగా గత మూడు, నాలుగేళ్లుగా ఈ ఆసక్తికరమైన ట్రెండ్ నడుస్తోంది. ప్రస్తుతం భారత్ క్రమంగా డిజిటల్ చెల్లింపుల వైపు మళ్లుతోంది. దీంతో చెల్లింపుల సాధనాలను ప్రవేశపెట్టడానికి భారత్ సరైన మార్కెట్ అని మేం భావించాం. ఇది నిజంగానే మంచి ఫలితాలు కూడా ఇచ్చింది. ఇలా భారత మార్కెట్ కోసం రూపొందించిన సాధనాన్ని ప్రస్తుతం ఇతర దేశాల్లో కూడా అందుబాటులోకి తేవడంపై మా టీమ్ కసరత్తు చేస్తోంది' అని పిచయ్ పేర్కొన్నారు. ఫోన్ల ధరలను తగ్గించి, మరింత మందికి అందుబాటులోకి తెచ్చేందుకు గూగుల్ ప్రయత్నిస్తూనే ఉందన్నారు. 2004లో భారత్‌లో రెండు దేశీ తయారీ సంస్థలు మాత్రమే ఉండగా.. ఇప్పుడు 200 పైచిలుకు ఉన్నాయని పిచయ్ చెప్పారు. మరోవైపు, డేటా ప్రైవసీని కాపాడేందుకు అనుసరించాల్సిన ప్రమాణాల రూపకల్పనలో భారత్, అమెరికా కీలక పాత్ర పోషించగలవని ఆయన అభిప్రాయపడ్డారు. డిజిటల్ వాణిజ్య లావాదేవీలకు సమాచార మార్పిడి స్వేచ్ఛగా జరగడం ప్రధానమని, అయితే అదే సమయంలో యూజర్ల ప్రైవసీకి భంగం కలగకుండా ఉండటం కూడా ముఖ్యమేనని ఆయన పేర్కొన్నారు. సదస్సు సందర్భంగా పిచయ్ గ్లోబల్ లీడర్‌షిప్ పురస్కారాన్ని అందుకున్నారు.

### భారత్, ఇంగ్లండ్ మధ్యే వరల్డ్ కప్ ఫైనల్స్...

ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్, ఇంగ్లండ్ తలపడే అవకాశాలు ఉన్నాయని పిచయ్ జోస్యం చెప్పారు. భారత జట్టు గెలవాలని తాను కోరుకుంటున్నానన్నారు. 'భారత్, ఇంగ్లండ్ మధ్య ఫైనల్ పోరు ఉండొచ్చనుకుంటున్నాను. అయితే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ కూడా మంచి పటిష్టమైన జట్లే. వాటినీ తక్కువగా అంచనా వేయలేం' అన్నారాయన. క్రీడల్లో తనకు క్రికెట్ అంటే మక్కువని తెలిపిన పిచయ్.. అమెరికాలో తన క్రికెట్, బేస్‌బాల్ ఆటల అనుభవాలు వెల్లడించారు. 'నేను ఇక్కడికి వచ్చిన కొత్తల్లో బేస్‌బాల్ ఆడేందుకు ప్రయత్నించాను. అది కాస్త కష్టమైన ఆటే. మొదటి గేమ్‌లో బాల్‌ను గట్టిగా కొట్టా. క్రికెట్‌లో అలా చేస్తే గొప్ప షాట్ కాబట్టి.. గొప్పగానే ఆడాననుకున్నా. అందరూ వింతగా చూశారు. అలాగే క్రికెట్‌లో రన్ తీసేటప్పుడు బ్యాట్‌ను వెంట పెట్టుకుని పరుగెత్తాలి. ఇందులోనూ అలాగే చేశాను.. కానీ తర్వాత తెలిసింది.. బేస్‌బాల్ అనేది క్రికెట్ లాంటిది కాదని. ఏదైతేనేం.. నేను క్రికెట్‌కే కట్టుబడి ఉంటా' అన్నారు.

# జెట్‌పై ఇప్పటికీ ఆసక్తి..!

- బ్రిటన్ సంస్థ ఆదిగ్రో వెల్లడి
- ఎతిహాద్‌తో కలిసి కొనుగోలు యోచన
- ఎన్‌సీఎల్‌టీ విచారణ 20వ తేదీకి వాయిదా




**న్యూఢిల్లీ:** రుణ సంక్షోభంలో కూరుకుపోయిన జెట్ ఎయిర్‌వేస్ కొనుగోలుపై ఇప్పటికీ ఆసక్తిగానే ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన ఆదిగ్రో ఏవియేషన్ సంస్థ స్పష్టం చేసింది. చెక్కుతో తాము సిద్ధంగా ఉన్నామని, అయితే భారీ మొత్తం వెచ్చించే పరిస్థితి లేనందువల్ల వేరే సంస్థతో కలిసి కొనుగోలు చేయాలని భావిస్తున్నామని వివరించింది. ఇందులో భాగంగా ఎతిహాద్ ఎయిర్‌వేస్‌తో చర్చలు జరుగుతున్నాయని, స్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు పేర్కొంది. ఆదిగ్రూప్ వ్యవస్థాపకుడు సంజయ్ విశ్వనాథన్ ఈ విషయాలు వెల్లడించారు. ఆది గ్రూప్‌లో భాగమైన ఆది గ్రో ఏవియేషన్ గతంలో జెట్ ఎయిర్‌వేస్‌లో 24.9% వాటా కోసం రూ.2,500 కోట్లు ఆఫర్ చేసింది. 'మేం జెట్ ఎయిర్‌వేస్‌పై ఆసక్తిగానే ఉన్నాం, ఒంటరిగా ఈ లావాదేవీ పూర్తి చేయలేం. కంపెనీని నిర్వహణపరంగా టర్న్ అరౌండ్ చేయడానికి మాకు మరో సంస్థ తోడ్పాటు అవసరం' అన్నారాయన. ఒకవేళ ఎతిహాద్ గానీ కలిసిరాని పక్షంలో ఇతర కంపెనీలతోనైనా భాగస్వామ్యం కుదుర్చుకునే అవకాశాలు పరిశీలిస్తామని విశ్వనాథన్ చెప్పారు. ప్రస్తుతం మూడు సంస్థలు ఇందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన వివరించారు.

**బ్యాంకుల హెయిర్‌కట్ కీలకం...**

తాత్కాలికంగా మూతబడిన జెట్ ఎయిర్‌వేస్‌ను పునరుద్ధరించేందుకు సమయం మించిపోతోందని, తక్షణం చర్యలు అవసరమని విశ్వనాథన్ చెప్పారు. 'మా చెక్కు సిద్ధంగా ఉంది. 85–90 శాతం కాకుండా బ్యాంకులు 75 శాతం హెయిర్ కట్‌కు (ఇచ్చిన రుణంలో వదులుకునే మొత్తం) ఒప్పుకున్నా ఫర్వాలేదు' అని ఆయన పేర్కొన్నారు. జెట్ డీల్‌లో ఈ హెయిర్‌కట్ అంశం కూడా అవరోధంగా నిలుస్తోంది. కంపెనీకి బ్యాంకులు దాదాపు రూ.8,000 కోట్లకు పైగా రుణాలిచ్చాయి. జెట్ కొనుగోలు రేసులో ఉన్న ఎతిహాద్ ఎయిర్‌వేస్, హిందుజా గ్రూప్‌లు కనీసం 90 శాతం హెయిర్‌కట్ ఆశిస్తున్నాయి. కానీ ఎస్‌బీఐ సారథ్యంలోని బ్యాంకుల కన్సార్షియం ఇందుకు సిద్ధంగా లేదు. మరోవైపు, భారత వైమానిక రంగ వృద్ధికి, పెట్టుబడుల రాకకు తీసుకోదగిన చర్యలపై కేంద్ర ఏవియేషన్ శాఖ కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఖరోలాకు విశ్వనాథన్ లేఖ కూడా రాశారు. ఏవియేషన్‌లో ప్రస్తుతం 49%గా ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని 100%కి పెంచాలని, జెట్.. ఎయిరిండియాలో కొత్త ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చేలా రుణాల పునర్‌వ్యవస్థీకరణకు వెసులుబాటు, విమాన ఇంధనాన్ని జీఎస్‌టీ పరిధిలోకి తేవడం ద్వారా పన్ను భారం తగ్గేలా చూడటం వంటి అంశాలు పరిశీలించాలని కోరారు.

**ఎన్‌సీఎల్‌టీలో విచారణ వాయిదా..**

ఒకవేళ బ్యాంకుల హెయిర్‌కట్‌కు ప్రభుత్వం అనుమతులిచ్చినా.. ఇతరత్రా కూడా అడ్డంకులు ఉన్నాయి. జెట్‌కు నిర్వహణపరమైన రుణాలిచ్చిన రెండు సంస్థలు (షమన్ వీల్స్, గాగర్ ఎంటర్‌ప్రైజెస్) తమ బాకీలు రాబట్టుకునేందుకు ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడం వీటిలో ఒకటి. ఈ సంస్థల పిటీషన్లను పరిశీలించిన ఎన్‌సీఎల్‌టీ తదుపరి విచారణను జూన్ 20కి వాయిదా వేసింది.

### జెట్ షేరు 18% డౌన్

సంక్షోభంలో ఉన్న జెట్ ఎయిర్‌వేస్ షేర్లను జూన్ 28 నుంచి ట్రేడ్ ఫర్ ట్రేడ్ సెగ్మెంట్‌లోకి మార్చడం ద్వారా లావాదేవీలపై ఆంక్షలు విధించాలని స్టాక్ ఎక్స్ఛేంజీలు నిర్ణయించడంతో కంపెనీ షేరు గురువారం భారీగా పతనమైంది. ఏకంగా 18 శాతం క్షీణించింది. బీఎస్ఈలో 16.71 శాతం క్షీణించి రూ. 91.95 వద్ద క్లోజయ్యింది. ఒక దశలో 23.18 శాతం దాకా పతనమై రూ. 84.80కి కూడా పడిపోయింది. షేరు ధర పతనంతో జెట్ ఎయిర్‌వేస్ మార్కెట్ విలువ బీఎస్ఈలో రూ. 209 కోట్లు క్షీణించి రూ.1,045 కోట్లకు తగ్గింది.




# ఫోర్బ్స్ ప్రపంచ దిగ్గజాల్లో ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోని అతిపెద్ద పబ్లిక్ కంపెనీల జాబితాలో దేశీ కంపెనీలైన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీలు తమ సత్తాను చాటాయి. ఫోర్బ్స్ మ్యాగజైన్ విడుదలచేసిన 'వాల్డ్స్ 2,000 లార్జెస్ట్ పబ్లిక్ కంపెనీస్'లో మొత్తం 57 భారత కంపెనీలు స్థానం సంపాదించగా.. ఆర్ఐఎల్ ఏకంగా 71వ ర్యాంకును, హెచ్‌డీఎఫ్‌సీ 332వ ర్యాంకును సాధించాయి. ప్రత్యేకించి ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో ఆర్ఐఎల్ 11వ ర్యాంకును పొందగా.. ప్రపంచంలోనే మొదటి స్థానంలో రాయల్ డచ్ షెల్ నిలిచింది. కన్స్యూమర్ ఫైనాన్స్ రంగంలో హెచ్‌డీఎఫ్‌సీ 7వ స్థానంలో ఉండగా.. అమెరికన్ ఎక్స్‌ప్రెస్ ఈ రంగంలోనే అతిపెద్ద కంపెనీగా జాబితాలో చోటుదక్కించుకుంది. మరిన్ని భారత కంపెనీల జాబితాలో.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 209వ స్థానం, ఓఎన్‌జీసీ 220వ ర్యాంక్, ఇండియన్ ఆయిల్ 288వ స్థానంలో నిలిచాయి. టాప్–500లో టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ అండ్ టీ, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీలు చోటు దక్కించుకున్నాయి. ఆ తరువాత ర్యాంకులు పొందిన భారత కంపెనీల్లో.. టాటా స్టీల్, కోల్ ఇండియా, కొటక్ మహీంద్ర బ్యాంక్, భారత్ పెట్రోలియం, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ఐటీసీ, భారత ఎయిర్‌టెల్, విప్రో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్ గ్రిడ్, హిందాల్కో, హెచ్‌సీఎల్ టెక్, ఎం అండ్ ఎం, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, గెయిల్, పీఎన్‌బీ, గ్రాసిమ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పవర్ ఫైనాన్స్, కెనరా బ్యాంక్‌లు ఉన్నాయి.

**టాప్10లో ఐసీబీసీ, జేపీ మోర్గాన్**

వరుసగా ఏడవసారి కూడా ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా (ఐసీబీసీ) టాప్–1 స్థానంలో నిలిచింది. ఆ తరువాత వరుసగా.. జేపీ మోర్గాన్, చైనా కన్‌స్ట్రక్షన్ బ్యాంక్, అగ్రికల్చరల్ బ్యాంక్ ఆఫ్ చైనా, బ్యాంక్ ఆఫ్ అమెరికా, ఆపిల్, పింగ్ యాన్ ఇన్సూరెన్స్ గ్రూప్, బ్యాంక్ ఆఫ్ చైనా, రాయల్ డచ్ షెల్, వెల్స్ ఫార్గోలు జాబితాలో ఉన్నాయి. మొత్తం 61 దేశాలకు చెందిన అతిపెద్ద కంపెనీలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఈ జాబితా విడుదలైందని ఫోర్బ్స్ తెలిపింది. 2,000 కంపెనీల తుది జాబితాలో 575 అమెరికా కంపెనీలు.. చైనా, హాంకాంగ్ (309), జపాన్ (223) కంపెనీలు ఉన్నాయి.

## ఇండియాబుల్స్‌పై పిటిషన్ వెనక్కి

### 12 శాతం పెరిగిన షేర్

**ముంబై:** ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్(ఐబీహెచ్ఎఫ్)కు గురువారం భారీ ఊరట లభించింది. ఈ కంపెనీలో రూ.98,000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ చేయాలంటూ సుప్రీం కోర్ట్‌లో అభయ్ యాదవ్ అనే వ్యక్తి ఒక పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.




ఈ పిటిషన్‌ను గురువారం నాడు అభయ్ యాదవ్ ఉపసంహరించుకున్నాడు. పిటిషన్‌లో పేర్కొన్న ఆరోపణలు, ఫిర్యాదులు తనకు తెలియవని, తాను సంతకం చేసిన డాక్యుమెంట్లను దుర్వినియోగం చేసి కంపెనీకి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడానికి ఉపయోగించారని యాదవ్ వెల్లడించారని కంపెనీ పేర్కొంది. యాదవ్ పిటిషన్ కారణంగా గత రెండు రోజుల్లో ఐబీహెచ్ఎఫ్ షేర్ దాదాపు 15% నష్టపోయింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.7,000 కోట్ల మేర హరించుకుపోయింది. పిటీషన్ ఉపసంహరణతో గురువారం బీఎస్ఈలో ఐబీహెచ్ఎఫ్ షేర్ 12% లాభపడి రూ.694 వద్ద ముగిసింది.

## పీడబ్ల్యూసీ ఆరోపణలు నిరాధారమైనవి

### రిలయన్స్ క్యాపిటల్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** తమ ఖాతాల విషయంలో ఆడిటింగ్ సంస్థ ప్రైస్ వాటర్‌హౌస్ అండ్ కంపెనీ చార్టర్డ్ అకౌంటెంట్స్ (పీడబ్ల్యూసీ) వెల్లడించిన విషయాలు నిరాధారమైనవని, అసమంజసమైనని రిలయన్స్ క్యాపిటల్ వ్యాఖ్యానించింది. ఆడిట్ కమిటీతో కనీసం సంప్రదింపులు కూడా జరపకుండా పీడబ్ల్యూసీ తొందరపాటుగా వ్యవహరించిందని ఆరోపించింది. రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ హోం ఫైనాన్స్ సంస్థలకు పీడబ్ల్యూసీ ఆడిటింగ్ సేవలు అందించేది.



అయితే, 2018–19 లెక్కలకు సంబంధించి ఈ కంపెనీల నుంచి సంతృప్తికరమైన వివరణలు అందలేదని, అనేక సార్లు ఆడిట్ కమిటీ భేటీ ఏర్పాటు చేయమన్నా ఫలితం లేదన్న కారణాలతో పీడబ్ల్యూసీ ఆడిటింగ్ బాధ్యతల నుంచి తప్పుకుంది. ఈ నేపథ్యంలోనే రిలయన్స్ క్యాప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పీడబ్ల్యూసీ పేర్కొన్న అంశాలపై 15 రోజుల్లోగా స్వతంత్ర నివేదిక రూపొందించే బాధ్యతను ప్రస్తు ఆడిటింగ్ సంస్థ పాఠక్ హెచ్.డీ అండ్ అసోసియేట్స్‌కు ఆడిట్ కమిటీ అప్పగించిందని రిలయన్స్ క్యాప్ తెలిపింది.

# ఆరు క్వార్టర్ల కనిష్టానికి ఆదాయం

- సెంటిమెంట్ బలహీనం
- అంతంతమాత్రంగానే డిమాండ్
- మెరుగుపడిన మార్జిన్లు: ఇక్రా

**ముంబై:** భారత కంపెనీల ఆదాయాలు గత ఆర్థిక సంవత్సరం నాలుగో క్వార్టర్‌లో అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ కంపెనీల ఆదాయ వృద్ధి పది శాతంగానే ఉందని, ఇది ఆరు క్వార్టర్ల కనిష్ట స్థాయి అని ఇక్రా తాజా నివేదిక పేర్కొంది. ఈ రేటింగ్ ఏజెన్సీ, వివిధ రంగాల నుంచి కొన్ని కంపెనీల ఆర్థిక ఫలితాలను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది. వినియోగదారుల సెంటిమెంట్స్ బలహీనంగా ఉండటం, డిమాండ్ మందకొడిగా ఉండటం వల్ల ఆదాయాలు ఆరు క్వార్టర్ల కనిష్ట స్థాయికి పడిపోయాయంటున్న ఈ నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే...,



- ➡ వినియోగదారులతో అనుసంధానమైన రంగాల కంపెనీల ఆదాయ వృద్ధి గత క్యూ4లో 4 శాతంగానే నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో ఇది 28 శాతంగా ఉండటం విశేషం.
- ➡ గత క్యూ3లో 51 శాతంగా ఉన్న కమోడిటీ సంబంధిత రంగాల కంపెనీల ఆదాయ వృద్ధి గత క్యూ4లో 12.4 శాతంగానే ఉంది.
- ➡ వినియోగ సంబంధిత ప్రయాణికుల వాహనాలు, టూ వీలర్లు, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎమ్‌సీజీ రంగాల్లో గత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ భాగం నుంచి బలహీనత బాగా ఉంది
- ➡ గత క్యూ4లో ఈ కంపెనీల నిర్వహణ మార్జిన్ 44 బేసిస్ పాయింట్లు తగ్గింది. సీక్వెన్షియల్‌గా చూస్తే 23 బేసిస్ పాయింట్లు తగ్గి 16.6 శాతానికి చేరింది.
- ➡ ఎయిర్‌లైన్స్, సిమెంట్, కన్స్యూమర్ ఫుడ్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ వంటి కంపెనీల మార్జిన్లు మాత్రం సీక్వెన్షియల్‌గా చూస్తే మెరుగుపడ్డాయి. ఈ కంపెనీలు ఉత్పత్తుల ధరలను పెంచడం, దిగుమతుల వ్యయాలు తక్కువగా ఉండటం, కమోడిటీ ధరలు తక్కువగా ఉండటం దీనికి ప్రధాన కారణాలు.
- ➡ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సిమెంట్‌కు డిమాండ్ 8 శాతంగానూ, ఉక్కుకు డిమాండ్ 7 శాతంగానూ ఉండొచ్చు.
- ➡ టెలికం రంగంలోని కంపెనీల పనితీరు కూడా అంతంతమాత్రంగానే ఉండొచ్చు. రుణ భారం తగ్గినా, నిర్వహణ లాభాలు పెరిగినా, సమీప భవిష్యత్తులో మాత్రం టెలికం కంపెనీల పనితీరు బలహీనంగానే ఉండనున్నది.
- ➡ నివాసిత రియల్టీ రంగంలో కూడా ప్రతికూల పరిస్థితులు కొనసాగుతాయి. నిధుల లభ్యత సమస్య కారణంగా రుణాల లభ్యత క్లిష్టంగా మారడం, అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉండనుండటం దీనికి కారణాలు.

### 'వాహన' డిమాండ్ అంతంత మాత్రమే

వాహన రంగంలో డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండగలదని ఇక్రా అంచనా వేసింది. వినియోగదారుల సెంటిమెంట్ బలహీనంగా ఉండటం, వాహనాల ధరలు పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ మందకొడిగా ఉండటం, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగంలో నిధుల కొరత సమస్య కారణంగా వాహన రుణాలు అంత సులభంగా లభించకపోవడం దీనికి కారణాలని ఈ సంస్థ పేర్కొంది. భారత్ స్టేజ్–సిక్స్ నిబంధనలు వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుండటంతో ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగం నుంచి వాహన రంగం ముఖ్యంగా వాణిజ్య వాహన రంగం పుంజుకోవచ్చని తెలిపింది. వాహన విక్రయాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, వాహన విడిభాగాల పరిశ్రమ మాత్రం ఈ ఆర్థిక సంవత్సరంలో 10–11 శాతం వృద్ధిని సాధిస్తుందని ఈ సంస్థ అభిప్రాయపడింది.

# గ్రూపు కంపెనీల మధ్య మరింత సహకారం అవసరం

- కలసి పనిచేస్తేనే సరైన ఫలితాలు...
- టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



**ముంబై:** భారీ సంఖ్యలో ఉన్న టాటా గ్రూపు కంపెనీల మధ్య మరింత సహకారం అవసరమని ఆ గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. ''గ్రూపు కంపెనీలు కలసి పనిచేసే విషయంలో కొంత మెరుగుదల అయితే ఉంది. అయితే, ఇంకా ఎంతో మెరుగుపడాలి. మరింత సహకరించుకోవాల్సిన అవసరం, అవకాశాలు ఉన్నాయి'' అని అన్నారు. టాటా గ్రూపు ఫ్లాగ్‌షిప్ కంపెనీ అయిన టీసీఎస్ వాటాదారుల వార్షిక సమావేశం (ఏజీఎం) గురువారం జరగ్గా, వాటాదారులను ఉద్దేశించి చంద్రశేఖరన్ ప్రసంగించారు. 2017 ఫిబ్రవరిలో టాటా సన్స్ చైర్మన్ బాధ్యతల్లోకి అడుగుపెట్టిన చంద్రశేఖరన్, ఆ తర్వాత వందల సంఖ్యలో ఉన్న గ్రూపు కంపెనీల మధ్య ఏకీకరణ, సమన్వయం దిశగా ప్రణాళికలను అమల్లో పెట్టారు. నీటి వినియోగాన్ని, అదే విధంగా కార్బన్ డైఆక్సైడ్ విడుదలను తగ్గించే విషయంలో సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నట్టు చంద్రశేఖరన్ తెలిపారు. రూ.కోటి అంతకంటే ఎక్కువ వేతనం తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరిగిపోవడంపై వాటాదారుల నుంచి ప్రశ్నలు ఎదురుకాగా... టీసీఎస్‌లో సీనియర్ ఉద్యోగులకు ఇంకా ఎక్కువే వేతనాలను చెల్లించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. టీసీఎస్ ఆదాయంలో ఉద్యోగుల ఖర్చు 53 శాతమేనని, ఇతర పోటీ సంస్థలతో పోలిస్తే ఇది చాలా తక్కువన్న విషయాన్ని వివరించారు.

**మహిళలకు సముచిత ప్రాధాన్యం..**

టీసీఎస్ బోర్డులో మహిళలకు తగినంత ప్రాతినిధ్యం ఉన్నట్టు ఎన్ చంద్రశేఖరన్ చెప్పారు. 4 లక్షల మంది ఉద్యోగుల్లో 36 శాతం మంది మహిళలేనన్నారు. యాజమాన్యంలో మరింత వైవిధ్యం అవసరమన్నారు. లోక్‌సభలో ప్రాతినిధ్యం ఆధారంగానే రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చినట్టు చెప్పారు. ఇటీవల ముగిసిన ఎన్నికల ముందు పార్టీలకు అన్నింటికీ కలిపి టాటా గ్రూపు రూ.600 కోట్లను విరాళంగా ఇచ్చింది. ఇందులో ఒక్క టీసీఎస్ వాటాయే రూ.220కోట్లు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన విరాళాలతో పోలిస్తే 20 రెట్లు ఎక్కువ. డిజిటల్ సేవల ఆదాయం వార్షికంగా 50 శాతం చొప్పున వృద్ధి చెందుతోందని, 2019 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయం 20 బిలియన్ డాలర్లలో 6 బిలియన్ డాలర్లు డిజిటల్ రూపంలో వచ్చినదేనని టీసీఎస్ ఎండీ, సీఈవో రాజేష్ గోపినాథన్ తెలిపారు.

# యస్ బ్యాంక్ బోర్డులో మళ్లీ చేరే ప్రసక్తే లేదు

**మాజీ సీఈఓ రాణా కపూర్ స్పష్టీకరణ**




**ముంబై:** యస్ బ్యాంక్‌లో మళ్లీ పాగా వేయనున్నారన్న వార్తలను యస్ బ్యాంక్ మాజీ సీఈఓ రాణా కపూర్ తోసిపుచ్చారు. ప్రస్తుత సీఈఓ రవ్‌నీత్ గిల్, ప్రస్తుత డైరెక్టర్ల బోర్డ్‌పై పూర్తి విశ్వాసం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత సంధి కాలం నుంచి యస్‌బ్యాంక్ విజయవంతంగా బయటపడగలదని పేర్కొన్నారు. రాణా కపూర్ వారసుడిగా రవ్‌నీత్ గిల్ ఈ ఏడాది మార్చిలో సీఈఓగా పగ్గాలు చేపట్టారు. భారీ ప్రక్షాళన చేపట్టిన ఫలితంగా గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక కాలంలో యస్ బ్యాంక్‌కు రూ.1,500 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. రాణా కపూర్‌కు యస్ బ్యాంక్‌లో 9% వాటా ఉంది. బుధవారం జరిగిన ఏజీఎమ్‌లో 19 తీర్మానాలకు రాణా కపూర్ ప్రమోటర్ గ్రూప్ పూర్తి మద్దతు ప్రకటించింది. కాగా ఈ ఏజీఎమ్‌కు ముందే హఠాత్తుగా బ్యాంక్ ఇద్దరు డైరెక్టర్లు–అజయ్ కుమార్, ముకేశ్ సభర్వాల్‌లు రాజీనామా చేయడంతో పలు ఊహాగానాలు చెలరేగాయి. కాగా యస్ బ్యాంక్ రేటింగ్‌ను తగ్గిస్తామని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ బుధవారం హెచ్చరించింది. నగదు లభ్యత సమస్యతో విలవిలలాడుతున్న నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్, రియల్టీ కంపెనీలకు యస్‌బ్యాంక్ భారీగా రుణాలిచ్చిందని, ఫలితంగా బ్యాంక్ పనితీరు ప్రభావితం కానున్నదని మూడీస్ పేర్కొంది. మరోవైపు గురువారం స్విస్ బ్రోకరేజ్ సంస్థ, యూబీఎస్ యస్ బ్యాంక్ టార్గెట్ ధరను రూ.170 నుంచి రూ.90కు తగ్గించింది. మార్జిన్లు, ఫీజు ఆదాయం, రుణ వృద్ధి భారీగా క్షీణించనున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో యస్‌బ్యాంక్ షేర్ గురువారం 13 శాతం నష్టపోయి రూ.117 వద్ద ముగిసింది.

# కార్పొరేట్ బాండ్లపై పన్ను రాయితీలు!

- టర్మ్ బీమా ప్రీమియంపైనా అదనపు పన్ను రాయితీ
- కేంద్రానికి ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సూచనలు




**న్యూఢిల్లీ:** రిటైల్ ఇన్వెస్టర్లకు పన్ను రాయితీలను మరింత విస్తరించాలని ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ కేంద్ర ఆర్థిక శాఖకు సూచించాయి. కార్పొరేట్ బాండ్లలో ఇన్వెస్ట్‌మెంట్‌పై పన్ను రాయితీలు ఇవ్వాలని, అలాగే, టర్మ్ బీమా ప్లాన్ల ప్రీమియంపైనా అదనపు పన్ను రాయితీలు కల్పించాలని కోరాయి. జూలై 5న కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ ముందస్తుగా వివిధ వర్గాలు, సంస్థలు, నిపుణుల అభిప్రాయాలను ఆర్థిక మంత్రిత్వ శాఖాధికారులు తెలుసుకునే ప్రక్రియను చేపట్టారు. ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలకు ప్రత్యేకంగా నిధులు అందించేందుకు ఓ విండోను ఏర్పాటు చేయాలని, ఈ రంగంలో ఫైనాన్షియల్ సెక్టార్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎఫ్ఎస్‌డీసీ) పాత్రను పెంచాలని ఫైనాన్షియల్ అండ్ క్యాపిటల్ మార్కెట్ సంస్థలు సూచించాయి. అలాగే, ప్రాంతీయ బ్యాంకుల్లోకి నిధుల లభ్యతను తీసుకురావాలని కోరాయి.

**ఇరువురికీ ప్రయోజనం**

''కార్పొరేట్ బాండ్ మార్కెట్‌ను ఏ విధంగా వృద్ధి చేయాలన్న దానిపై చర్చ జరిగింది. ప్రస్తుతం రిటైల్ ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తున్నారు. నేరుగా ఇన్వెస్ట్ చేసే రిటైల్ ఇన్వెస్టర్ల కూడా పన్ను రాయితీలను విస్తరింపజేస్తే వారితోపాటు కార్పొరేట్ బాండ్ మార్కెట్ కూడా లాభపడుతుంది'' అని ఐడీబీఐ బ్యాంకు ఎండీ, సీఈవో రాకేశ్‌శర్మ తెలిపారు. పెట్టుబడులను ప్రోత్సహించేందుకు గాను ఎన్‌పీఎస్ పథకం మాదిరే టర్మ్ ప్లాన్లకు అదనపు పన్ను రాయితీలను కల్పించాలని సూచించినట్టు బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) చైర్మన్ సుభాష్ చంద్ర కుంతియా పేర్కొన్నారు. ప్రభుత్వ చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను సమీక్షించాలని, బ్యాంకింగ్ రంగంలో ఎన్‌పీఏలకు కేటాయింపులను ఓ కమిటీ ఏర్పాటు ద్వారా సమీక్షించాలని, డెట్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) తరహా పలు పన్నుల హేతుబద్ధీకరణ, ప్రత్యేక బాండ్ ఎక్స్ఛేంజ్‌ను ఏర్పాటు చేయాలని, ఇన్విట్‌లలో ఇన్వెస్ట్ చేసేందుకు బ్యాంకులను అనుమతించాలన్న సూచనలు ఆర్థిక శాఖకు వచ్చాయి.

**పన్ను రాయితీలపై చర్చ**

''ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రుణాలకు సంబంధించి, ఆర్థిక రంగ పునరుత్తేజం, ఎంఎస్ఎంఈ, ఎగుమతుల విభాగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఏ విధమైన పన్ను రాయితీలు ఇవ్వొచ్చన్న దానిపై ఎన్నో సూచనలు వచ్చాయి'' అని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతానికి లిక్విడిటీ అన్నది పెద్ద సవాలు కాదన్నారు పీఎన్‌బీ ఎండీ, సీఈవో సునీల్ మెహతా.

# అలారం పీక నొక్కారో పీడిస్తుందంతే!

సరిగ్గా పొద్దున్నే ఏడు గంటలకు లేవానుకుని అలారం పెట్టుకుని మరీ పడుకుంటారు. ఉదయం అది మోగగానే దాని పీకనొక్కేసి మళ్లీ దుప్పట్లో దూరిపోతున్నారా అయితే మీ మెదడును మీరు కన్ఫ్యూజ్ చేస్తున్నట్లేనని ఇటీవల వైద్యులు తేల్చి చెప్పారు. అలారాన్ని తాత్కాలికంగా ఆపేసి మరో 10 నిమిషాలు పడుకుందాంలే అనుకుని పడుకోవడం భ్రమ మాత్రమేనట. నిజానికి మన మెదడు అలారం మోతతో మెలకువకు సిద్ధమయ్యాక తిరిగి వెనక్కి వెళ్లడం నిద్రావస్థ సైకిల్‌కు భంగం చేకూరుస్తుందని, అదే ఆనాటి మీ ఉత్సాహాన్ని దెబ్బతీస్తుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఇలా అలారం మోగగానే దాని తలపై ఒక్కటిచ్చి తిరిగి పడుకోవడం అలవాటుగా మారిందంటే దీర్ఘకాలంలో దాని దుష్ఫలితాలు తప్పవంటున్న వైద్యులు.

## ఉత్సాహాన్ని ఊదేసే స్లీప్ ఇనర్షియా..

నిద్రలేమి బీపీ, జ్ఞాపక శక్తి తగ్గడం తదితర అనేక శారీరక, మానసిక అనారోగ్యాలకు కారణమౌతుంది. కంటినిండా నిద్రపోతే మరునాడు మీలో ఉత్సాహం పొంగిపొర్లుతుందని శాస్త్రీయంగా నిరూపించారు. అదే నిద్రనుంచి మేల్కొనడానికి అలారం పెట్టుకొని దాన్ని తాత్కాలికంగా ఆపేసి, తిరిగి ముడుచుకొని పడుకుందామనుకుంటే మాత్రం అది మరిన్ని సమస్యలకు దారితీస్తుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. అలా చేయడం వల్ల నిద్రాభంగం అవుతుందే తప్ప తిరిగి నిద్రలోకి జారుకోవడం అంటూ ఉండదని స్లీప్ ఎక్స్‌పర్ట్స్ తేల్చి చెబుతున్నారు. అలారాన్ని ఆపేసి పడుకోవడంతో మీ శరీరం, మీ మెదడు పడుకోవాలో, మేల్కోవాలో అర్థం కాని స్థితిలోకి వెళ్తుందట దాన్నే నిద్రలో నిద్ర (స్లీప్ ఇనర్షియా) అంటారు. ఈ స్థితి రోజంతా మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. నిద్ర మేల్కోవడానికి ఆ పదినిమిషాలూ బద్ధకించడం వల్ల ఉత్సాహానికి బదులు ఆ రోజంతా బద్ధకాన్ని కొనితెచ్చుకున్నట్టవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## నిద్రలో రెండు దశలు

మన నిద్ర రెండు భాగాలుగా ఉంటుంది. తొలి పార్శ్వం కనుగుడ్లు కదలకుండా(నాన్‌రాపిడ్ ఐ) ఉండే నిద్ర. రెండవ భాగం కనుగుడ్లు వేగంగా కదులుతుండే (రాపిడ్ ఐ) నిద్ర. కనుగుడ్లు కదలకుండా ఉండే నిద్ర నుంచి కనుగుడ్లు కదిలే నిద్ర రెండూ రాత్రంతా ఒక సైకిల్‌లా ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే ఉంటాయి. అయితే నిద్రపట్టిన వెంటనే వచ్చే స్థితిలో కనుగుడ్ల కదలిక ఉండదు. ఇది దీర్ఘ నిద్రను సూచిస్తుంది. ఆ తరువాత వచ్చే నిద్రావస్థలో మాత్రం కనుగుడ్లు కదులుతూ ఉంటాయి. ఇది మెలకువ స్థితిలో ఉండే నిద్ర. మంచి నిద్రపట్టడం అంటే ఈ లయబద్ధమైన నిద్రావస్థకి భంగం వాటిల్లలేదని అర్థం. అలాకాకుండా మెలకువకోసం పెట్టుకున్న అలారం మోగిన వెంటనే లేవకుండా తిరిగి నిద్రపోవడం శారీరక మానసిక సహజక్రియని అడ్డుకుంటున్నట్లే.

# ప్రైవేట్ స్కూళ్లకు ఫైర్ ఎన్‌వోసీకి గ్రీన్ సిగ్నల్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అగ్నిమాపక శాఖ నుంచి అనుమతుల్లేని పాఠశాలలకు ఊరట లభించనుంది. దీంతో గత రెండేళ్లుగా నలుగుతున్న పాఠశాలల గుర్తింపు సమస్య తీరనుంది. అయితే 2009 నాటికి ఉన్న పాఠశాలలకు సెట్‌బ్యాక్ అక్కర్లేదని, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేస్తే అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2009 తర్వాత ఏర్పాటు చేసిన స్కూళ్లలో మాత్రం ఫైర్ ఇంజన్ స్కూల్ భవనం చుట్టూ తిరిగేలా సెట్‌బ్యాక్ ఉండాల్సిందే. దీంతో దాదాపు 80 శాతం స్కూళ్లకు అగ్నిప్రమాద సమస్యలు తీరనున్నాయి. తమిళనాడులోని కుంభకోణంలో జరిగిన ప్రమాదం తర్వాత ఫైర్ ఎన్‌వోసీ లేకుండా పాఠశాలలకు గుర్తింపు ఇవ్వొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ లేకుండా విద్యా శాఖ గుర్తింపు ఇవ్వట్లేదు. భవన నిర్మాణ నిబంధనల ప్రకారం పాఠశాలల భవనాలకు అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ ఇవ్వాలంటే పాఠశాల భవనం చుట్టూ అగ్నిమాపక వాహనం తిరిగేలా సెట్ బ్యాక్స్ ఉం డాలి. ప్రస్తుతం రాష్ట్రం లోని పాఠశాలలకు అవేవీ లేకపోవడంతో అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీలు ఇవ్వడం మానేసింది. దీంతో గత రెండేళ్లుగా పదేళ్ల గుర్తింపు కాలం పూర్తయిన పాఠశాలలు ఫైర్ ఎన్‌వోసీ లేకుండానే మళ్లీ గుర్తింపు పునరుద్ధరణకుగాను విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్నాయి. ఫైర్ ఎన్‌వోసీ లేనందున విద్యాశాఖ వాటికి గుర్తింపు ఇవ్వలేదు. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు ప్రభుత్వాన్ని ఆశ్రయించాయి. ఇటీవల హోం శాఖ, విద్యా శాఖ అధికారులతో సీఎస్ సమీక్షించారు. సుప్రీంకోర్టు తీర్పును మరోసారి పరిశీలించి, 2009లో ఆ తీర్పు వచ్చే నాటికి ఉన్న స్కూళ్లలో అగ్ని మాపక పరికరాలు ఏర్పాటు చేస్తే చాలని పేర్కొంది.

# బదిలీలు చేయండి

- పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి
- రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో 11 అంశాలపై తీర్మానాలు

సాక్షి, హైదరాబాద్: పన్నుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే సాధారణ బదిలీలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. వేసవి సెలవులు కూడా ముగిసి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వెంటనే శాఖ పరిధిలో బదిలీలు చేపట్టాలని, గత బదిలీల్లో ఇబ్బందులు పడ్డ సిబ్బందికి మళ్లీ బదిలీలు జరపాలని గురువారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. సంఘం గౌరవాధ్యక్షుడు టి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సరూర్‌నగర్ డివిజన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. పన్ను వసూళ్లలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు ఉద్యోగులందరినీ ఒకతాటిపైకి తెచ్చిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, కమిషనర్ అనిల్‌కుమార్‌లకు సంఘం అభినందనలు తెలిపింది. అనంతరం శాఖ పరిధిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి 11 అంశాలపై తీర్మానాలు చేసింది. హైదరాబాద్‌లో పనిచేస్తున్న సిబ్బందికి 30 శాతం హెచ్‌ఆర్‌ఏ అమలు చేయాలని, ఈఐయూలో పనిచేస్తున్న వారికి 30 శాతం అదనపు వేతనం ఇవ్వాలని, 2019 సంవత్సరానికిగాను సాధారణ బదిలీలు చేపట్టాలని, గత బదిలీల్లో ఇబ్బందులు పడ్డవారికి మళ్లీ బదిలీలు చేపట్టాలని, మినిస్టీరియల్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని, పీఆర్సీలో పన్నుల శాఖ ఉద్యోగులకు ప్రత్యేక స్కేళ్లు ఇప్పించాలని, ఉద్యోగులకు సొంత వాహనాలు సమకూర్చాలని, డీలర్లుండే ప్రాంతంలోనే శాఖాపరమైన కార్యకలాపాలు నిర్వహించేందుకుగాను అధునాతన కార్యాలయాలను ఏర్పాటు చేయాలని, అన్ని కేటగిరీల్లో సీనియార్టీ లిస్టు తయారు చేయాలని, అదనపు డీడీవో కోడ్‌లు ఏర్పాటుచేసి వేతనాలు, పన్ను వసూళ్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని తీర్మానాలు చేశారు. త్వరలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌లను కలిసి ఈ తీర్మానాలను నివేదించాలని నిర్ణయించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎం.వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.స్వర్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 18 నుంచి జీవాలకు నట్టల మందు: తలసాని

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 18 నుంచి 25 వరకు జీవాలకు నట్టల నివారణ మందు వేయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గురువారం ఆయన సచివాలయం నుంచి జిల్లాల పశువైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని 3.25 కోట్ల గొర్రెలు, మేకలకు ఉచితంగా ఈ మందు వేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నట్టల నివారణ మందు కోసం ప్రభుత్వం రూ.22 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోపాలమిత్రలకు నెలకు రూ.8,500 రూపాయల వేతనం చెల్లిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్యారా వెట్, గోపాలమిత్రల సేవలను వినియోగించుకొని పకడ్బందీగా నట్టల నివారణ కార్యక్రమం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.










# ప్రగతిభవన్ ముట్టడికి సెలక్టెడ్ టీచర్ల యత్నం

- పోస్టింగ్ ఇవ్వకుంటే సామూహిక నిరశన
- టీఆర్‌టీ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ హెచ్చరిక
- ఏడేళ్లుగా ఉపాధ్యాయ నియామకాల్లేవని ఆవేదన
- ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు, రోడ్డుపై బైఠాయింపు

హైదరాబాద్: టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) అభ్యర్థులు ఉద్యమబాట పట్టారు. సీఎం నివాస భవనాన్ని ముట్టడించేందుకు యత్నించారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులందరికీ నియామక ఉత్తర్వులివ్వాలని, లేనియెడల సామూహిక ఆమరణ దీక్షకు దిగుతామని టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ హెచ్చరించారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులందరికీ తక్షణం నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ గురువారం గ్రీన్‌లాండ్స్‌లోని సీఎం అధికారిక నివాసమైన ప్రగతి భవన్ ముట్టడికి యత్నించారు. విషయం ముందే తెలుసుకున్న పోలీసు అధికారులు భారీగా పోలీసులను మోహరించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఆ ప్రాంతమంతా పోలీసులతో నిండిపోయింది. అటుగా వచ్చిన ఆందోళనకారులందరినీ అరెస్ట్ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులంతా తమకు న్యాయం చేయాలంటూ ప్రగతిభవన్ ముందున్న రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా ఎత్తుకెళ్లి వ్యాన్లలో గోషామహల్ స్టేడియానికి తరలించారు. అనంతరం టీఆర్‌టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2017 అక్టోబర్‌లో టీఎస్పీఎస్సీ ద్వారా 8,792 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి 2018 ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహించిందన్నారు. అనంతరం ఆగస్టులో సర్టిఫికెట్ల తనిఖీ కూడా చేసిందని, ఇప్పటివరకు ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వకుండా విద్యావాలంటీర్లను మళ్లీ రెన్యువల్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే క్రమబద్ధీకరణ పేరుతో 3,500 పాఠశాలలను మూసేశారని ఆరోపించారు.

## మద్దతు పలికిన ఆర్.కృష్ణయ్య

ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వకపోగా సీఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినవారిని పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తప్పుపట్టారు. పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లిన అభ్యర్థులంతా గోషామహల్ పోలీసుస్టేషన్లో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కృష్ణయ్య సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం వారందరికి నియామక ఉత్తర్వులు ఇచ్చేవరకు తమ పోరాటం ఆగదన్నారు. రాష్ట్రంలో 50 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 8,792 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేసి వాటిని కూడా భర్తీ చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు.

## నిరుద్యోగ జేఏసీ..

ఎంపికైన అభ్యర్థులందరికీ తక్షణం నియామకపు ఉత్తర్వులు ఇవ్వాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకం ఇవ్వాలని అడిగితే పోలీసులతో అరెస్ట్ చేయిస్తారా అని ప్రశ్నించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, రామకృష్ణ, శేషు, దత్తు, అనిల్, సంతోష్ తదితరులున్నారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792